

# రావిశాస్త్రి

894.8274
SAS

## వ్యాసావళి-4

అమూల్యాభిప్రాయాలు

C2

కృష్ణశాస్త్రి

వ్యాసావళి-4

అమూల్యాభిప్రాయాలు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10371

11

సంపాదకులు :

బాలాంత్రపు నళినీకాంతరావు
బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

సహకారం :

పాలగుమ్మి విశ్వనాథం
బాలాంత్రపు రజనీకాంతరావు
కురుమెళ్ల వేంకటరావు
కె. వి. రమణారెడ్డి
నిడమర్తి నిర్మలా దేవి
పి. బి. శ్రీనివాస్
వెలమకన్ని సుబ్రహ్మణ్య శర్మ
వింజమూరి ప్రభాకరం
అవసరాల అనసూయా గిరి
వింజమూరి సీతాదేవి
బి. గోపాలం
పి. ఎస్. గోపాలకృష్ణ

పర్యవేక్షణ :

పాలగుమ్మి పద్మరాజు
ఎ. ఎస్. రామన్

J11 A0LA102B137

# కృష్ణశాస్త్రి

## వ్యాసావళి-4

-అమూల్యాభిప్రాయాలు-

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10371

రాజహంస ప్రచురణలు
9, జగదాంబాళ్ స్ట్రీట్, మద్రాసు-600 017

KRISHNA SASTRI'S ESSAYS - 4

**Amulyabhiprayalu**

© D. S. Sastri (Bujjai)

894.8274
SAS

*First Edition* :
February 1982

*Published by*
RAJAHAMSA PRACHURANALU,
**9, Jagadambal Street, Madras - 17.**

*Printed at*
STREE SEVA MANDIR PRESS
MADRAS - 17

*Cover Design:*
BUJJAI

*Cover Printing*
VIKRANTH SCREENS

Price :
Rs. **12-50**

# విషయ క్రమం


| | |
|---|---|
| కృతజ్ఞత | vii |
| భూమిక | ix |
| ఆస్వాదానికి ఆహ్వానం | xiii |
| వ్యాసావళి : | |
| అమూల్యాభిప్రాయాలు | 1 |
| కంఠరవాలూ, ప్రతిధ్వనులూ | 9 |
| వక్త – శ్రోతలు | 16 |
| చిత్రకళలో రసన | 26 |
| ఆకలి | 32 |
| మా ఊళ్లో రావిచెట్టు | 42 |
| మన ఆటలు | 48 |
| ఆటల పాటలు | 56 |
| జోల పాటలు | 70 |
| పండుగ పాటలు | 78 |
| దీపావళి | 88 |
| అనుబంధం : | |
| ఆడపిల్లల పాటలు | 95 |

★

"....వేయిమందితో కర్రతో చేడీ యుద్ధం చేయవలసిన వాడు వక్త. పదహారు వేలమంది వివిధ విధాల వాళ్ల మనస్సులకు ఒకేసారి చక్కిలిగింత పెట్టవలసిన దక్షిణ నాయకుడు వక్త. మెదడుతో ఉప్పట్టీ, చెడుగుడూ, కుండబంతీ, కోతికొమ్మచ్చీ అంబీలమీద ఆడగలిగే నేర్పరి వక్త."

- పుటలు 23/24

★

VII A

# భూమిక

వ్యాసం, ఉపన్యాసం వేరు; ప్రసంగం వేరు. ఒకే విషయం మీద సీరియస్‌గా మాట్లాడడం ఉండదు ప్రసంగంలో. ఒకదాని తరువాత ఒకటి అనేక విషయాలు దొర్లుతూ ఉంటాయి. తేలిక ధోరణిలో, ఛలోక్తులతో, ప్రాసంగికుని వ్యక్తిత్వ దీప్తితో శ్రోతల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది ప్రసంగం. శ్రోతలకు గంటలు నిముషాల్లాగ గడచిపోతాయి.

ప్రసంగాలు సాధారణంగా రికార్డు కావు. శ్రోతల్ని మరీ మురిపించిన ఛలోక్తుల్లాంటివి కొన్ని మాత్రం anecdotes గా ప్రజల నాలుకల మీద నిలిచి పోతాయి - అంతే!

ఈ శతాబ్దిలో తెలుగులో గొప్పప్రాసంగికులు (conversationalists) గా ప్రసిద్ధి పొందినవారు డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య, డా. కట్టమంచి రామలింగారెడ్డి, శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, శ్రీ చెరుకువాడ వేంకట నరసింహం, శ్రీ అబ్బూరి రామకృష్ణరావు, శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం మొదలైనవారు. ప్రాసంగికుల వ్యక్తిత్వాల్లోని తేడాల్ని బట్టి వారి వారి ప్రసంగ ధోరణులలోనూ తేడాలు కనిపిస్తాయి. కొందరి ప్రసంగాలు ఎవరినో ఒకరిని గుచ్చుతూ శత్రువుల్ని పెంచుకుంటాయి - విశ్వనాథ, భోగరాజు, చెళ్లపిళ్లల ప్రసంగాల్లాగ. మరికొందరి ప్రసంగాలు తమతో విరుద్ధాభిప్రాయాలు గలవారు కూడా ఆ క్షణంలో ఆ మాట మరిచిపోయి పళ్లికిలిస్తూ ఆసక్తిగా వినేట్టు చేసి, వారిని కూడా ఆకట్టుకుంటాయి - కట్టమంచి, అబ్బూరి, పింగళి, కృష్ణశాస్త్రుల ప్రసంగాల్లాగ!

కృష్ణశాస్త్రిగారిని సన్నిహితంగా ఎరిగి ఉన్న వారందరికీ బాగా తెలిసిన సంగతి ఒకటుంది. జీవితంలో కవిత్వం వ్రాయడంకన్నా, కవిగా గౌరవాలు అందుకోడం కన్నా కూడా ఆయనకి ఇష్టమైన పని: ఎప్పుడూ పదిమందిని చుట్టూ చేర్చుకొని ఇష్టాగోష్ఠి ప్రసంగాలతో సరదాగా కాలం గడిపెయ్యడం!

పేరుకి ప్రసంగాలు అంటున్నా, మన రేడియో ప్రసంగాల్లో నిజానికి ముప్పాతిక మూడు వీసాలు వ్యాసాలో, ఉపన్యాసాలో! అచ్చమైన ప్రసంగాలు అనదగ్గవి కృష్ణశాస్త్రి కొన్ని చేశారు. అలాంటి 11 ప్రసంగాలు ఏర్చి కూర్చి రూపొందించిన సంపుటం ఇది. ప్రాసంగికునిగా కృష్ణశాస్త్రి ప్రతిభనీ, ఆయన ఇతర రచనలలో కనిపించని ఆయన వ్యక్తిత్వంలోని అనేక ముఖాల్నీ పరిచయం చేసే సంపుటం!

'అమూ ల్యాభిప్రాయాలు' అనే తొలి ప్రసంగం శీర్షికే ఈ సంపుటానికి శీర్షిక అయింది.

'కంఠరవాలూ, ప్రతిధ్వనులూ' నిజానికి 'కవితా ప్రశస్తి' అనే రెండవ వ్యాస సంపుటంలో చేరవలసింది. వివిధ రచయితల రచనలలోని సంవాదాల్ని (పోలికల్ని) గురించి ముచ్చటించే ప్రసంగం ఇది. అయితే - "ఎప్పుడూ ఉంటుంది అనుకుంటాను, ఒక కంఠరవానికి ప్రతిధ్వనులు తయారవడం" అంటూ రంజుగా ఆరంభమై ప్రసంగ ధోరణిలో సాగడం వల్ల ఇది ఈ సంపుటంలో చేర్చబడింది.

మూగ కాకపూర్వం కృష్ణశాస్త్రి తెలుగులోని ఇద్దరు ముగ్గురు మహావక్తలలో ఒకరుగా పరిగణించబడేవారు. వక్తగా తన అనుభవాలు సరదాగా ఏకరువు పెట్టే ప్రసంగం 'వక్త -శ్రోతలు.' "ఈ రోజులలో - అంటే ప్రజాస్వామ్యపు రోజులలో - రెండు గొప్పశక్తులు దేశాన్ని నడిపిస్తాయి: పత్రికా, ప్రసంగవేదీ!"

అనే "లోచూపు" (insight) తో కూడిన రిమార్కుతో ఆరంభం అవుతుంది ఈ ప్రసంగం. మంచి ప్రసంగాల్లో ఉండే మరో విశేషం: 'లోచూపు' ఎక్కువగా ఉండడం. మనుషుల్ని గురించీ, జీవితాన్ని గురించీ ప్రాసంగికులు కొత్తగా దర్శించిన నిజాలు ఎన్నో అలవోకగా దొర్లుతూ ఉంటాయి వారి ఉదాత్త ప్రసంగాల్లో!

వ్యాసంలో లాగ ముందుగా ఆలోచించి పెట్టుకున్న ఒక పథకం ఉండదు ప్రసంగంలో. Spontaneous గా, ఆ క్షణంలో ఏది తోస్తే అది మాట్లాడతారు. సొంత విషయాలు కూడా ప్రస్తావించ డానికి సందేహించరు. 'చిత్రకళలో రసన' అనే ప్రసంగంలో మధ్యలో శాస్త్రిగారు తమ కుమారుడు బుజ్జాయి చిన్ననాటి చిత్రకళా వ్యాసంగాన్ని గురించి ముచ్చటిస్తారు:

> "మా అబ్బాయి అయిదేళ్లు నిండక పూర్వమే బొమ్మలు గీయడ మని ప్రారంభించాడు. గోడలూ, పుస్తకాలూ, కాగితాలూ చిత్ర శాలగా నా ఇల్లు తయారయింది. ఉత్త గీతలూ, గీతలనుంచి ఆకా రాలూ, ఆకారాలనుంచి అర్థాలూ ఇలా పెరగడం ఆరంభ మైంది." - పుట 28

'ఆకలి' చిత్రంగా కొత్త తరహాలో సాగిన ప్రసంగం. విశ్వనాథ లాగ పూర్వపక్షిని ఎదురుగా ఊహించుకుని మధ్యమ పురుషలో ఇలా ఆరంభ మవుతుంది ఈ ప్రసంగం:

> "నీవు ఏమి చెబుతావు దీనికి? ఎన్ని కడుపులు ఆకలితో కాలిపోతూ ఉన్నాయి?" - పుట 32

భౌతికమైన మార్క్సిస్టుల ఆకలితో ఇలా ఆరంభమైన ఈ ప్రసంగం చిత్రంగా ఎవరూ ఊహించని విధంగా మెలికలు తిరుగుతూ సాగి, ఒకచోట ఆధ్యాత్మికమైన ఆకలిని పరామర్శిస్తూ ఇలా అంటుంది:

"మన దేశంలో ఆకలి లేదు. మనం శిలలం, మనం మృత్తు, మనం మృత్యువు! వేనవేలేండ్లు అసత్య ప్రచారాలు, అధర్మాచారాలు, అసంబద్ధ వైరాగ్యాలు మనకు ఆకలి లేకుండా చేశాయి." -పుట 35

"దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అంటూ ఎప్పుడూ ఊహాలోకాల్లో విహరిస్తాడు కృష్ణశాస్త్రి అనే భ్రాంతిలో ఉన్న వారికి ఆయనలోని 'రియలిస్ట్' ముఖాన్ని చూపించి, కనువిప్పు కలిగించగల ప్రసంగాలు: 'మా ఊళ్లో రావిచెట్టు' మొదలుకొని 'దీపావళి' దాకా ఉన్న చివరి 6 ప్రసంగాలూ. తన చిన్ననాటి తెలుగు గ్రామీణ జీవితంలోని అన్ని అంశాలకూ ఎంత గాఢంగా ఆయన ప్రతిస్పందించిందీ విశదం చేసే ప్రసంగాలు ఇవి. పాటలు వ్రాయడంలో సిద్ధహస్తు డవడానికి మన జానపదగీతాల ప్రభావం ఎంత గాఢంగా ఆయనమీద పడిందీ ఈ ప్రసంగాల వల్ల తెలుస్తుంది. జానపదగీతాలవల్ల ప్రభావితులు కావడమే కాదు; స్వయంగా ఆయన కొన్ని జానపదగీతాలు సేకరించి వ్రాసి పెట్టుకున్నారు. ఆ 'ఆడపిల్లల పాటలు' ఈ సంపుటం చివర అనుబంధంగా చేర్చబడినాయి.

"తెల్లవారకముందు లేవడం నా కెప్పుడు ఇష్టం లేదు. ఎవరేమి చెప్పినా అది మంచిది కూడా కాదని నా సిద్ధాంతం." - పుట 89

కృష్ణశాస్త్రి సంకీర్ణవ్యక్తిత్వాన్నీ, అంతర్యాన్నీ అధ్యయనం చేయజూచే జీవిత చరిత్ర రచయితలకి తోడ్పడే ఇలాంటి మాట లెన్నో ఈ ప్రసంగాలలో దొరుకుతాయి.

శ్రీ శాస్త్రిగారి అముద్రిత రచనల్ని ప్రచురించడానికి తలపెట్టిన ఈ మహా యజ్ఞంలో అధ్వర్యులుగా ఉండి కృష్ణశాస్త్రి సాహితికి యథాశక్తి సేవచేసే అవకాశం మాకు కలిగించిన 'రాజహంస ప్రచురణల' అధిపతి చిరంజీవి దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి (బుజ్జాయి) కి మేము కృతజ్ఞులం.

సంపాదకులు

# ఆస్వాదానికి ఆహ్వానం

ఇక్షు సముద్రం ఎక్కడుందో నాకు తెలియదు. కాని, అపాత మధుర మయిన కృష్ణశాస్త్రి సాహిత్యం సమస్తమూ ఇక్షు రసార్ణవమే. కృష్ణశాస్త్రి పలుకుల్లోని చెరుకు తీపి సాహిత్యరస పిపాసువులకు ఎక్కడో ఉందనుకొనే ఇక్షుసముద్రాన్ని వెదుక్కోవలసిన అగత్యాన్ని తొలగిస్తుంది.

అందుకే పురాణాల్లో పేర్కొన్న ఇక్షు సముద్రం ఎక్కడుంటుందో దాని జాగ్రఫీ జోలికి వెళ్లదలచుకోను నేను. మన యెదుట నిజంగా కృష్ణశాస్త్రి సాహిత్య సమస్తమూ ఉరకలూ పరుగులుగా ఉప్పొంగుతోంది. ఇదే అసలు సిసలయిన చెరుకు రసాల కడలి. ఆస్వాదించుదాం రండర్రా అని అందర్నీ ఆహ్వానిస్తున్నాను.

ఒకప్పుడు కృష్ణశాస్త్రి కవిత్వం మాత్రమే మాధుర్య 'మా' ధుర్య మనుకున్నాము. ఇప్పుడు మీ చేతిలో ఉన్న పుస్తకాన్ని చూడండి. ఇంకా అచ్చవుతున్న, లేదా అయి, సిద్ధంగా ఉన్న సంపుటాల్ని చూడండి. అప్పుడు మాధుర్యం అంటే ఏమిటో మీకే అర్థం అవుతుంది. అప్పుడు వాస్తవంగానే ఒక ఇక్షుసముద్రంలో మీరు ఓలలాడుతారు.

కాని, ఇక్కడో చిన్న విశేషం ఉంది. తినగ తినగ వేము తియ్యనుండు నేమో కాని అంతా చెరుకు రసమే అయితే మొగం మొత్తేస్తుంది. అందుకే కృష్ణశాస్త్రి చెరుకు

సముద్రంలో అక్క డక్కడ మిరియాల పొడి ఉంది. కరక్కాయల కసటుదనం ఉంది. ఇంకా మీరు కోరుకొనే ఎన్నెన్నో మసాలా లున్నాయి.

ఇప్పుడు నా మనస్సు 50 సంవత్సరాల వెనక్కి పోతోంది. 1920 ల ప్రారంభ దినా లవి. ఆ రోజుల్లోనే జమీందారీ కవిత్వాన్ని తోసి రా జని భావకవిత్వం రంగ ప్రవేశం చేసింది. 1910 - 20 ల మధ్య ఈ ఉద్య మాన్ని ప్రారంభించిన వారు రాయప్రోలు, అబ్బూరి. అయితే దీనికి 20 లలో అఖిలాంధ్ర ప్రాచుర్యం ఇచ్చిన వాడు కృష్ణశాస్త్రి. బరంపురం నుంచి బళ్ళారి దాకా ఈయన తనవీ, ఇతరులవీ భావగీతాల కవితాగానం చేస్తూ యువతరాన్ని ఆకట్టుకున్నాడు.

అయితే కృష్ణశాస్త్రిది ప్రతిఘటన లేని విజయయాత్ర కాదు. మహాపండితు డయిన అక్కిరాజు ఉమాకాన్తమ్ "నేటి కాలపు కవిత్వం" అనే పుస్తకం రాసి, అందులో ఎక్కువ భాగం కృష్ణశాస్త్రినే వెక్కిరించాడు. ఉమా కాన్తమ్ (సంస్కృతపు స్పెల్లింగు చూడండి!) గారికి సంస్కృతంలో తప్ప మరెక్కడా కవిత్వం కనబడదు. నన్నయభట్టును కూడా ఆయన కవిగా ఖాతరు చెయ్య లేదు. నేటి కాలం కవిత్వానికి కాలం కా దనేశా డాయన.

కాని, ప్రపంచం మాత్రం వేరు విధంగా భావించింది. భావకవిత్వాన్ని ఆ నాటి ప్రధాన శాఖగా గుర్తించింది. ఈ శాఖ ఎన్నో కోకిలలకు ఆశ్రయం ఇచ్చింది. (గౌతమీ కోకిలగా పేరు పొందిన వేదుల సత్యనారాయణ శాస్త్రిని

ఇక్కడో చిన్న ఉదాహరణగా ఉటంకించ వచ్చును.) ఈ అన్ని కోయిలల్లో అగ్రస్థానం సాహిత్య విమర్శకు లంతా కృష్ణశాస్త్రిదే అని అంగీకరించారు.

"నేటి కాలపు కవిత్వం" ఇప్పుడు లైబ్రరీలలో బూజు పట్టిపోతోంది. కృష్ణశాస్త్రి కవిత్వం భావకవితకు పరాకాష్ఠగా నిలబడింది.

అనంత పంతుల రామలింగ స్వామి అనే ఆయన "కృష్ణ పక్షం" కావ్య సంపుటిని వేళాకోళం చేస్తున్నా ననుకుంటూ "శుక్లపక్షం" అనే రాతని వెలువరించాడు. దాన్ని కూడా ఇప్పుడు చదివే వాళ్లెవరూ లేరు. ఆ రోజుల్లోనే దాన్ని వేదుల "ఈ శుక్లపక్షం సారస్వతారిష్టం అనే శుక్లనష్టం" అని చెప్పి సహృదయుల హృదయ ఫలకాల నుంచి తుడిచిపెట్టి పారేశాడు.

1930 లలో భావకవిత్వం మీద తిరుగు బాటుగా అభ్యుదయ కవిత్వం వచ్చింది. కాలంతో పాటు ఎదుగు తున్న కృష్ణశాస్త్రి అభ్యుదయ కవిత్వాన్ని ఆహ్వానించి ఆశీర్వదించాడు. అంతే కాదు. అభ్యుదయ రచయితల సంఘం వార్షికోత్సవాలలో ఒకదానికి అధ్యక్షత వహించాడు.

సినిమా రంగంలో ప్రవేశించి, మళ్లీ ఇలాంటిది రావడానికి వీల్లేదన్నట్టుగా మల్లీశ్వరి రాశాడు.

ఈ మధ్య కాలంలో ఆయన యెన్నో రేడియో నాటకాలు రాశాడు. రేడియో ప్రసంగాలు చేశాడు.

ఆ తర్వాత ఆయన గొంతుక పోయింది. కాగితాలమీద (చిన్న చిన్న నోటుబుక్కుల మీద) అక్షరాలు రాస్తూనే, తన దగ్గరకు వచ్చిన అందరితోనూ ప్రసంగించాడు. ఎన్నో ట్రంకు పెట్టెల నిండా ఈ నోటుబుక్కు లున్నాయని బుజ్జాయి (కృష్ణశాస్త్రిగార బ్బాయి) నాతో చెప్పాడు.

ఒక దానిలో కృష్ణశాస్త్రిగారు నామీద ఇలా రాశా రట: "శ్రీ శ్రీ గొప్పకవి. అతని మీద ఈగ వాలినా నేను సహించలేను" అని !

నా మీద వారి కెప్పుడూ సదభిప్రాయమే ఉంది. మరి వారి మీద నాకు వల్లమాలినంత అభిమానం. నా మనస్సు మీద చెరగని ముద్రలు వేసిన ముఖ్యాతి ముఖ్యులలో కృష్ణశాస్త్రిని ప్రముఖంగా పేర్కొంటాను.

వారి మీద నా కున్న అభిమానం, అపేక్ష వారి యీ గ్రంథ సంపుటాలకు గాను ఈ రాత రాయడానికి ప్రేరేపించాయి. మరో మారు చెబుతున్నాను. ఇది ఇక్షు సముద్రం. "అందరం ఆస్వాదించుదాం, రం"డని ఆహ్వానిస్తున్నాను.

మద్రాసు,
29-11-81

శ్రీ శ్రీ

# అమూల్యాభిప్రాయాలు

అభిప్రాయాలు దేనిమీద నైనా ఇవ్వవచ్చు. ఎవరు పడితే వారు ఇవ్వవచ్చు. అమూల్యాభిప్రాయాలు మాత్రం అర్హులే ఇవ్వాలి. చాలా మంది ఇచ్చే అభిప్రాయాలు మారని నాణాలు, గుడ్డి గవ్వలు. అధికారుల అభిప్రాయాలకు ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు చెలామణి ఉంటుంది.

అంటే, అభిప్రాయాలు మామిడిపండు మీద ఇవ్వవచ్చు, మకర ధ్వజం మీద ఇవ్వవచ్చు, మంత్రుల మంతనాల మీద ఇవ్వవచ్చు, మహాకావ్యం మీద ఇవ్వవచ్చు. బీమ మీద, శిఖరాగ్ర సమావేశం మీద సమాన ధాటీతో ఎవరు ఇవ్వకూడదూ అభిప్రాయం? బజారు ధర మొదలు కొని బ్రహ్మపదార్థందాకా ప్రతి వస్తువు మీదా అభిప్రాయం ఇవ్వకుండా ఎవరు ఊరుకున్నారు?

అయితే, వాతహరి మీదో, వసంతకుసుమాకరం మీదో వైద్యరా జన్న మాటకు విలువ ఉంటుంది. కళాపూర్ణోదయం మీదో, కాశీఖండం మీదో కవిత్వవేది అన్న వాక్కు అమూల్య మౌతుంది.

ఇహ అభిప్రాయాలు - అమూల్యాభిప్రాయాలు అన్నవి - సాధారణంగా సమకాలికు లిచ్చేవే అయి ఉంటున్నాయి. వీటిని

ఈ రోజుల్లో తరుచు పత్రికా ప్రకటనల్లో, మందుల కేటలాగుల్లో, సాహిత్య గ్రంథాల్లోనూ చూస్తూంటాము. 'ఫలాని తలనూనె ప్రసిద్ధురా లైన ఫలాని విలాసవతి వాడింది' - ఇది ఒక అమూ ల్యాభిప్రాయం. 'ఈ సబ్బు అద్భుత మైనది. దీనిపై మేనిఛాయ గల ఈ ప్రఖ్యాత సుందరి ఏ మన్నదో వినండి' - ఇది ఒక అమూ ల్యాభిప్రాయం. 'ఇది ఒక మందు. దీని నిందరి రోగుల కిచ్చి రోగం తొలగించడ మైనది' - ఇది ఒక అమూ ల్యాభిప్రాయం. 'ఈ ఖండకావ్య సంపుటి చూడండి. ఎందరు పెద్దలు దీనిని కీర్తించారో!' - ఇది ఒక అమూ ల్యాభిప్రాయం. ఈ రోజుల్లో అచ్చు యంత్రాలు, పత్రికలు, ప్రసంగవేదులు మొదలైన సౌకర్యాలు ఎక్కువగా ఉండడం వల్ల, ఈ అమూ ల్యాభిప్రాయాలు సంపాదించడం, ఇవ్వడం, ప్రకటించడం ఎక్కువగా కనపడుతుంది - ముఖ్యంగా సాహిత్య రంగాల్లో.

పూర్వ సాహిత్య చరిత్రతో పరిచయ ముంటే, మనకు కొన్ని అమూ ల్యాభిప్రాయాలు స్ఫురణకు వస్తాయి - కేతన్న కవిత్వం మీద తిక్కన్న మెప్పుదల వంటివి. "కవిత జెప్పి ఉభయ కవి మిత్రు మెప్పింప" బ్రహ్మ కైనా సాధ్యం కాదు. కేతన భాగ్యశాలి; అతనికి దొరకిన అమూ ల్యాభిప్రాయం వంటిది మరి ఏ కవికీ దొరకదు. ఇహ "ఇతరులకు అసాధ్య మైన భారతసముద్ర తరణం మీ వల్లనే నెరవేరు తుంది. మీరు లోకజ్ఞులు" అని రాజరాజ నరేంద్రుడు నన్నయ్యతో మనవి చేసుకొన్నప్పుడూ, "మామా" అని పిలిచి, "నీకు బోలెడు కావ్యసంపద ఉంది, నా కొక కావ్య పుత్రిక నివ్వ వయ్యా" అని మనుమసిద్ధి తిక్కన నర్థించి నప్పుడూ, శ్రీనాథుని వల్ల కృతులు పొందినవా రందరూ ఆయనను బహు విధాల పొగిడి, "ఈ క్షోణిన్ నిను బోలు సత్కవులు లేరు" అన్నప్పుడూ, "హితుడవు, చతుర వచోనిధివి" అంటూ మొదలు పెట్టి, "ఆంధ్ర కవితా పితామహుడవు" అని పెద్దనతో రాయలు

చెప్పుకొన్నప్పుడూ, "శారద నీ రూపము" అని రామకృష్ణ కవిని కృతిపతి కీర్తించినప్పుడూ, ఆ రాజులో, మంత్రులో ఆ కవుల ప్రతిభపై తమ అభిప్రాయం తెలియపరచుకొని, కృతులు చెప్పించు కున్నారు. అయితే వా ళ్లన్న మాటలను నేడు చదివితే, ఆ కవుల కావ్యం వల్లనే ఆ మాటలకు ఎక్కడలేని విలువా వచ్చినట్లు ఉంటుంది. చేమకూర కవి మాత్రం తానే స్వయంగా రఘునాథ భూపాలునికి "విజయ విలాసం" సమర్పించుకున్నాడు. అయితే, రసజ్ఞుడూ, కవీ అయిన రఘునాథుడు తరువాత తన అమూ ల్యాభి ప్రాయం ఇయ్యనే ఇచ్చాడు - "ప్రతి పద్య రసాత్మక మగు కృతి చెప్పా వయ్యా," "ఒకటి కా దన్నిట ప్రయోజకుడ వీవు" అని తల ఊపి. అయితే ఆ కవుల కావ్యాలకు కాలమే ఇచ్చింది తన అమూ ల్యాభిప్రాయం. అందుకనే తిరుపతివేంకటకవు లన్నారు -

"భారతముపై ఎవరి అభిప్రాయ ముండె?
మను చరిత మొద లేరి సమ్మతులు నిలిపె?
తీపి లేని ఫలమ్ముపై తేనె చిలుక
నేమి యగు? తీపి కలదాని కేమి వలయు?
చేత కాని శతవధాని చేతి నిండ
సర్టిఫిక్కెట్లు కట్టలే, ..........
..............................స్వ
తః ప్రకాశుండు కోరునే తనకు దివ్వె?" అని.

అయితే ప్రతి పూర్వకవినీ ఇలాగే కృతి పతులు మెచ్చు కొన్నట్లూ, వారి ప్రతిభను కీర్తించినట్లూ చదువుతాం. కాని, అవి అమూ ల్యాభిప్రాయా లనిపించవు - నాడు ఆ కవికి ఎలాగ తోచినా. 'ఎందు వల్ల' అని ప్రశ్నించుకుంటే, ఆ కావ్యంలో విలువ లేకపోవడం వల్లనే అని తేలుతుంది. మరి, ధూర్జటి కథ ఉంది. ఏదీ - అతని కవనాన్ని గురించి రాయలు "స్తుతమతి యైన ఆంధ్ర

కవి ధూర్జటి పల్కుల కేల కలెగె ఈ అతులిత మాధురీ మహిమ?"
అని పెద్దన తిమ్మ నాదు లున్న సభలో మెచ్చుకొని, సింహాసనం మీద కూర్చుండబెట్టడం, అదీనీ. తిక్కన కేతనపై ఇచ్చిన అభిప్రాయం తర్వాత, అంత అమూల్య మైనది మరొకటి లేదు.

కానీ, ఆ రోజుల్లో రాజసభల్లో, దేవాలయ మంటపాల్లో, పండిత సదస్సుల్లో, గోదావరీ తీరాననో, తుంగభద్రా తటాననో, కవుల సమావేశాలలో, సరస్వతీ మహలుల్లో ఎవరి కృతులమీద ఎవ రెట్టి అమూ ల్యాభిప్రాయా లిచ్చారో కదా! నన్నయ, తిక్క నాదుల వంటి లోకోత్తరుల ప్రజ్ఞపై అభిప్రాయాలు ఇవ్వడ మేమిటి? - ఇచ్చిన వారి రసనను విలువ కట్టుకోవడం గాక! పోతనవాణికి అమూ ల్యాభిప్రాయం ఇవ్వడం, పలికించిన రామ భద్రుని కివ్వడమే ఔతుంది కదా? వీరి విషయంలో అమూ ల్యాభి ప్రాయం ఇవ్వడం, ఇచ్చిన వారి మెప్పునూ, భక్తినీ వారి కర్పిం చడం. ఇది అర్చన. అయితే, కొందరికి అమూ ల్యాభిప్రాయం ప్రోత్సాహ మౌతుంది. ప్రేరేపణ ఔతుంది. ఎగరడానికి రెక్క ఔతుంది. ముందు నడకకు ఊత ఔతుంది. కాని ఎందరికో అమూ ల్యాభిప్రాయం యోగ్యతాపత్రం ఔతుంది. ఇది వారిని నిలబెట్ట లేదు. అర్హతకూ, అధికారానికీ, గుణానికీ యోగ్యతా పత్రం అక్కరలేదు. అవి లే వేమో అన్న భయం, సందేహం, తక్కువ తనం మనస్సులో ఉన్నప్పుడు, తరుచు ఈ అమూల్యాభి ప్రాయాన్ని, అంటే యోగ్యతా పత్రాన్ని కోరుకోవడం జరుగుతుం దేమో!

ఇహ, ఎవరికి వారే అమూ ల్యాభిప్రాయాలూ, బిరుదులూ ఇచ్చు కునేవా రుంటా రేమో. పానుగంటి నరసింహారావు గారిది కాబోలు ఒక కథ ఉంది. ఆయన దర్శనానికి ఒకరు వచ్చి ఒక కాగితం ముక్కమీద తన పేరు వ్రాసి లోపలికి పంపారు. దాని మీద నాలుగు పొడి అక్షరాలు ఉన్నాయి - స. ప. న. సా. అని.

లోపలకు రమ్మన్నారు ఆ పెద్దమనిషిని. వచ్చిన ఆసామిని చూడగానే, "ను వ్వటోయ్ సాంబయ్యా" అన్నారు ఆయన.

"చిత్తం" అన్నాడు.

"ఈ పొడి అక్షరాల అర్థం ఏమిటోయ్?" అని ప్రశ్నించారు పానుగంటివారు. అతడు వినయంతో తల వంచుకొని, చిరునవ్వుతో సిగ్గు పడుతున్నట్లు - "సహజ పండిత సంపర సాంబయ్య" అని మనవి చేశాడు.

"ఈ బిరు దెవ రిచ్చా రోయ్?" అని పానుగంటివారు అడిగితే, "నేనే స్వయంగా తొడుక్కున్నది" అన్నాడు సాంబయ్య.

"అయితే సాంబయ్యా! ఇప్పుడు వైద్యం మానేశావా? ఏం జేస్తున్నావ్?"

"ఏదో కొంచెం కవిత్వం చెప్తున్నా నండి!"

"భేష్, ఏ దైతే నేం, నలుగుర్నీ చంపడానికి! కవిత్వ మైతే నేం? వైద్య మైతే నేం?" అని పానుగంటివా రన్నట్లు వినికిడి.

"సహజ పండిత" అనేది సాంబయ్య స్వయంగా తనకు తాను ఇచ్చుకున్న అమూ ల్యాభిప్రాయం. "ఏ దైతే నేం, నలుగురినీ చంపడానికి" అన్నది పానుగంటి నరసింహారావు గారు సాంబయ్య వంటి వారిపై కలకాలం ఉండేటట్టు ఇచ్చిన అమూ ల్యాభిప్రాయం.

ఇంకో కథ ఉంది; మన దేశంలో బాలా ప్రసిద్ధు డైన ఒక నటునిది. ఒక కవి నాటకం వ్రాసి చదివి వినిపించడానికి ఒక ఉదయాన్నే ఆయన దగ్గరకు వచ్చాడట. ఆ నటుడు కాఫీ పుచ్చుకొని, స్నానం చేసి, జపతపాదులు గావించి, భోజనం చేసుకొని, అప్పుడు తనగది లోనికి వచ్చి, పక్కపై శయనించి, అంతసేపూ అమూ ల్యాభిప్రాయం

కోసం హాలులో కూర్చున్న ఆ కవిగారికి రమ్మని కబురు చేశాడు. ఆయన వచ్చాడు. అప్పుడు ఆ నటు డేమని సెల విచ్చాడూ: "చూడండి, కవిగారూ! మీ రలా నాటకం చదువుతూ ఉండండి. నే నిలా పడుకుని వింటూంటాను. నేను మధ్యన ఏ దైనా మాట్లాడితే, ప్రశ్నిస్తే నాటకంలో కొన్ని లోపా లున్నాయి, దిద్దుకోవా లన్నమాట. నేను మాట్లాడకుండా నిద్ర పోతే భే షైన నాటక మన్నమాట." నాటక కర్త చదివాడు. నటుడు నిశ్శబ్దంగా నిద్రపోయి తద్వారా తన అమూ ల్యాభిప్రాయాన్ని తెలియ జేశాడు.

కనుక, ఈ అమూ ల్యాభిప్రాయాలు రకరకాలుగా ఉన్నా యని తేలుతుంది. విలు వైన వస్తువును వెతుక్కుంటూ వచ్చి ఇచ్చేవి, పిలిచి ఇచ్చేవి, "భేష్" అని తల ఊపి ఇచ్చేవి, సత్య మని తెలిసిన దానికి ఖచ్చితంగా ఇచ్చేవి - కొన్ని ఉన్నాయి. అడిగినవారిని తట్టుకో లేక ఇచ్చేవీ, మొగమాటంకొద్దీ ఇచ్చేవీ, భయపడి ఇచ్చేవీ, అంతరాత్మను చంపుకొని ఇచ్చేవీ, జాలిపడి ఇచ్చేవీ కూడా ఉన్నాయి. మొదటి రకం ఎప్పటికీ మంచివి. రెండవ రకం కొందరికి తాత్కాలికంగా ఉపయోగిస్తాయి. వీట్లకి అమూల్య మనే విశేషణం తగిలించి ఉన్నా, వీటివల్ల వ్యక్తులకు ముట్టే లాభాల్నిబట్టి నగదు గానో, ఎలాగో మూల్యం తేలుతుంది. కనుక, అవి నిజానికి అమూ ల్యాభిప్రాయాలు కావు. కొందరు పెద్దలకు అమూ ల్యాభిప్రాయాలకోసం ఒత్తిడి చేసేవారి వలన విశ్రాంతి ఉండదు. చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగా రన్నా రట - అమూ ల్యాభిప్రాయాలు కొన్ని ప్రతులు అచ్చు వేయించి తాము ఉంచా మనీ, అడిగినవారికి పంపేటట్లు ఏర్పాటు చేశా మనీ. ఈమాటలు చమత్కారానికి అన్నా, ఈ అమూల్యాభిప్రాయాల ఉద్యమం ఎంత తీవ్రంగా ఉందో, దీని వల్ల వేంకట శాస్త్రిగారి వంటి పెద్దలకు ఎంత ఇబ్బంది కలుగుతూందో తెలుస్తుంది.

ఒక్కొక్కప్పుడు ఎంత అమూల్యమైన వైనా, కొందరి అభిప్రాయాల మీద గురి పోతుంది. హమేషా, అన్నింటికీ, అస్తమానం వాటిని అనుగ్రహించడం వల్ల! భారతంలో భీముడి కథలో లాగ! అది అందరూ ఎరి గున్నదే అయినా – అశ్వత్థామ అనే ఏనుగు భారత యుద్ధంలో చనిపోయింది. ద్రోణుడి కొడుకు పేరుకూడా అశ్వత్థామ. ద్రోణుడు ప్రళయంగా యుద్ధం చేస్తున్నాడు. ఎవ్వరూ ఎదుర్కోలేక పోతున్నారు. ఆయన కొడుకు చచ్చిపోయా డని తెలిస్తే అస్త్రసన్యాసం చేస్తాడు. ధర్మరాజు దగ్గరకు పెద్దలు వచ్చి, "అశ్వత్థామ చచ్చెను అనవయ్యా" అంటారు. ధర్మరాజు ఒకపట్టాన ఒప్పుకోడు. భీముడో, యుద్ధరంగంలోకి పరుగెత్తుకొని వెళ్లి ఆ మాట కాస్తా ఆచార్యుని దగ్గర అరిచేస్తాడు. ఆయన "నీ సంగతి నాకు తెలుసు, నమ్మను పో! ఎన్నడూ అసత్య మాడని ధర్మరాజు మాట నమ్ముతాను గాని" అంటాడు. కొందరి అమూ ల్యాభిప్రాయాలు భీమసేనుని మాటల వంటివి. అదే పనిగా ఇయ్యడం వల్ల అవి అరిగిపోయి పనిచేయడం మానేస్తాయి.

ఒక్కొక్కప్పుడు, అమూ ల్యాభిప్రాయాలు ఇచ్చి పుచ్చుకున్న వారికి ఉభయులకీ ఉపయోగిస్తాయి. పుచ్చుకున్న వాడికి నలుగురిలో ప్రవేశం కలుగుతుంది. ఇచ్చిన పెద్దమనిషి పేరూ పదిమంది ఎదుటా నిత్యమూ ప్రత్యక్ష మౌతూనే ఉంటుంది. "రసవంతముగ నున్నది, నిర్దుష్ట మైన భాష, గాంగ నిర్ఝర సదృక్ ధారాళంగా ప్రవహించినది కవిత. లోకోక్తులు మహచక్కగా వాడారు. సమాసఘటన కూడా చాలా ప్రౌఢంగా ఉంది. సంభాషణ జాతీయంగా ఉంది. పాత్రపోషణ అద్భుతంగా ఉంది. కథ చదువుతుంటే ఎక్కడా ఒక్క నిముషం ఆగనివ్వక పందెపు గుర్రంలా పరుగెత్తింది. సాహిత్యరంగంలో మ రొక నక్షత్రం ఉదయించింది" అన్న మాటలూ, అటువంటి మాటలూ తరుచు కనిపిస్తాయి – ఈ

అమూ ల్యాభిప్రాయాల్లో. "బాబూ! నీ గ్రంథం మీద నీవే అమూ ల్యాభిప్రాయం వ్రాసి తీసుకురా, దస్కత్తు పెడతాను" అన్న దయార్ద్ర హృదయులూ, ధారాళ మనస్కులూ కూడా ఉన్నారు.

కాని - నిజానికి - ఈ అభిప్రాయాలు అర్థించే వాళ్లందరూ అనర్హులు కారు. ఉజ్జ్వలమూ, విశాలమూ అయిన సాహిత్య లోకం, దానిలో ప్రతిభాశాలు లైన మహాత్ములూ, వారి గ్రంథాలూ ఎదుట సాక్షాత్కరించడం, తాను కొత్తగా ఆ రంగంలో అడుగు పెట్టడం, హృదయంలో కొంత విశ్వాసం, కొంత భయం, రవ్వంత అహంకారం, ఎంతో అణకువ, తన కృతిపై వల్లమాలిన అనురాగం, దాని భవిష్యత్తును గూర్చి ఆందోళన, ఏమో ముందు ముందు ఆ అమరుల్లో తనకూ స్థానం ఉంటుం దేమో అనే ఆశా, కళ్లల్లో ఒక్కసారి మెరుపూ, ఒక్కసారి నీడా, "ఆహా! ఇప్పుడు ఈ తరుణంలో నా వెన్ను చరిచే హస్తం ఉంటేనా — 'నీకేం? ముందుకు నడు' అని నమ్మకంగా చెప్పేవాణి వినిపిస్తేనా!" అని ఆత్రత — ఎన్నో, ఎన్నెన్నో సాహిత్య జగత్తులో మొదటిసారి కా లూదిన యువరచయిత మనస్సును తొందర పెడతాయి. అప్పుడు అతను తేజస్తంభంలాగ, కైలాసశిఖరంలాగ ఎదుట ప్రత్యక్షమయ్యే ప్రతిభాశాలి కరావలంబం కోసం ఎందుకు కోరడు? అట్టి వానికి, అట్టివారు ఇచ్చినదే అమూ ల్యాభిప్రాయం — తిక్కన్న కేతనకు ఇచ్చినట్టిది.

రేడియో ద్వారా ప్రసారితం: 1959 ఆగస్టు

౧

# కంఠరవాలూ, ప్రతిధ్వనులూ

ఎప్పుడూ ఉంటుంది అనుకుంటాను, ఒక కంఠరవానికి ప్రతిధ్వనులు తయారవడం —

ఒక సాహిత్యంలోనే కాదు. కట్టూ, నడకా, మాటా - అన్నిటిలోనూ నిత్యం ఈ లోకంలో ప్రతిధ్వను లనండి, ప్రతిబింబా లనండి - ఏర్పడుతుంటాయి. ఒక్కొక్కప్పుడు అపూర్వ వ్యక్తి ఉంటుంటాడు. పదిమందిలో కొట్టొచ్చినట్లు ముందుకు వచ్చి, పదివేల చూపులను ఆకర్షిస్తాడు. అతడిలాగ తెలిసో తెలియకుండానో నలుగురూ నడవడం, చేయి తిప్పడం, బట్ట కట్టడం - ఇలాంటి వన్నీ చెయ్యబోతారు. అయితే వాళ్ల కందరికీ ఆ ధోరణులు నప్పవు.

మా గురుదేవు లొక రుండే వారు. వారు ఆంధ్రదేశంలో ఆ రోజుల్లో యువకుల్ని మహా ఆకర్షించే వారు. ఆయన లాగే పాగా చుట్టుకొనే వాళ్లూ, ఆయన లాగే గిరజాలు పెంచేవాళ్లూ, ఇంగ్లీషు పెద్ద ఉదాత్తధోరణిలో శబ్దాలంకారాలతో ఉపన్యసించే వాళ్లూ ఆయన శిష్యు లెందరో బయలుదేరారు. కొంద రాయన దస్తూరీలాగే కూడా వ్రాసేవారు. అటువంటిది ఆయన ప్రభావం. ఆయన

మూర్తికీ, పెర్సనాలిటీకీ ఏవైతే పువ్వుకి వన్నె, వాసనల్లాగ సహజగుణాలో అవి అన్నీ అనుయాయులకు అప్పు తెచ్చుకుని అతికించుకున్న నగలలాగ ఉండేవి. వారి ఉపన్యాసాన్ని అనుకరించేవారి ధోరణి మరీ నవ్వు పుట్టించేది. జాన్సన్ గురించి చెప్పినట్లు - వాళ్లు ప్రసంగిస్తుంటే చిన్న చేపలు తిమింగలం లాగ మాట్టాడ ప్రయత్నిస్తున్న ట్లుండేది. వీళ్లు అందరూ ఆయనకు ప్రతి ధ్వనులు.

ఇక్క డొక చమత్కార మైన కథ చెపుతా. మా సతీర్థ్యులలో ఒకడు సరిగ్గా మా గురువుగారి లాగే తెల్లటి షుర్వా, కోటూ, పాగా అవీ వేసుకుని సరిగ్గా అలాగే తయారయి క్లాసుకు వచ్చాడు. మా స్నేహితుల్లో ఒకడు లేచి అప్పుడు క్లాసులో ఉన్న అధ్యాపకుణ్ణి సంబోధించి "అయ్యా, సింహచర్మం తొడుక్కున్న గాడిద కథ, ఈసప్స్ ఫేబుల్స్‌లోది వినా లని ఉంది" అన్నాడు. అందరూ విరగబడి నవ్వారు. ఆ అబ్బాయి పాపం సిగ్గు పడ్డాడు.

అయితే, మా గురుదేవుల ఉపదేశాలవల్ల ప్రభావితు లై వాటి సారం అంతరంగంలో దాచుకుని అది దారి బత్తెంగా ఉపయోగించు కుంటూ తమ జీవితాన్నీ, సమాజాన్నీ నడిపించుకుని పోయిన వారూ ఆయన శిష్యుల్లో ఉన్నారు. వీళ్లు ఆయనకు ప్రతి ధ్వనులు కారు. అనుయాయులు. ఆయన ఆస్తి వారికి సంక్రమించింది. ఆయన వారసులు. వీరిలో కొందరు ఆయనంత వాళ్లూ, ఆయన్ను మించిన వాళ్లూ ఉండవచ్చు. మరి కొందరు ఆయన నుండి ఏమీ పొందక జీవితాన్ని చప్పగా సాగించుకొన్న వాళ్లూ ఉండవచ్చు.

సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో అన్ని రకాల వాళ్లనూ చూస్తుంటాము. జర్మను మహాకవి అన్నాడు : కవిలోకంలో సిస లయిన కంఠాలు కొద్దిగా ఉంటా యనీ, ప్రతిధ్వనులు అనేకం ఉంటా యనీను. 'There are a few voices and many

echoes' అన్నాడు. ఇంకొక కవి – మరోలాగ ఈ విషయమే తెలియపరిచాడు : "మేం కొద్దిమందిమి ఉన్నాము. మా చెవుల్లోనే భగవంతుడు ఏవో రహస్యాలు ఊదుతాడు" ('God has a few of us whom he whispers in the ears') – వాళ్లే కవులు. వాళ్లవే జీవత్ కంఠాలు. వాళ్లే సృష్టిలోని పై తొడుగులు తొలగించి అంతరాళాలలోకి పరికిస్తారు. పరికించి అక్కడి రహస్యాలు మనకి తెలియపరుస్తారు. వాళ్ల కంఠరవం మన జీవితాల్ని కూకటి వేళ్లతో కదిల్చి, మన హృదయాలకు ఎన్ని సుఖదుఃఖానుభూతుల్నో కలిగిస్తుంది. They give our breasts a thousand pains.

అట్టి కంఠరవాల్ని సాహిత్య చరిత్రలో ఎట్టి ఉజ్జ్వల కాలంలోనైనా మనం వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. ఆ కాలంలోనే మరెన్నో గొంతుకలు వినిపించవచ్చు. వాటికి జీవం ఉండదు - ప్రత్యేకపు పలుకుబడి ఉండదు. అవి ప్రతిధ్వనులు కూడా కాక పోవచ్చు. అవి బతికున్న కంఠరవాలే కాదు; అప్పటి కవి బాగున్నట్టు కూడా అనిపించవచ్చు. కొన్ని శబ్దాలు ప్రత్యేకంగానూ, ఒకదానితోటి ఒకటి కలిసీ మనోహర మైన గానం పుట్టిస్తాయి. ఇటువంటి శబ్దాలలో ఒక ఆప త్తుంది. అవి వినడం తోటే సుఖంగా, హాయిగా వినబడతాయి. వాటికి ఒక కవిత్వపు వాసన ఉన్నట్టు ఉంటుంది. విరహ విపంచి, పంచమ స్వరం, మయూర లాస్యం - ఇలాగే ఎన్నెన్నో. ఆ మాటలలోనే కొంప ముంచేదీ, తక్కువ వాడి కంఠంలో నుంచి వస్తే చచ్చు రకపుదీ ఆయిన ఒక హాయి ఉంది. అవి విని మామూలు శ్రోత కూడా ఎంత మంచి కవిత్వం! అనుకోవచ్చు. అలాగే కవిత్వ వస్తువులుగా చెలామణి అయిపోయేవి ఉన్నాయి. పువ్వులూ, పక్షులూ, సెలయేళ్లు, యువతీ యువకులూ, సంయోగ వియోగాలూ మొదలగునవి. ఇటువంటి వస్తువులతోటీ, శబ్దజాలంతోటీ సుఖంగా కావ్యాలు తయారు చేసి, త్వరగా మరచి

పోబడే కవులు ఎందరో ఉంటారు. వీళ్ల ప్రతిధ్వనులు కారు. వీళ్ల ఏమీ కారు.

కనుక, తేలింది ఏమంటే, సాహిత్య లోకంలో కొద్ది కంఠరవా లుంటాయి. అనేక ప్రతిధ్వను లుంటాయి. ఎందునా పొందనివీ ఎన్నో ఉంటాయి. ఈ ఆఖరి తరహా కంఠాలలో పడి శబ్దాలు అరిగి పోతాయి. వీటినే – తిక్కన గారు, నిర్వచనోత్తర రామాయణంలో, ప్రాతపడ్డ మాటలు అన్నారు. ఈ తరహా కంఠాల వారి చేతుల్లో శబ్దాలు అరిగి పోవడమే కాదు, రూపాలు చెరిగి పోతాయి. కవిబ్రహ్మ చెప్పినట్లు - పరిణతి గల్గు కవులు కారు వీళ్లు. పింగళి సూరన్న మాటల్లో - అజాగళ స్తన సగోత్రులు వీళ్లు.

ఇక్క డొక సంగతి. మన పూర్వ కవులు కుకవి నింద చేసి నప్పుడు ప్రతిధ్వనుల వాళ్లని కాదు దూషిస్త – చోరుల్ని. వాళ్లని దుర్విటు లన్నారు తిక్కన్నగారు. వాళ్లది దొంగ సొత్తు. భైరవ కవి "సత్కవుల్ కృతుల దొంతులు పేర్చిన మాట లూతగా జల్లి పదంబు లూదుకునే" వాళ్లు వాళ్లు. పెద్దన్నగారు అన్నట్లుగా "అర్థపుం దెరువాటుల్ దెగి కొట్టి తద్జ్ఞ పరిష ద్విజ్ఞాత చౌర్య క్రియా విరసులై" కొరత పడే వాళ్లు వాళ్లు. భట్టుమూర్తి అన్నట్లు "పరార్థ వంచనలచే దీపించి మూర్ఖాళి సంభావింపన్ .... పైపై వన్నెల్" పచరించే వాళ్లు. శేషము వేంకటపతి అన్నట్లు, "పరపాకంబుల గోరి ....వృత్త్యర్థమై ఒరు పాదంబుల నంటే" బాపతు గాళ్లు.

ప్రతిధ్వని రకానికి చెందినవాళ్లు తస్కరులు కారు. "సత్కవి రా ట్ప్రబంధ భాండారం" నుండి నగలూ, నాణాలూ ఎత్తుకుపోయి తమ వని చెలామణి చేయబోయి, చెల్లక చెడిన వాళ్లూ కారు. ఒక ఉజ్జ్వల మైన జీవ త్సరస్వతికి లొంగిపోయి, అది తమ కష్టసుఖాలనూ, జీవిత పరిణామాలనూ, సృష్టి రహస్యాలనూ విప్పి చెప్పి

నప్పుడు వివశ లయిపోయి, తెలిసో, తెలియకుండానో అనురాగంతో, గౌరవంతో దాన్ని ఆరాధిస్తూ అలవరచుకుందుకు ప్రయత్నించే వాళ్లు. పాపం వీళ్లమీద మనకు కొంత మృదు వైన అనుకంప కలుగుతుం దనుకుంటాను. ఒక వసు చరిత్ర కొక పిల్ల వసు చరిత్ర, ఒక మను చరిత్ర కొక పసి మను చరిత్ర - ఈలాగ ఎన్ని వందల కావ్యాలు తయా రయాయో మనకి దొరికినంత వరకే చూస్తే. ఇవన్నీ ప్రతిధ్వనులు. ఇవి ప్రత్యేకంగా తమంత తాము వినబడవు. కనుక సాహిత్య జగత్తులో కార్బన్ కాపీల్లాగ అసలు మూలాన్ని ఆధారంగా పక్కన పెట్టుకుంటే కొంత నకిలీగా, మకిలిగా దాని పక్కనే ఉంటాయి.

అయితే, ఒకప్పుడు మనం పొరపాటున కొన్నిటిని ప్రతిధ్వను లనుకుంటామే - కొందరు కవుల కంఠాల్ని - అవి నిజానికి కావు. అలా అనుకోకూడదు మనం. ఆదికవి వాల్మీకి భావాలు కవికుల గురువు కాళిదాసు కావ్యాల్లో కొన్ని చోట్ల కనబడవచ్చు, హనుమ త్సందేశానికి మేఘసందేశం ఉండొచ్చు. కాని కవిలోక చక్రవర్తి వాణి ప్రతిధ్వని అనే మతిలేని మాట ఎలా అనగలము? అలాగే తెలుగు కవులలో నాచన సోమనాథుని పద్యం ఉందను కోండి? ఏదీ —

"అరి జూచున్ హరి జూచు చూచుకములం దందంద మందార కే
సర మాలా మకరంద బిందు సలిల స్యందంబు లందంబులై
తొరగన్ బయ్యెద కొం గొకింత తొలగన్ దోర్దో శ్శరాసారమున్
దరహా సామృత పూరమున్ గురియుచున్ దన్వంగి హేలాగతిన్."

అని నరకాసురునితో యుద్ధం చేసే సత్యభామ మీది పద్యం. దీనిలో ఉన్న రామణీయకానికి లొంగిపోయి, లేదా మెచ్చుకుని పోతన్నగారు — "పరు జూచున్ వరు జూచు" అనే పద్యం సరిగా

యీ ఘట్టంలోనే వ్రాసేరు. నిజానికి సోమనాథుని పద్యాని కిది లో ధ్వనిపిస్తుంది కూడా. అయితే పోతన్న కంఠం చైతన్యంతో నిండిపోయి శతాబ్దాలనుండీ కోట్ల ప్రజను ఊగించి పారేస్తున్న పాంచజన్యంగాని - ప్రతిధ్వనా? ఇలాగే శ్రీనాథుని ప్రభావం పెద్దన్న మీద ఉంది అంటారు. ఉంది నిజమే. ఎంత గొప్ప కవి మీ దైనా అతనికి పూర్వు లైన కవు లందరి ప్రభావమూ పడుంటుంది. పెద్దన్న పైని కూడా అంతే.

"నళిన సంభవు వాహనము వారువంబులు
కొలము సాములు మాకు కువల యాక్షి"

అన్న శ్రీనాథుని పద్యానికి ప్రతి అంటారు పెద్దన పద్యం. ఏ దంటే -

"చిన్ని వెన్నెల కందు వెన్ను దన్ని సుధాబ్ధి
పొడమిన చెలువ తోబుట్టు మాకు"

అన్నది. ఇది ప్రతిధ్వని అనుకుంటారు. కాదు. ఆ పద్యానికి లొచ్చు కూడా కాదు. ఇలాగే మన పూర్వ కవుల్లో ఎందరో గొప్ప వాళ్ల మీద కూడా వాళ్ల పూర్వుల ప్రభావాలు ఎలా పడ్డాయో కనబడు తుంది.

ఇక్క డొక సంగతి. ప్రతిభావంతు డైన కవి క్రమంగా అట్టి ప్రభావాలనూ, పలుకుబళ్లనూ వదిలించుకుని తన కంఠరవం ప్రత్యేకంగా మలుచుకుని విశ్వసాహితీ వీణతో మేళవిస్తాడు.

ఇంకొక మాట. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క కవి కంఠం పోగా పోగా తనకు తానే ప్రతిధ్వని అవుతుంది. ఇది రెండు మూడు కారణాల వల్ల కావచ్చు. వారి జీవితంలో కొత్త అనుభవాలు రానప్పుడు - ఒకటి. అంటే చెప్పేది కొత్తది లేనప్పుడు. ఎక్కువగా

అదే పనిగా వ్రాసి పారేసేటప్పుడు - రెండో రకం. శ్రీనాథుడిలో ఇలాటిది కనబడుతుంది. మూడవది - ప్రతిభలో వైవిధ్యము, వైశాల్యము లేనప్పుడు కూడాను.

మరొక్క విశేషం. కవి కంఠాల్లో కొన్ని అనుకరించ లేనివి ఉంటా యను కొంటాను. మన ఆంధ్ర కవుల్లో తిక్కన, పింగళి సూరన్నగార్ల వాణులు అలాంటి వని నా నమ్మకం. ప్రతిభావంతు డైన కవి అవలంబించే రీతి అతి మోహనంగా ఆకర్షించి నపుడు అనుకరించవచ్చు. బాహ్య వేషభాషలను అనుకరించ వచ్చు. ఆ రీతి అంత ముఖ్యంగా ప్రస్ఫుటంగా కనబడక, విషయాన్ని విశదీకరించే సాధనంగా మాత్రమే ఉపకరించినప్పుడు దాన్ని ఎలాగ అనుకరించడం? నాకు మాత్రం తిక్కన్న, పింగళి సూరన్నల మాదిరిగా వ్రాయబోయిన వాళ్లు కనబడరు.

ఇంతకీ, నేను మొదట చెప్పినట్లు. మా గురుదేవుల వేషభాషలను మాత్రం అనుకరించగలిగాము. మా అంతరంగాలమీద వారి ప్రభావం ప్రసరిస్తే అనుకరించడం మాత్రం కాదు.

ఆఖరి మాట. సంకుసాల నృసింహకవి చెప్పిం దుంది –

“హృదయగతిన్ పురాతన కవీశ్వరు లేగని త్రోవ లేదు, నే<br>
త దనుమతిన్ రచించు కృతి తాత్త్వికులన్ కరగింపకుండునే<br>
మదగజ రాజముల్ చనిన మార్గములన్ కడు నింపు నింపవే<br>
మదగజరాజయాన మదమంథరబంధుర యానమానముల్.”

ప్రతియుగంలో కంఠరవాలు వినబడుతూనే ఉంటాయి - ప్రతిధ్వనులూ ఉంటాయి.

— ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుంచి 7-11-1960న ప్రసారితం; 7-12-1960 నాటి ‘వాణి’ సంచికలో ప్రచురితం.

# వక్తృ - శ్రోతలు

ఈ రోజులలో - అంటే ప్రజాస్వామ్యపు రోజులలో - రెండు గొప్ప శక్తులు దేశాన్ని నడిపిస్తాయి : పత్రికా, ప్రసంగవేదీ. పూర్వం మన దేశంలో వీటికి అంత ప్రభావం ఉన్నట్టు కనపడదు. ఏ రాజో, చక్రవర్తో రాజ్యాల్ని పాలించేటప్పుడు, ప్రజల హక్కులనీ, కష్టసుఖాలనీ, మరేదో అనీ ఆందోళనలు చేయడానికి కాని, ఆవేశాలు కలిగించడానికీ ప్రబోధించడానికీ కాని అవసరమూ ఉండేది కాదు, అవకాశమూ ఉండేది కాదు.

పాశ్చాత్య దేశాలలో గొప్ప వక్తలు ప్రజాస్వామ్యం ఉన్న దేశాలలోనే వచ్చారు — బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలలో. పూర్వకాలపు యూరోపు ఖండంలో గ్రీకుదేశపు డెమాస్తనీసు, రోము రాజ్యపు సిసిరో ప్రసిద్ధులు. అసలు ఏ గొప్ప వక్తనైనా ఎక్కువగా మెచ్చుకునేటప్పుడు, అతణ్ణి డెమాస్తనీసుతో పోల్చడం రివాజయిపోయింది - గ్లాడ్‌స్టన్‌నో, చాతమ్‌నో ఆంగ్ల డెమాస్తనీస్ అన్నట్లు.

ఇంతకూ తేలిం దేమిటంటే, ఏ రాజ్యపాలనలో ప్రజల పలుకుబడీ, బాధ్యతా ఎక్కువగా ఉంటాయో, అక్కడ ఆ ప్రజల్ని బుద్ధిమంతులు సమావేశపరచడం, ప్రబోధించడం కూడా ఉంటా యని.

మన భారతదేశంలో దాదాపు నూరేళ్లనుంచి మహావక్తలు పుట్టుకు వచ్చారు. ఇలా రావడానికి కారణం ఇక్కడ రెండు మూడు మహోద్యమాలు పుట్టి విజృంభించాయి. సంఘ సంస్కరణోద్యమం, మత సంస్కరణోద్యమం, భారత స్వాతంత్ర్యోద్యమం - మూడు ఉద్యమాలూ ప్రజలకు సంబంధించినవే.

అయితే దాదాపు ముప్ఫయి ఏళ్ల క్రితం దాకా మధ్యతరగతి అక్షరాస్యులే ప్రజ అన్నమాట. అంటే నా అభిప్రాయం సభల్లో, సమావేశాలలో వాళ్లే లెండి ఉండేవారు. వాళ్లే శ్రోతలు.

కనుక వక్తల ప్రసంగాలలో కూడా ఒక హుందా, ఒక పెద్ద మనిషి తరహా ఉండేవి. పెద్దలవీ, కవులవీ సుభాషితాలతో బరువుగా ఉండేవి ఆ ప్రసంగాలు. ఏరిన శబ్దాలూ, ఆ శబ్దాల్ని వాక్యాల్లో కూర్చే విధానమూ అన్నీ ఏదో కావ్యంలో లాగ ఉదాత్తంగా ఉండేవి, నిదానంగా నడిచేవి.

అప్పటి మన వాళ్ల ప్రసంగాలు 18 వ, 19 వ శతాబ్దుల ఆంగ్ల వక్తల ప్రసంగాల ధోరణిలో సాగేవి. అంతే కాకుండా, మన వాళ్ల ప్రసంగాలు కూడా ఎక్కువ ఆంగ్లంలోనే ఉండేవి. అక్కడక్కడ మన దేశభాషలలో మాట్లాడేవారు కొద్దిగా ఉండేవారు.

గాంధీ యుగం వచ్చాక, ప్రజాబాహుళ్యం సభలు వచ్చాయి. గాంధీ ఉద్యమంలో మంచి వక్తలూ వచ్చారు.

సభలకు హాజరయ్యే వాళ్లల్లో ఎన్ని రకాల వాళ్లున్నా రండీ! ఎన్నెన్ని మానవ ప్రకృతులున్నాయో అన్ని రకాల శ్రోతలూ ఉంటారు కదా! అయినా కొన్ని నమూనాలు మరీ స్ఫుటంగా కనిపించేవి. అంటే, సాధారణంగా ప్రతీ సభకూ హాజరవుతూ,

"ఇదుగో నే నున్నాను ఇవాళ ఉపన్యాసం వినడానికి" అని అన్నట్టు వక్తకూ, ఇతర సదస్యులకూ అనిపించేవి.

అయిదు గంటలకు ప్రారంభ మయే సభకు నాలుగు గంటలకే వచ్చే భక్తు డున్నాడు. ఇతగాడు పెద్దమనిషి. ప్రతీ సభకూ కూడా, ఎవరు మాట్లాడినా సరే, ఏ విషయాన్ని గూర్చిన ప్రసంగ మయినా సరే ఈయన వేంచేసి తీరుతాడు. అంతే కాదు; అది ఎలాంటి ఆముదపు ప్రసంగ మయి ఊరుకున్నప్పటికీ ఈ మంచివానికి బాగుండి తీరుతుంది.

ఇతగాడు మళ్లీ మూడు నాలుగు రకాలు:

రాగానే ముందు పంక్తిలో కూర్చుండి, సూటిగా అప్పణ్ణుంచే వేదిక వైపు వక్త నిలబడవలసిన చోటుకేసి చూపులను గుచ్చి చూస్తూ, నవ్వూ త్రుళ్లూ లేకుండా సభాంతందాకా కూర్చుండే రకం ఒకటీ; ఈయన నిజానకు ఉపన్యాసం వినడు. మంచివాడు. మనస్సు ఖాళీగా కూడా ఉంటుంది, మొదటా చివరానూ! సభకు రావడం పురుషుల లక్షణం కనుక వస్తాడు. ఇతగాడు పల్లెటూ రయినా, బస్తీ అయినా హరికథకూ, పురాణానికీ కూడా వెడతాడు. వినకుండా సంతోషిస్తాడు. వక్తను తనేమీ కవ్వించడు.

ఉపన్యాస ప్రారంభం మొదలుకొని అంతందాకా, పెదవులు రెండు చెవులదాకా విశాలమైన నవ్వుతో, చప్పుడు చెయ్యని నవ్వుతో - చిరునవ్వే అది - అలాంటి నవ్వుతో సాగదీసి తానూ వక్తా, విషయమూ లోకమూ అంతా మంచివి కనుక తాను ఎంచక్కా ఒప్పుకున్నట్టు కనబడే రకం మరొకటీ. ఈ రబ్బరు రకం మొదటి రకానికి తమ్ముడు. ఇతనూ వక్తకు ఇబ్బంది కలిగించడు. కాని, దిగులు కలిగిస్తాడు. ఇతనూ విన డనిపిస్తుంది.

ఉపన్యాసం ప్రారంభించీ ప్రారంభించడంతోనే కుర్చీ ఉందే దాని అంచునీ, క్రింద అవుతే ఒక కాలు అడ్డంగానూ, ఒక కాలు నిటాగ్గానూ మడిచి మడతగా ముందుకి ఒరిగిస్నీ, మరీ మంచి సంగతి వచ్చినప్పుడు ఉత్సాహంతో అవసరమైతే ముందుకు దూకడానికి లాగ కూర్చుని, అప్పుడూ ఇప్పుడూ పేలవ మయిన చోట "వినండి వినండి" అంటూ, హాస్యం లేని చోట ఫెడీలు మని నవ్వుతూ, తానే దగిరుండి వక్తచేత ఉపన్యాసం ఇప్పిస్తున్నట్లూ, తానూ ఫక్తతో ఏకీభవిస్తున్నట్లూ తొండలాగ తల పంకిస్తూ సందడి చేసే నరాల పట్టులేని వాడుదొడుకు రకం ఒకటి ఉంది; ఇతడు వక్తకు ఉత్సాహం కలిగిస్తా డనిపిస్తుంది కాని నిజానికి కలిగించడు. ఒక్క "వినండి వినండి" తో వాక్యాన్ని నడుమ తుంపెయ్యగలడు. ఒక్క తుపాకి నవ్వుతో భావ వాహినిలో పెద్ద రాయి పడెయ్యగలడు. ఒక్క తలపంకింపుతో వక్త తల కూడా ఊపెయ్యగలడు.

ఇంకో జాతి శ్రోత ఉన్నాడు. అరుదు గాని - ఉన్నాడు. అక్కడక్కడ కనిపిస్తూంటాడు. ఇతగాడు చిన్న నోటుబుక్కుతో, పెన్సిలుతో వస్తాడు. ప్రసంగం వింటూ వింటూ రివ్వున నోటు బుక్కూ, పెన్సిలూ తీసి దానిలో ప్రసంగంలోని మహ ద్విషయమో, వాక్యమో వ్రాసేసుకుంటాడు, మహ జ్ఞానతృష్ణ ఉన్న నిత్య విద్యార్థి లాగ. ఆ పుస్తకం నెమ్మదిగా లాగి చూస్తే, ఎందరివో ఎన్ని ఉపన్యాసాల తాలూకువో దానిలో వ్రాసి ఉంటాయి. అయిన తారీఖు, వక్త పేరు, ఉపన్యాస విషయమూ కూడా ఉటంకింపబడి ఉంటాయి. అయితే దానిలో వ్రాసి ఉన్న వేవీ వ్రాసిన వాడికీ, ఇతరుడికీ కూడా తెలియవు. భక్తిగా వ్రాయడమే కాని వ్రాసిన సంగతి గురించి పట్టింపు లేదు కనుక, ఏం మాట్లాడినా వ్రాసు కుంటాడు కనుక, ఎవరివద్దనుండి అయినా ఎంతో కొంత నేర్చుకో

వలసింది ఉంటుందీ అని గ్రహించిన వినయశీలీ, ఉత్తముడూ కనుక ఇతను కూడా వక్తకు ఏమీ ఆయాసం కలిగించడు.

వీళ్లతో ఇంకొక డున్నాడు. వక్తకు స్నేహితుడు, అనుయాయి, మెచ్చుకునేవాడు. ఉపన్యాసం సాగుతుంటే కళ్లు ఉల్లాసంతో మెరిపిస్తూ, ఇటూ అటూ ఇతర సదస్యుల వైపు "నేను చెప్పాను గదూ ముందే" అన్నట్లూ, "ఎవరికోసం ఒప్పుకుంటారండీ చచ్చినట్లు" అన్నట్లూ, "అయిందా మీ పని" అన్నట్లూ చూస్తూ, ఉపన్యాసం చివర్ని కరతాళధ్వనులు తాను మరీ ఎక్కువగా పొడిగిస్తూ చివర్ని వక్త పక్కకి దూకి ఇట్టే అంగ రక్షకుడు లాగ నిల బడుతూ, ఆటోగ్రాఫ్ హంటర్సుని సర్ది జాగ్రత్తగా అర్డరులో పంపుతూండేవాడు.

ఈ శ్రోత లందరూ వక్త స్నేహితులు – పురాణకాలక్షేపం రకం, రబ్బరు నవ్వు రకం, తొండ రకం, నోటుబుక్కు రకం, అంగ రక్షకుడి రకం.

మరికొన్ని జాతుల శ్రోత లున్నారు. వీళ్లతోనే పేచీ. వీళ్లల్లో కొందరు ఉపన్యాసకుని ఉక్కిరి బిక్కిరి చేస్తారు. కొందరు ఎదురు సవాళ్లు వేసినా ఉత్సాహం కలిగిస్తారు. నిదానమైనవారు కాకపోతే వక్తకి కొందరు కోపం, కొందరు దిగులూ కలిగిస్తారు.

ఒక్కొక్క శ్రోత వస్తుంటాడు. ఇతగాడు ఉపన్యాసకుడి వైపు చూడడు. పక్కకి తల తిప్పి ఏదో చూస్తున్నట్లు చూస్తూ కూర్చుంటాడు. "ఏదో మాట్లాడుదూ! నేను వింటూనే ఉన్నాను. ఇలాంటివి చాలా విన్నాను కూడా" అని అనుకున్నట్టు వక్తకు అనిపిస్తాడు. ఇది గడ్డు జాతి, గడసరి జాతి. ఉపన్యాసం కాగానే తత్క్షణం ఏమీ అనకుండా వెళ్లి పోతాడు. ఉపన్యాసం సాగుతుంటే

అతని వైపు పదే పదే చూడాలనీ, అతని మనస్సు ఏమనుకుంటూాందో గ్రహించాలనీ వక్తకు కూడా ఉంటుంది. ఇది నిర్లక్ష్యపు జాతి అనిపిస్తుంది.

మరొక రకం శ్రోత ఉంటాడు. ఈ భయంకరుడే సూటిగా వక్త కళ్లల్లోకి తన కళ్లసూదులు అదే పనిగా గుచ్చి చూస్తూ, నవ్వూ త్రుళ్లూ, తలపంకింపూ ఏమీ లేకుండా కూర్చుని, "నువ్వు చచ్చినా ఎంత వాగినా నేను మెచ్చుకోను తెలిసిందా" అన్నట్లు ఉంటాడు. ఇతగాణ్ణి ఏమాత్రం లక్ష్యంచేసినా, ఇతని వైపు ఏమాత్రం తరుచుగా చూసినా ఉపన్యాసం నట్టుతుంది. ఇతగాడు లోకోత్తరుడు, అసాధ్యమైన తెలివితేటలు గలవాడు. మెచ్చుకుని తన తెలివితేటలకు లోపం తెచ్చుకోడు. "ఏమండీ ఉపన్యాసం ఎలా గుందండీ?" అని ఎవ రయినా అడిగితే, "నువ్వూ విన్నావుగా" అని వెళ్లిపోతాడు. ఇతని పాటి తెలివైనవాడు మరి సృష్టిలో లేడని అతనికి తెలుసు. "ఒయ్యోయ్! వక్తగారు! తమరు కూడా తెలుసు కోండి" అన్నట్టు కూడా ఉంటాడు. ఇతన్ని వక్త కూడా ఆట్టే కనిపెట్టకూడదు. మిగిలిన సదస్యలోకాన్ని లాగి పారేసి, ఆ ఊపుతో, ఆ ధాటీతో ఇతన్ని తోసి పారేయాలి.

ఇంకొక రకం గమ్మత్తు శ్రోత ఉన్నాడు. ఉపన్యాసకుడి వైపు చూస్తూ, పక్కన ఉన్నవాడితో ఏదో చెప్తూండడం, నవ్వుతూండడమూ చేస్తూ ఉంటాడు. ఉపన్యాసంలో ఆకర్షణ లేకపోతే, జిడ్డుగా ఉంటే, మరో విషయం తోచక పక్కవాడితో మాట్లాడుతున్నట్లు కనబడతాడు. ఒక్కొక్కప్పుడు మరొక రకం కంగారు కలిగిస్తాడు ఇతనే. వక్త కట్టులోనో, చొక్కాలోనో ఏదో నవ్వు పుట్టించేది ఉన్నట్లో, వక్త హమేషా తెలియకుండా ఒకటే మాటనో, ఒకటే చేయి ఊపునో, ఒకటే పెదవి చప్పరింపునో వాడుతున్నట్లో, అలా చేయడం వల్ల వాళ్లల్లో వాళ్లు నవ్వుకుంటున్నట్లో

తోపిస్తాడు ఈ మహానుభావుడు. ఇతడిది చాలా అపాయకర మైన ధోరణి. ఏ మాత్రం దిటవులేని వక్త అయినా, ఇతన్ని సభలో చూడగానే తెల్లమొగం వెయ్యడమో, బుర్రా, నోరూ సాగక పోవడమో జరుగుతాయి.

ఇక యుద్ధకాండపు శ్రోత లున్నారు. వీరిలో ధర్మయుద్ధం వాళ్లూ, అధర్మపు దొంగతనపు చాటుమాటు నంగి నంగి యుద్ధం వాళ్లూ ఉన్నారు.

అసలుయుద్ధాలలో లాగే ధర్మయుద్ధం వాళ్లతో పోట్లాడి గెలవడమే తేలిక. వీళ్లు అడ్డుసవాళ్లు వేస్తారు. గర్జిస్తారు. హాస్యపు మాటలు విసురుతారు. ఇవేవీ రానివాళ్లు ఊరికే చప్పట్లు కొడతారు. వీళ్లు నిజానికి నిజమైన వక్తకు ఉత్సాహమూ, వేడీ కలిగిస్తారు - ముఖ్యంగా అడ్డుసవాళ్లు వేసేవాళ్లు! ప్రపంచమంతా వక్త లలో ఎందరో ఈ అడ్డుసవాళ్లు వేసేవాళ్లకు జవాబులు చెప్పో, చమత్కారపు మాటలు విసిరో ఎలాగ నెగ్గుకుని వచ్చారో ఎన్నో కథ లున్నాయి. మన తెలుగువారిలో రామలింగారెడ్డిలాగ, గోపాలకృష్ణయ్యలాగ ఈ వక్తలు అతిరథులూ, మహారథులున్నూ. ఈ శ్రోతకు లొంగకూడదు. ఇతగాడితో యుద్ధంలో మెదడు చేత కత్తిలాగ, మెరుపులాగ, బాణాకర్ర లాగ పని చేయించాలి వక్త.

ఇక అధర్మ యుద్ధపు శ్రోతగారు. ఇతనికి ఎన్ని జంతువుల భాషలో వచ్చు. ఎన్ని రకాల వాద్య విశేషాలో నేర్చుకున్నాడు. కప్ప, కాకి, మేక, పిల్లి, శునక, గార్ద భాదులు అన్నిటి అరుపులూ అచ్చంగా అలాగే వచ్చు నితనికి. తరువాత సన్నాయీ, ఈల పాటా, బ్యాండు వాద్యమూ అన్నిటిలో దిట్ట ఈయన.

ఒకసారి వీటి సహాయం ఏమీ అపేక్షించ కుండానే ఉపన్యాసం హుషారుగా సాగుతున్నప్పుడు నిశ్శబ్ద సదస్యలోకం లోనుంచి ఒక్క మూలుగు - రోకలి బండలాగ, పాములాగ మన నరాల ద్వారా మెదడులోకి పాకి, తిరిగి నరాల ద్వారా ఒళ్లంతా నిండి పోయేది - ఒక్క మూలుగు మూలుగుతాడు. అది వక్తకు మృత్యువు లాంటిది ; ఎంత భక్తుడైన శ్రోత కైనా చక్కిలిగింత పెట్టేదిన్నీ! ఇతగాడే వక్తకు ప్రబ లాతిప్రబల శత్రువు. ఇతన్ని జయించే ధైర్యం, గౌరవం, హుషారు వక్తకు ఉండి తీరాలి.

అయితే ఇతనికన్నా శత్రువు ఇంకొకడే ఉన్నాడు. ఇతను కూడా చల్లగా, చప్పుడు చేయకుండా వింటూన్న సభ్యకూటంలో నుంచి హఠాత్తుగా గట్టిగా ఆవులిస్తాడు. వక్త అంటే గిట్టక కాదు. పరధ్యానంగా, అంతే. ఏ ఇంటిగొడవో ఏదో ఆలోచించుకుంటాడో ఏమో ; ఇతన్ని ఎలా ఎదుర్కోవడం చెప్పండి వక్త?

వీళ్ల శ్రోతలలో కొన్ని రకాలు.....

పూర్వపు సభలలో ఇన్ని జాతులు లేవు. ఇప్పటి సభలలో లక్ష రకాలు.... పిల్లలూ, స్త్రీలూ, పురుషులూ, అక్షరాస్యులూ, నిరక్ష రాస్యులూ, వినాలని వచ్చినవాళ్లూ, ఊసుపోక వచ్చినవాళ్లూ, పెద్ద మనుషులూ, పెంకెవాళ్లూ - ఇందరిలోనూ ఎన్నో మనస్తత్త్వాలవాళ్లు ఉంటారు.

ఎంత గడిదేరిన వక్త కయినా గద్దెమీదకి ఎక్కేముందూ, ఎక్కిన రెండు నిమిషాలదాకానూ లోపల గుండె పీచుపీచు మంటూ ఉంటుం దనుకుంటాను. వేయిమందితో కర్రతో చేడీ యుద్ధం చేయవలసినవాడు వక్త. పదహారువేలమంది వివిధ విధాలవాళ్ల మనస్సులకు ఒకేసారి చక్కిలిగింత పెట్టవలసిన దక్షిణనాయకుడు

వక్త. మెదడుతో ఉప్పట్టీ, బెడుగుడూ, కుండబంతీ, కోతి కొమ్మచ్చీ అంచీలమీద ఆడగలిగే నేర్పరి వక్త.

వేదిక ఎక్కగానే సభ్యుల నందరినీ జాగ్రత్తగా చూసుకోవాలి. కొంతవరకు సభసంగతి తెలిసిపోతుంది. తరువాత చిరునవ్వు మొగంతో మొదలుపెట్టాలో, శాంతంగా మొదలుపెట్టాలో, గంభీరంగా మొదలుపెట్టాలో తెలిసిపోతుంది.

ఒకసారి డ్రమెటిక్‌గా మొదలుపెట్టాలి. ఒకసారి కథతో బయలుదేరాలి. ఒకసారి హాస్యపు మాటతో ప్రారంభించాలి. ఇలా చేస్తూ తన ఆయుధా లన్నీ, అంటే అవసరాన్నిబట్టి గద, కత్తి, కర్రా అన్నీ సిద్ధం చేసుకోవాలి.

ఇక స్థలాన్నిబట్టీ, కాలాన్నిబట్టీ వక్తమనస్సు ఎలా మారుతుందో అలాగే శ్రోతదీ మారుతుంది. గదిలో సభ ఒక పద్ధతి. అరుబయటిది ఒక పద్ధతి. సాయంకాలానిది ఒక ధోరణి. కొంత రాత్రి ముదిరాక ఒక మాదిరి.

ఎక్కడిదయినా, ఎప్పటిదయినా సభాస్తారులు అక్కడా అక్కడా చెల్లాచెదురుగా కూర్చుంటే సభ అనిపించక, ఏదో బాటసారులూ వాళ్లూ కూర్చున్నట్లు అనిపించి మాట్లాడా లనిపించదు.

ఇక ఉపన్యాసం అంతా ఊరికే ఆవేశంతో ఊగి పోకూడదు - మొదణ్ణుంచీ, ఏదో ప్రవక్త వచ్చి మాట్లాడినట్లు! ఈ రోజులలో జనం అట్లాగ ఒప్పుకోరు. ఈ రోజుల్లో అధికారి అయినా అధికారిలాగ మాట్లాడితే శ్రోతలు ఒప్పుకోరు. అందరిలోనూ కొంత ఆగ్రహమూ, ఆత్మగౌరవమూ ఉన్నాయి కనుక.

ఎక్కువగా ఆప్తస్నేహితుడిలాగ, భాయిభాయిలాగ మాట్లాడాలి. నవరసాలూ ఒలికించాలి. ఎక్కువగా హాస్యరసం, సెటైర్, ఎత్తి

పొడుపు ధోరణీ ఉండాలి. మామూలుగా మాట్లాడే ధోరణిలోనే, పుస్తకంలోంచి చదివేలాగ గాక వ్యావహారికపు ఇంటిమేట్ రీతిలో ఉండాలి.

మధ్య అవసరాన్నిబట్టి, ప్రసంగంలో ఘట్టాల్నిబట్టి ఆవేశంతో ఉదాత్త ఫక్కీని పెద్దధోరణిలో మాట్లాడాలి.

ఒక్కరు ఆవులించినా నీవు కథ చెప్పాలి. ఒక్కడు పర ధ్యానంగా ఉన్నా కథ చెప్పాలి.

అన్నిటికీ అడుగున సిన్సియారిటీ ఉన్నట్లు అనిపించాలి.

ఇవేవీ లేకుండానే, పూర్వపు సంస్కృత సుభాషితాలతో, లెఖ్ఖలతో ఉక్కిరిబిక్కిరి చేసి శ్రోతల్ని గెలిచేవారూ ఉన్నారు. ఎంచేతంటే, ఇంకా మన శ్రోతృలోకం పూర్తిగా ప్రజాస్వామ్య యుగంలో పడిపోలేదు.

'వక్తృత్వము : శ్రోతల మనస్తత్త్వము' అన్న శీర్షికతో రేడియోద్వారా ప్రసారితం : 23-5-1950

26

# చిత్రకళలో రసన

"ప్రతిభ అంటే ఆటంకంగా ఉన్న తెర పలచబడడం" అని ఆనంద కుమారస్వామి గా రంటారు. అంటే ప్రతిభా వంతు డైన కొద్దీ సత్య మనండి; లేక, ఏదో అలౌకిక దృశ్య మనండి; లేక లౌకిక వస్తువులోనే ఇమిడి ఉన్న సౌందర్య మనండి - దానిని ఎక్కువ స్పష్టంగా, ఎక్కువ సన్నిహితంగా చూస్తాడు. ఈ మాటలు చిత్రకళను గూర్చి, చిత్రకారుని గూర్చి వ్రాస్తూ విద్వాంసు డైన ఆ కళా కోవిదు డంటాడు.

"కనపడని సత్యం యొక్క కనబడే చిత్రం" కల్పించేది కళ అని దీన్నే ఇంకోలాగ వేరొక తత్త్వజ్ఞుడు చెప్తాడు.

"సత్యం మనస్సులో ఉంది, కాని వస్తువులో లేదు" అని చిత్రకళను గూర్చి వ్రాస్తూ వేరొక కళాభిజ్ఞుడు ఈ అభిప్రాయాన్నే ప్రకటిస్తాడు.

"శరీరం మనస్సుగా మారే ప్రయత్నమే ప్రతిభ" అని ఈ ఉద్దేశాన్నే చిత్రంగా కోల్‌రిడ్జ్ వెలువరుస్తాడు.

ఈ తెర పలచబడడ మనేది, కనబడే చిత్రంలో కనబడని సత్యం చూడడ మనేది, శరీరం మనస్సుగా మారడ మనేది - ఈ

శక్తి, చిత్రం కల్పించే ప్రతిభాశాలిలోనే గాక, కొంత వరకు చిత్రాన్ని గ్రహించే వ్యక్తిలో కూడా ఉండితీరాలి. అప్పుడే సరియైన అభిరుచి ఏర్పడుతుంది. ఆ శక్తియొక్క పరిమాణాన్ని బట్టీ, ఆ శక్తి లేకపోవడం బట్టీ రసన, రసన లేకపోవడము, వికృత రసన ఏర్పడతాయి.

ప్రతిభ అంత అరుదు కాకపోయినా, ఈ అనుభవించే గుణం, ఈ అభిరుచి అందరిలోనూ కనబడదు. కొందరిలో అలస్యంగా తల ఎత్తుతుంది. కొందరిలో ఇంకి పోయి, పరిసరాల వల్ల, చిన్నతనంలో పొందిన విద్యాశిక్షణల వల్ల, అసలు పూర్తిగా విరుద్ధ మైన దానికే మనస్సు తిప్పబడడం వల్ల ఉండనే ఉండ దనిపిస్తుంది - కవిత్వానికి కొందరు కత్తు లైనట్లు, సంగీతానికి కొందరు గొడ్డళ్లయినట్లు.

ఈ అభిరుచి ఏర్పడక పోవడంలో అసలు చిక్కే ఉంది. సామాన్య మానవుడు పరిచిత మైనదాన్నే పరిగ్రహిస్తాడు, కాని కొత్త విషయాన్నీ, కొత్తదిగా కనబడేదాన్నీ స్వీకరించడు. అనాకారమే సామాన్య మైనప్పుడు దానినే ఒప్పుకుంటాడు గాని, దానిని తోసివేసి, దూరసౌందర్యాన్ని గాని, అదృశ్యసత్యాన్ని గాని అందుకుందుకు కృషి చెయ్యడు. అందువల్లనే చిత్రకళ మొదలైనవంటే ఉచిత రసన ఎందరిలోనో ఉండదు.

ఇంక చిత్రకారునిలోనూ ఈ అభిరుచి చిత్రంగా మారుతుంది; చిత్రం చూసి మెచ్చుకునేవానిలోనూ మారుతుంది.

"మావిగున్న కొమ్మను మధు మాసవేళ
పల్లవము మెక్కి కోయిల పాడు నేల ?"

అంటే కొందరు ఒప్పుకోరు.

మా అబ్బాయి అయిదేళ్లు నిండకపూర్వమే బొమ్మలు గీయడ మని ప్రారంభించాడు. గోడలూ, పుస్తకాలూ, కాగితాలూ చిత్రశాలగా నా ఇల్లు తయా రయింది. ఉత్తగీతలూ, గీతలలోనుంచి ఆకారాలూ, ఆకారాలలోనుంచి అర్థాలూ ఇలాగ పెరగడం ప్రారంభించాయి.

ఒకసారి వాణ్ణి తోలుబొమ్మలాటకు తీసుకు వెళ్లాను. విరాట పర్వం. మర్నాడు కాగితాలమీద పాండవులవీ, కీచకుడిదీ, అందరివీ బొమ్మలు తయారు చేశాడు.

మా వాడు గీసే భీముడిలాంటి మనిషిని చూడలేదు. కీచకుని వంటి వాణ్ణీ నేను చూడలేదు. కాని అది భీముడు కాకపోనూ లేదు; అది కీచకుడు కాకపోనూ లేదు.

ఈ లోకానికి విలక్షణ మైనవై ఉంటూ, మళ్లీ ఈ లోకంలోవే అయి ఉంటూ ఉన్నవాటిని ఏవేవో వాడు గీయడం, నేను వాటిని పదిల పరుస్తూ ఉండడం జరుగుతూంది. ఈ బొమ్మ ఏమి టని నేను అడగడం గాని, ఇది వద్దు అని తోసివెయ్యడం గాని జరగలేదు.

ఒకసారి పైన చంద్రుడూ, కింద నదీ, పక్కన ఒక వ్యక్తీ వేశాడు. ఇంకోసారి భుజకీర్తులూ, కిరీటమూ, ఆజానుబాహులూ, పెద్ద ఛాతీతో ఎవరినో వేశాడు. మ రొకసారి పడిపోయిన టాంకులూ, ఎగురుతూ ఉన్న ఏరోప్లేనులూ, ఒరిగిపోయిన మనుష్యులూ - యుద్ధరంగం ఉత్త గీతలతో కల్పించాడు.

ఇ దంతా జిలిబిలి పలుకుల్లోనే పద్యాలు వ్రాయడం వంటిదే. అయినా ఈ చిత్రరచన అంతటిలోనూ ఒక ఆవేశమూ, ఒక అభిరుచీ మాత్రమే గోచరిస్తాయి.

ఇలాగ ఉండగా నా మిత్రుడు ఒక సుప్రసిద్ధ చిత్రకారుడు మా ఇంటికి వచ్చాడు. అతడు మా వానికి బందరు బాబయ్య. బొమ్మల్ని

చూశాడు. "అభిరుచి ఉంది, ఆవేశమూ ఉంది. ఇక అపమార్గంలో పడడ మనేదీ ఉంది. ఈ అభిరుచికి శిక్షణా, సంస్కారమూ, కృషీ కావాలి" అన్నాడు; అంటూ, "కొందరికి పుట్టుకతోనే అభిరుచి పుడుతుంది; కొందరికి హఠాత్తుగా ఒక మహా సంఘటన వల్ల బయట పడుతుంది; కొందరికి కృషి వల్ల సంపాదింపబడుతుంది. చిత్రాన్ని మెచ్చుకుని గ్రహించే రసన కూడా ఇలాగే సుమా" అన్నాడు. 'ఔను' అనిపించింది.

ఇంక ఈ రసనను గూర్చి మరొక మాట. మొదట పద్యం చదివాను. ఆనందించాను. విద్వాంసుల ద్వారా, గ్రంథాల ద్వారా ఎందుకు ఆనందం కలిగించిందో తెలుసుకున్నాను. తరువాత ఇంకా గొప్ప కావ్యాలు అనుభవించడం నేర్చుకున్నాను.

అలాగే లేపాక్షి ఆలయానికి వెళ్లాను రెండు సార్లు. మొదటిసారి వన్నెల వన్నెల బొమ్మల్ని చూసి బాగున్నా యనుకున్నాను; మిత్రుడైన గొప్ప కళావేత్త చిత్రకళా విమర్శనం విపులంగా విన్నాక తెలుసుకుని మెచ్చుకున్నాను. అవ్యక్త మైన రసనా, అమాయిక మైన ఆనందం నిజమైన రసనా, ఆనందమూ అయాయి.

ఇంకొక చిత్రం: 'హంసచే సందేశం పంపే దమయంతి', 'దుష్యంతునికి ఉత్తరం వ్రాసే శకుంతల' నాకు చిన్నప్పుడు మంచి బొమ్మలు. నాకు బొమ్మ బాగుంది. నాకు వికాసం అక్కరలేదు. లోపల తెరవ వలసిన దేదీ లేదు. అప్పుడు నా కన్ను మనస్సుగా మార నక్కర లేదు. బాగుంది - అంతే!

ఆ తరువాత కొంతకాలం అయాక దమయంతీ, శకుంతలా ఒక్కరే ఏమిటి చెప్మా అనిపించింది. కింద చిత్రం పేరు లేకపోతే అలాగే కలిసిపోయి ఉండురు.

"అవి ఎందుకు అలాగ?" అని మిత్రుణ్ణి అడిగాను.

"ఉత్తమ చిత్ర లక్షణాలు వానిలో లేవు కనుక. అవి చిత్రాల్లో వచనం వంటివి కనుక. అంటే కవిత్వంగాని పద్యమూ, కవిత్వమైన వచనం ఉంటాయి - కాని, ఈ చిత్రాలు కేవలమూ పేలవమైనవే కనుక" అన్నాడు. "అంటే?" అన్నాను.

"ఆ చిత్రకారుడు తెరను తొలగించలేడు. ఒక స్త్రీని, ఒక ప్రత్యేక స్త్రీని, ఎరిగున్న ఒక్క వ్యక్తినే ఒక చిత్రంలో ఉత్తరం వ్రాస్తున్నట్లూ, రెండవదానిలో పక్షికి ఎదురుగా ఉన్నట్లూ వ్రాశాడు. కాని దమయంతి నిరీక్షణ గాని, శకుంతల ప్రణయావేశం గాని చిత్రించ లేదు.

"ముక్కూ, కన్నూ, కాలూ సరిగ్గా శరీరశాస్త్ర ప్రకారం ఉచితంగా వేశాడా లేదా అని చూస్తారు కొందరు. అది కాదు కావలసింది - సరిగ్గా గణ యతి ప్రాసలు, సాధుశబ్ద ప్రయోగాలూ ఉన్నాయా అన్నట్లు. అంత సౌందర్యమూ, అనుభవమూ మనకు కావాలి.

"ఎందరో తెలియక అజంతా పద్ధతి చిత్రాలను తోసి వేస్తారు. అది న్యాయం కాదు. వారు కేవలమూ దమయంతినే గీయరు, దమయంతి తనాన్ని చిత్రిస్తారు. శకుంతలనే గీయరు, శకుంతల తనాన్ని చిత్రిస్తారు. ముక్కూ, కళ్లూ తిన్నగా లేని వాటిని చూస్తే నీవు నిజంగా అవి చిత్రించే అనుభవాన్ని పోల్చుకుంటావు. నీవు చిన్నతనంలో చూసిన చిత్రాల్లోనే దానిని పోల్చుకో లేవు" అన్నాడు.

ఉత్తమ చిత్రకారుడు ఒక వస్తువును తీసుకుని, దానిని వెలుగు నీడలలో చూసి, దాని అంతర జీవితాన్ని ఆత్మజీవితంగా అవలంబించి, ఆ వస్తుతత్త్వాన్ని మనకు చిత్రంగా అందిస్తాడు. కనుక ఆ చిత్రం తన మీదనే, కేవలం తన ఆకారంమీదనే ఆధారపడి

ఉండక సహృదయుని మనోవీథినే అవతరించి ఉన్న దాని గుణమూ, గాథా బట్టి మెచ్చుకో బడుతుంది.

రవీంద్రుని చిత్రాల్ని గూర్చి మహా చిత్రకారుడు నందలాల్ బోస్ ఈ అభిప్రాయమే ప్రకటిస్తూ, వానిని ప్రశంసిస్తాడు.

మైకేల్ ఏంజెలో వీథిలో పడి ఉన్న ఒక మోటు రాయిని చూసి, దానిలో "ఒక ప్రత్యేక సుందర దేవతామూర్తి సాక్షాత్కరిస్తుంది" అన్నాడు. ఆ మూర్తిని చెక్కాడు.

ఒక కవికి గూడా ఒక అనుభవమో, ఒక దృశ్యమో వ్రాసి నప్పుడు ప్రత్యేక శబ్దాలు కూడా వచ్చి భావ ప్రాంగణంలో మొదటే నిలబడతా యంటారు.

అలాగే చిత్రకారుడు ప్రత్యేక వర్ణాల్లోనే ఒక్కొక్క అనుభవాన్ని దర్శిస్తాడు.

ఇంతకీ ఈ రసన స్వతహా లోపల ఉండేదే కాని, సౌశీల్యాన్ని లాగే, కృషి చేసి కల్పించుకోలే మనిపిస్తుంది నాకు.

- రేడియోద్వారా ప్రసారితం

# ఆకలి

[1938 నాటి రేడియో ప్రసంగం]

నీవు ఏమి చెపుతావు దీనికి? ఎన్ని కడుపులు ఆకలితో కాలి పోతూ ఉన్నాయి!

ఇప్పుడు ఈ దేశంలో 35 కోట్లమంది ప్రజ ఉన్నారు: మరి మూడేళ్ళలో 40 కోట్లు! ఇప్పుడు రోజుకు మనిషికి మూడణాల ఆదాయ మయినా లేదు; అప్పుడు ఎంత ఉంటుందో!

తిండికీ తిప్పకూ, చదువుకూ సంధ్యకూ, మందుకూ మనికికీ — అంతా దీనిలోనే. తిండి లేక ఎంతమంది క్షయరోగులూ, పాలు లేక ఎంతమంది పిల్లలూ చచ్చిపోతూ ఉన్నారు! పాపం ఎంత మంది! ఇంతకూ ఆ పాలకోసం నెలకు ఆరు పైసలు చాలు సుమా! ఆరు పైసలు. అబ్బా, ఎన్ని కడుపులు కాలిపోతూ ఉన్నాయి! అబ్బా, తిఁడిలేక మానవులు నశించడమా!

"కోటి చేతులు చాపి
కాటకమ్మే తిరుగు
నేటి భారత భూమిలో!
నాల్గు దిక్కుల నడుమ
వెల్గు బంగరు నేల
నాశ మాయె మహాశ్మశానమై"

నీవు దీనికి ఏమి చెపుతావు? మన దేశం రత్నగర్భ కాదూ? మన దేశం వసుంధర కాదూ? మన దేశంలో ఎన్ని కడుపులు కాలుతున్నాయి - ఎన్ని కడుపులు! దీనికి నీ సంజాయిషీ ఏమిటి? ఇది ఈ రోజుల్లో అందరూ వేస్తున్న ప్రశ్న. ఎంత పెద్ద ప్రశ్న!

నిజానికి ఈ ప్రశ్నే నేను ఒప్పుకోను. అన్ని కడుపులు కాలిపోవాలా? అసలు ఒక్క కడు పైనా ఎందుకు మండాలి? ఒక్క కడుపు! దానికి నీ సంజాయిషీ ఏమిటి? దానికి నీ గుండె ఎలా మండిపో తున్నది?

ఇంత నిశితంగా, ఇంత సన్నిహితంగా, ఇంత ఉదా రాత్త్యు దారంగా నిన్ను నీవు ప్రశ్నించుకో - లోకంలో ఎక్కడా ఇంక దరిద్రచ్ఛాయ ఉండదు; అప్పుడే ఉండదు.

"ఒక్క గుండెలో ఆనంద మున్నా భగవంతు డన్నవాడు పూర్తిగా కుంగిపో లేడు; ఒక్క గుండెలో దుఃఖ మున్నా పొంగి పోనూ లేడు" అన్నాడు ప్రేమికు డైన రుషి. ఒక్క పొట్టలో ఒక్క పూట త్రేతాగ్ని అంటుకొని రేగిందా, మానవుడు అయినవాడు ఎవడూ లొట్టవేస్తూ, రుచి అనుభవిస్తూ ఒక్క మెతుకుకూడా ఆరగించ లేడు అన్నాడు మహాత్ముడు.

చాలా చిన్నతనంలో చదువుతూ ఉండేవాణ్ణి అంగ్ల పాఠ్య పుస్తకంలో ఈ చిన్నకథ. చదువుతూ గట్టిగా ఏడవ లేక నోట్లో తలగడ పెట్టుకొని కుమిలి పోయే వాణ్ణి!

ఆ దేశంలో చలి కాలం. రాత్రి వేళ కురిసిన మంచులో ఇళ్ళు కూడా సగం మునిగిపోతాయి.

పదేళ్ళ పిల్ల తిండి లేక — తల్లిదండ్రులు నుసి అయిపోయాక అనాథ కూడా కాదూ?— పగలల్లా తిరిగింది నాలుగు అగ్గిపెట్టెలు

అమ్ముకోవా లని. లేకపోతే ఈ రోజు కూడా జరిగిపోయిన నాలు గయిదు రోజుల లాంటిదే కాదూ ?

పూర్తిగా మోడు అయిపోయిన చిన్న శిశిర తరుశాఖలు — చేతులు — ఆ చేతులు చాపి ఒక్క అగ్గిపెట్టె కొంటారా అని అడగ నయినా అడగ లేక పోయింది. ఈ రోజు తిరగ నయినా తిరగ లేక పోయింది.

రాత్రి వచ్చింది. ఆ తల్లికీ వచ్చింది రాత్రి — ఎంత మంచిది ! కాలిపోయేవారిని రాత్రి ఆప్యాయంగా హత్తుకొంటుంది. రాత్రితో నిద్రకూడా వస్తుంది. ఏ పంచనో వాలిపోయింది పిల్ల.

ఉదయ మైంది. సూర్యుని మొదటి కిరణం నవ్వుతూ ఉన్న ఆ పిల్ల పెదవులమీద వాలింది. ఒళ్ళు అంతా వేళ్ళ కొనల దాకా మంచు కప్పుకుపోయి ఉంది. ఇంకా ఆమె అగ్గిపెట్టెలు అమ్ముకో నక్కర్లేదు.

ఈ గాథ చదువుతూ రోజూ నేను ఏకాకిని అయిపోయి తిరిగి తిరిగి అలిసిపోయి చచ్చిపోయేవాణ్ణి.

బ్రౌనింగ్ జాయ వేరే సందర్భంలో వ్రాసినట్టు - "they are weeping in the playtime of others." అందరూ ఆడు కొంటూ ఉన్నప్పుడు వాళ్ళు ఏడుస్తూ ఉన్నారు. మన దేశంలో ఎందరు దరిద్రులో, ఎన్ని విధాల దరిద్రులో — అందరూ అన్ని విధాలా అసహాయులైన పిల్లలే కాదూ ? "They are weeping in the playtime of others."

అంతే కాదు. ఆమె ఇంకో మాట కూడా అన్నది - "మానవుడు ప్రేమిస్తే దేవుడు ఉన్నా డనిపిస్తుంది ! వాళ్ళు రెండూ నమ్మలేక పోతున్నారు" అని.

అంతే కాదు. ఆమె ఇంకోమాట కూడా అంది: "వాళ్ళ మౌన వేదన బలశాలి ఆగ్రహం కంటె ఎక్కువ తీవ్రంగా శపిస్తుంది సుమా" అని.

ఇంకో కవి ఇలా అన్నాడు: ఒక మహా ముహూర్తంలో ఒక తేలు సగర్వంగా లేచి అంది – ఆ సూర్యునికి కాంతిభిక్ష పెట్టిన వాడే దిన దినమూ నాకు తిండి పెడుతున్నా డని; ఒక మహా ముహూర్తంలో ఒక సర్పం అగ్నిలతలాగ నృత్యంచేసి అంది— ఆ చంద్రునికి శీతల రజతాహారం అనుగ్రహించిన వాడే అను నిమిషమూ నాకు తినిపిస్తున్నాడు అని; ఒక మహా ముహూర్తంలో నక్షత్రా లన్నీ శత సహస్ర కంఠకాంతులు విప్పి అన్నాయి — ఆ పురుగులకు ఆహారం ఇస్తున్నవాడే దిన దినమూ మేము మరీ మరీ మెరిసిపోయేటట్టు మాకు ఆహారం అనుగ్రహిస్తున్నాడు అని. ఒక్క మహా ముహూర్తమూ లేదు మానవునికి. తాను నిర్మించు కొన్న కారాగారపు నారసాలలోనుంచి తను 'ఇదిగో చూడండి! నేను ఆకలితో చచ్చిపోతున్నాను' అంటున్నాడు.

ఇది కవి అన్నది. నే నంటాను – ఆకలి ఉంటే చచ్చిపోము అని.

మన దేశంలో ఆకలి లేదు. మనం శిలలం, మనం మృత్తు, మనం మృత్యువు! వేనవే లేండ్లు అసత్య ప్రచారాలు, అధ ర్మాచా రాలు, అసంబద్ధ వైరాగ్యాలు మనకు ఆకలి లేకుండా చేశాయి.

మన పొట్టకు ఆకలి లేదు; లే దని కూడా తెలియదు. మన గుండెకు ఆకలి లేదు; లేదని కూడా తెలియదు. మనకు ఆధ్యాత్మిక క్షుధ లేదు; లే దని తెలియదు. దానికి మన్నూ, దీనికి బొమ్మా, దాని కో ఆచారం ఇచ్చారు.

ఉపయోగించుకోని ఇంద్రియాలు హరించుకు పోతాయి కాదూ? మనం క్రమ క్రమంగా నశించుకు పోయాం!

ఆకలి ఆరోగ్య చిహ్నం, ఆకలికి బలం ఉంది, ఆకలికి సాహసం ఉంది. ఆకలి వేసే పొట్ట అన్నం తెచ్చుకు తీరుతుంది. ఆకలి వేసే గుండె ప్రియుడో, ప్రియురాలో రాలే దని ఊరుకోదు. ఆ మహా క్షుధే రేగితే, ఆలయ ద్వారాలు విడడానికి అనుమతి అక్కరలేదు ; అడు గడుగునా ఆలయం సాక్షాత్కరిస్తుంది.

కాని ఎలాంటి వైరాగ్యం బోధించారు! దారిద్ర్యంలో ఉన్న గొప్పదనం అంటారు! దారిద్ర్యంలో మహత్తు ఏమిటి? తన ఐశ్వర్యం లోకానికి పంచి పెట్టిన సంయమి ఎప్పుడూ లోకానికి దరిద్రుడు కాడు. రెండు విధాల ఐశ్వర్యవంతుడు. మన దారిద్ర్యం అటువంటిది కాదు. మన కున్న దారిద్ర్యం వంటిది ఉండకూడదు.

భర్తృహరి రెండు శ్లోకాలు వ్రాసేడు. ఒకటి చదివితే నా కళ్లు చెమ్మగిల్లుతాయి ; నా గుండె గొంతుకులో కొచ్చి కొట్టాడుతుంది. రెండోది చదివినప్పుడు మాత్రం నేను సిగ్గుపడతాను :

దీనా దీన ముఖై స్సదైవ శిశుకై
రాకృష్ట జీర్ణాంబరా।
క్రోశద్భిః క్షుధితై ర్నిరన్న విధురా
దృశ్యా న చే ద్గేహినీ॥
యాచ్ఞాభంగ భయేన గద్గద గళ
త్రుట్య ద్విలీ నాక్షరం।
కో దేహీతి వదేత్ స్వదగ్ధ జఠర
స్యార్థే మనస్వీ పుమాన్ ?॥

పాపం, తిండిలేని పిల్లలు దీనులై చిరిగి పోయిన తన కొంగు లాగుతూ ఉంటే నిరన్న విధురయై, దీనముఖ అయిన భార్యను చూడడం వల్ల గాని ధీరు డెవ డయినా కాలిపోయే తన పొట్ట కోసం

గద్గద గళంతో, విడికి పోయిన మాటలతో ఎవరి నయినా యాచిస్తాడా అని. అవును, యాచించడు ; అప్పుడూ యాచించకూడదు.

గంగా తరంగ హిమశీకర శీతలాని
విద్యాధరా ధ్యుషిత చారు శిలా తలాని।
స్థానాని కిం హిమవతః ప్రళయం గతాని ?
య త్సావమాన పరపిండ రతా మనుష్యాః !

ఎంతటి చక్కని శ్లోకం! ఎంత తీయనిది! కాని ఇంతకంటె అపాయ కర మైనది ఈదేశంలో లేదు. 'తాగడానికి గంగా జలం ఉన్నది ; పరుండడానికి శిలా తలాలు ఉన్నాయి ; ప్రళయం వచ్చి హిమగిరి స్థానాలు పోలేదే ! ఎందుకు మానవులు పరపిండాన్ని ఆశిస్తా' రని. తరువాత కానల్లో పళ్లున్నాయి, ఆకులున్నాయి, దుంప లున్నాయి అంటారు. మన కిది పనికి రాదు.

ఎంత దిగులు పుట్టించుతుంది ఈ వేదాంతం! ఎంత నీరసం చేస్తుంది ఈ వేదాంతం ! డెబ్భయి ఏళ్ళు వచ్చినా మానవుడు నృత్యం చేస్తూ నవ్వుతూ నడుస్తాడు. ఈ దేశంలో అయిదేళ్ళవాడు చివరలు కిందికి వంగిన పెదవులతో, దీర్ఘ ముఖంతో పాకుతూ బతుకంతా భూత భవిష్య ద్వర్తమానాలు కర్మసిద్ధాంతానికి ఒప్పచెప్పి ఊరుకొంటాడు.

నాకు ఐశ్వర్యం కావాలి, సమృద్ధి కావాలి. అందరికీ కావాలి. ఇది గుర్తించడం అత్యవసరం. మునుపు దక్షుడు గుర్తించ లేదు. నలిగిపోయాడు.

దక్షుడు బ్రహ్మకొడుకు, ప్రజాపతి, గొప్పవాడు. దక్షుని అల్లుళ్లు కూడా గొప్పవాళ్లు. కశ్యపుడు ఒకడు, యమధర్మరాజు ఒకడు,

రా జంటే, చంద్రు డొకడు. శివుడుకూడా దక్షుని అల్లుడే. కాని శివునికి తిండి లేదు, శివునికి బట్ట లేదు, శివునికి ఇల్లు కూడా లేదు. శివుడుమాత్రం ఐశ్వర్యానికి అధిపతి. శివుడు ప్రజల దేవుడు. ప్రజా శక్తి శివుడు. దక్షునికి కూడా ఐశ్వర్య మిచ్చాడు.

దక్షుడు యజ్ఞం చేస్తాడు. లోకాధిపతులు అందరూ వస్తారు. బ్రాహ్మణులు అందరూ వస్తారు. మహర్షులు అందరూ వస్తారు. ముక్కోటి దేవతలూ వస్తారు. యజ్ఞశాల మహా వైభవంగా ఉంటుంది. "వింధ్య మా కిడిన ట్లుండె విశ్వ సభయు." దక్షుని అల్లుళ్ళు అందరూ వస్తారు. శివుడు రాడు. శివుణ్ణి దక్షుడు పిలువనూ లేదు.

యజ్ఞశాలలో దధీచి మహర్షి లేస్తాడు. "ఐశ్వర్యం శివునిది. శివుణ్ణి అవమానించ గూడదు. శివుణ్ణి అవమానిస్తావా నీ దగ్గరి ఐశ్వర్యం బూడిదై, శివుని సాన్నిధ్యానికి పోతుంది. నీవు చితికి పోతావు సుమా!" అన్నాడు దక్షునితో.

దక్షుడు అహంకారి. ఆ హెచ్చరిక వినబడలేదు. దక్షుని కూతురు సతి నిండు సభలో భస్మ మై పోతుంది! శివుడు ఆ సంగతి వింటాడు. శివునికి ఆగ్రహం వస్తుంది. శివుని ఆగ్రహం వీరభద్రుడు. కోట్ల ప్రమథ గణాన్ని, అంటే, శివుని అనుచరులను వీరభద్రుడు నడిపిస్తాడు. యజ్ఞశాల గడగడ లాడుతుంది. దేవతలూ, రుషులూ అవమానితు లవుతారు. ఒకడి కన్ను పోతుంది. ఒకడి పళ్ళు పోతాయి. ఒకడి తల ఎగురుతుంది. దక్షుడు నాశ మవుతాడు. యజ్ఞశాల శ్మశాన మవుతుంది. ఇది ఒక ప్రళయ గాథ.

ఇలాంటి ప్రళయ సంఘటనలు పాశ్చాత్య లోకంలో వచ్చాయి. మనకు వద్దన్నాడు మహాత్ముడు. అవును, మనకు వద్దు.

పాశ్చాత్యుల దృష్టి ఈ దేహావరణ, ఈ లోకావరణ దాటదు. మన దృష్టి గరుత్మంతుడు. కాని, మనకు ఈ దేహం వద్దని కాని, ఈ లోకం వద్దని కాని ఏడిపించే శిథిల వైరాగ్యం వద్దు కదా!

మనది పెనుచీకటికి ఆవల ఉన్న వెలుగులో సజీవ విశ్వాసము; కనుకనే ఆ మహా లక్షణాలు - ప్రేమ వంటివి - కొన్ని మనలో కొంతవరకు అవతరిస్తే, లోకంలో బాధ అనేది ఉండ నివ్వలేము. "శ్రీరాముడు రాజు కానే కాడు. శిబి, కర్ణులు కానే కారు. తండ్రులు, ఆప్తబంధువులు. ప్రాణానికి ప్రాణ మైన నెచ్చెలులు. వాళ్ళ ఐశ్వర్యం వాళ్ళది కాదు. అందుకే అందరిదీ. కాబట్టి వాళ్ళదీని!" అన్నారు మన రుషులు.

శర ణాలయా లన్నారు, సత్రములు అన్నారు, అతిథి సేవ అన్నారు. వీటిలో కొంత ఆపత్తు ఉన్నా, ఇవి ఐశ్వర్యవంతుడికి మార్గాలుగా పెట్టారు; కాని దరిద్రుడికి ఆలంబాలుగా పెట్టలేదు.

మనదేశంలో నారయ్యప్పారావుగారి కథలు వినలేదూ ? చలితో వణుకుతూ ఉన్న నక్కలకు కంబళ్లు పంపించారట! నక్కల బాధ సహించుకోలేని అయన కరుణార్ద్ర హృదయాన్ని నేటికీ బైరాగులు దేశ దేశాలా కీర్తిస్తారే!

మన సామాన్య సంసారులలో కూడా నక్తుప్రస్థులు ఉన్నారే! భారతంలో చదవ లేదూ అతని గాథ? మానెడు పేలపిండితో సంసారం నిలబెట్టుకోవలసిన శ్రమజీవి కలకాలపు ఆకలితో వచ్చిన అతిథికి ఉన్న దంతా ఇచ్చివేస్తాడు కదూ!

కాని ఈ దయాసేవ మాత్రం ఎంత కష్ట మైంది! సేవ చేస్తున్నా నని గర్వపడే వాడికంటె దుస్సహమైన వాడు ఇంకొకడు

లేడు. బాగా ఫలించేటట్టు వాడు సేవ చెయ్యనూ లేడు. అన్ని రకాల అహంకారాల కంటే ధర్మసంబధ మైనదీ, నీతి సంబంధ మైనదీ, సేవా సంబంధ మైనదీ మరీ చెడ్డవి.

దేశంలో వర్షాలు లేవు. భయంకర క్షామం వచ్చింది. శ్రావస్తి పట్టణం పొలిమేరలో బుద్ధ భగవానుడు ఆసీను డయినాడు. శరదాకాశంలాగ శాంత నిర్మల మైన ఆయన నేత్రాలు చెమ్మగిల్లి ఉన్నాయి. దేశంలో ఉన్న గొప్పవాళ్ళ నందరినీ రావించాడు.

ధనిక సమ్రాట్టును ఒకణ్ణి పిలిచి, "ఈ క్షామం ఎలా పోగొడతావు?" అన్నాడు భగవానుడు. "ప్రభూ! నా ధనం అంతా నీ చరణ ధూళి దగ్గర - ఇదిగో! అర్పిస్తున్నాను - కొన్ని లక్షల మందిని కొన్ని రోజులు పోషిస్తుంది" అన్నాడు ధనికుడు. "పో!" అన్నాడు బుద్ధదేవుడు.

భూస్వామిని పిలిచాడు. అదే ప్రశ్న, అదే ప్రత్యుత్తరం. పొమ్మన్నాడు బుద్ధదేవుడు. సేనాధిపతిని పిలిచాడు. అదే ప్రశ్న, అంతకంటె విచిత్రమైన ప్రత్యుత్తరము. పొమ్మన్నాడు బుద్ధదేవుడు.

జనం నిశ్చలంగా ఉన్నది. బుద్ధదేవుని చూపులు, చిరునవ్వు ఇంకా ఆహ్వానిస్తూనే ఉన్నాయి.

భిక్షుక బాలిక సుప్రియ నిలబడింది. ముందుకు వచ్చి బుద్ధదేవుని చరణాల దగ్గిర సాష్టాంగపడింది, లేచింది. "స్వామీ, తమ పాదాలు ఆశ్రయించిన దాన్ని. దేశంలో క్షామం నేను నివారిస్తాను. వీరందరిదీ ఎవరి కలిమి వారిది, 'నాది' అని అంటారు కూడా. నాకు ఆస్తి లేదు. కనుక అందరి కలిమీ నాదే. నా బతుకు అక్షయపాత్ర; చిరిగిపోయిన జోలె. లోకం అంతా అక్షయపాత్రే గదా!" అన్నది.

బుద్ధదేవుని హృదయం కరిగింది. రెండు కొలుకుల్లో రెండు నీరు బిందువులు కదిలి రెండు కపోలాల మీదికీ దూకాయి. అంతలో ఆకాశం మీదికి శ్రావణ మేఘం ఒకటి వచ్చింది. అమృత వర్షం కురిసింది. దేశంలో క్షామం పోయింది.

దీని నీతులు : నిజానికి కలిమి అందరిదీని. 'నాది' అంటే సేవ చెయ్యలేడు. మానవ ప్రయత్నం మాత్రం మానకు! పోగొట్టు నీ దేశంలో దారిద్ర్యాన్ని! పౌరుష ప్రయత్నమే పరమేశ్వర భిక్ష!

ఏ మంటావు దీనికి? ఎన్ని కడుపులు నింపా లనా?

"అవని అంతా పెద్ద అక్షయపాత్ర!"

రేడియో ద్వారా ప్రసారితం : 15-10-1938

# మా ఊళ్లో రావిచెట్టు

మా ఊళ్లో రావిచెట్టుంది; ఊరి మధ్యన, పెద్ద ఖాళీ స్థలంలో. మా ఊళ్లో ఏమిటి, చాలా ఊళ్లల్లో ఉంది. అయితే, మా రావిచెట్టునే నే నెరుగుదును; ఆ ఎరిగుండడ మైనా చిన్నప్పుడు.

రావికీ, జువ్వికీ తేడా తెలిసేది కాదు నాకు ఆ రోజుల్లో. ఒక దాని ఆకుకు చివర కాడలా ఉంటుందిట; అదీ తేడా. జువ్వికి కల జువ్వి ఉన్నట్టే, రావికి గంగరావి ఉంది. అయితే రావి వేరు, గంగ రావి వేరు. మా వైపున గంగరావులు, రోడ్డుపక్కల్నే, కాలవగట్లనే కనబడతాయి; పచ్చటి గిన్నెల్లాంటి పూవులూ అవీనీ! గంగ రావి ఎత్తుగా పెరగదు. గంగరావికి రావి కున్న గౌరవం లేదు.

ఊళ్లోనే రావిచెట్టు ఉండాలి. ఊరి బయటనే మర్రిచెట్టు ఉండాలి. పెద్ద స్తంభాల్లా ఊడలు దిగజారి, మండపంలాగా తయారయ్యే మర్రిచెట్టు ఊళ్లో బాగుండదు. మర్రిచెట్టులో చీకట్లెక్కువ కూడా! పగలు పశుల కాపరులూ, బాటసారులూ విశ్రాంతి తీసుకుందుకు అనువుగా ఉంటుం దది. కాని గ్రామం మధ్యన మాత్రం రావిచెట్టే ఉండాలి.

చెప్పాను గదూ - మా ఊళ్లో రావిచెట్టు ఊరిమధ్యనే ఉంది. దాని మాను చుట్టూ పెద్ద మట్టి అరుగు ఉండేది. దాని మీద ఎప్పుడూ ఎవళ్లో ఒకళ్లు కూర్చునో, పడుకునో ఉండేవారు. కాని రావిచెట్టు మాత్రం ఎప్పుడూ నిద్దరపోయేది కాదు. ఎంచేతా అంటారు! ఒక నిముషమైనా కన్ను మూయనిది రావిచె ట్టొక్కటే. రావిచెట్టు ఆకులు, దాని కనురెప్పల్లా ఉంటాయి. ఆకూ ఆకూ మధ్యభాగం కనుగుడ్డులాగో, చూపులాగో ఉంటుంది. రావిచెట్టు ఆకులు ఎప్పుడూ కదులుతూ ఉంటాయి ; ఒక్క చిటి కయినా ఆగ కుండా. అందుకే గాబోలు, దాన్ని 'చలపత్రం' అన్నారు. ఏనుగు చెవీ, లక్ష్మీదేవి చూపూ, మెరుపూ, రావి ఆకూ - వీటికి నిలకడ లే దన్నారు. అంచేతనే గాబోలు, నాకు అదెప్పుడూ నిద్ర పోనట్టు అనిపించడం.

నా చిన్నతనంలో మా ఊళ్లో రావిచెట్టు ఎంత పెద్దదిగా కని పించేదీ! పుస్తకాల్లో కొన్ని చెట్లను వర్ణిస్తారే, అలాగ. అర్ధ యోజనందాకా అలుముకు పోయిన శాఖలూ, లోపల గూళ్లు కట్టుకుని కాక ఘూకాదులూ, అన్నీ వర్ణిస్తారే కవులు, అలా గుండేది. ఈ మధ్య చూస్తే 'హుష్! ఇదేనా రావిచెట్టు' అనిపించింది. అంత ఎత్తూ లేదు; అన్ని కొమ్మలూ, ఆకులూ లేవు. ముసలి దయిం దేమో! రావిచెట్టు ఆయుర్దాయం ఎంతో?

ఇంకో చిత్రం చెప్తా. ఆ రోజుల్లో మా రావిచెట్టు మీద బేతాళుడూ, బ్రహ్మరాక్షసులూ, వాళ్లూ ఉండేవారు. దెయ్యా లుండేవి. అసలు ఆ రావిచెట్టుకు ఎదురుగా ఉన్న సాలి మాదన్నా, అతడి పెళ్లాం, కొంప లంటుకున్నప్పుడు చచ్చిపోయారట, కాలి పోయి. వాళ్లే దెయ్యాలై ఆ చెట్టులో ఉండే వా రట. అర్ధరాత్రుళ్లు దిగేవా రట. చీకటి పడితే చాలు, అటువైపు వెళ్లే వాళ్లం గాము. పగళ్లయినా, అటువైపు నుంచి బళ్లోకి వెడుతున్నప్పుడు మరీ మరీ

పైకి చూస్తూ నడిచేవాళ్లం - మాదన్నా, అతని పెళ్లాం బుజాలమీద దూకుతా రని. దెయ్యాల మాట అలా ఉంచండి. పగలు చీకట్లన్నీ చాలావరకు ఎక్కడ దాక్కుంటా యంటారు ? చెట్ల కొమ్మల్లోనూ, ఆకుల గుంపుల్లోనూ. రాత్రి పడే టప్పటికి, జుట్లు విరబోసుకుని కిందికి దూకుతా యట! ఒట్టు! మేము నిజంగా అలా చెప్పుకునే వారం. ఇప్పు డెవ్వరూ నమ్మరు, మే మిలా అంటే. ఏం జెయ్యం ?

ఇప్పుడు పిల్లాళ్లే పెద్దాళ్లయిపోయి పుట్టేశారు. పోనీ లెండి. నాకు మాత్రం చెట్లల్లోనూ, పుట్టల్లోనూ, ఆకాశంలోనూ, అన్ని దిక్కులా గుప్తంగా అందకుండా ఉన్న రహస్యాలు – మిస్టరీస్ అన్నీ బయట పడడం, స్పష్టమై పోవడం బాగుండదు. రావిచెట్టుమీద దెయ్యా లుండి తీరాలి. వీ లుంటే దాని మీదనుంచి అప్పు డప్పుడు దేవతాస్త్రీలు గూడా దిగి రావాలి. ఓ నాడు ఆ రోజుల్లోనే 'అర్ధరాత్రి ఆ చెట్టుకింద కనపడే వాళ్లు మాదన్నా, భార్యా కారు; ఎవరో ఇద్దరు ప్రియులు పక్క నున్న మొండిగోడ దాటి కలుసుకునే వారు' అని చెప్పేశారు ఎవరో. అందరూ నవ్వు కున్నారు గూడా ; నిజం తెలిసిపోయిం దని. మేము పిల్లల మందరం మాత్రం చిన్నబుచ్చుకున్నాం.

అయితే, ఆ రావిచెట్టు కిందే మా ఊళ్లో వేడుక లన్నీ. మూడు వైపులా పెద్ద ఖాళీస్థల ముండేది గదు మరీ! కోడి పందేలు అక్కడే జరిగేవి; గ్రామదేవత నూకాలమ్మ తీర్థం అక్కడే జరిగేది. ఆ తీర్థానికే వచ్చేవి రంగుల రాట్నమున్నూ, కాశీ పటమున్నూ. అప్పుడే కత్తిసామూ, బాణాకర్ర తిప్పడం, చేడీ కాపు కుర్రాళ్లు చూపించేవారు ; మా కోసమున్నూ, పడుచుల కోసమున్నూ. చెట్టు కిందే రెండు మూడు దుకాణాలు లేచేవి. అద్దాలూ, దువ్వెనలూ, డక్కీలూ, డమ డమ బళ్లూ, బూరాలూ, చక్కగా నిగనిగలాడే రంగులతో రామకృష్ణుల పటాలూ - వీటితో. గొల్ల సుద్దులూ రావి

చెట్టు కిందే; పురాణ కాలక్షేపమూ రావిచెట్టు కిందే; ఎప్పుడైనా తోలుబొమ్మలాటా రావిచెట్టు కిందే.

తోలుబొమ్మలా టంటే జ్ఞాపక మొచ్చింది. ఓ మాటు ఏ ఊరు నుంచో హఠాత్తుగా వచ్చి, తెల్లారే సరికి ఆ చెట్టుకింద కనపడ్డారు పిట్టలూ వాళ్లూ, ఆటగాళ్లు. వాళ్లు నెమ్మదిగా తెరగట్టడం, మిగిలిన ఏర్పాట్లన్నీ చేయడం, రాత్రి పడడం - అందాకా మా గుండెలు ఉండబట్టలేక విలవిలలాడి పోయేవి. మొదటిరోజు విరాటపర్వం ఆడారు. ఇప్పటికీ నాకు నాటకం కంటే తోలుబొమ్మలాటే ఇష్టం - భారత రామాయణాది కథలు చెప్పడంలో. ఈ నాటి నాటకాల్లో, రంగస్థలం మీద ధర్మరాజులాగో, భీముడిలాగో, కీచకుడిలాగో ఎరిగి ఉన్న మనుషులు కనపడడమూ, ముందు హార్మోనియంలాంటి వాద్యాలూ, ఎలక్ట్రిదీపాలూ, ఇటూ అటూ చుట్టూ సదస్యుల్లో మనలాంటి జనం - నన్నేం జెయ్యండీ, చంపండీ - ఎదురుగా కౌరవపాండవుల భేటీ జరుగుతున్నట్టు అనిపించదు. ఆ రోజుల్లోనో! తోలుబొమ్మలాటలో తెరమీది భీముడు ఇప్పటి మనిషి కాడు. వానిలో ఏదో భీముని తనం ఉండేది. అలాగే కీచకుడూ, ధర్మరాజూ, విరాటుడూ. వాళ్ల గొంతుకలు తెరవెనుక నుంచి, ఎక్కణ్ణుంచో ఖంయిమని వచ్చేవి - చీకట్లోంచి పొడుచుకుంటూ. చిత్ర మేమి టంటే, దీని కంతకీ రావిచెట్టు కూడా తో డయ్యేది. ఎలాగా? ఒకటీ: కౌరవపాండవుల చూపుల్లాగా ఆకుల్లోంచి కనబడే నక్షత్రాల ద్వారా. రెండూ: కౌరవపాండవ సేనల కలకలంలాగా, కలకాలంనుంచి చూస్తూ వింటూ వస్తున్న ప్రేక్షకుల సందడిలాగా హమేషా ఆకులతో గలగల మంటూ. రావిచె ట్టెప్పుడూ గలగల మనేదే కాదు- సమయాన్ని బట్టీ, కథ పట్టును బట్టీ రావి సవ్వడి మారేది. ద్రౌపది కష్టాలకి ఉసు రుసు రని నిట్టూర్చడం, వలలుడి చేష్టలకి గలగల మని నవ్వడం, అలాగ. పురాణం చెబు తున్నప్పుడు, ఇలాగే చేసేది రావిచెట్టు. నే నెప్పుడో చెప్పానుగా-

'రామశాస్త్రి భారతం పురాణం చెబుతూంటే రావిచెట్టు ఊఁకొట్టు, రంగయ్య గురుపెట్టు' అని మా ఊళ్లో కొంటె కవి ఎవడో రాశా డని!

ఆ రోజుల్లో మాకు రావిచెట్టు భారత రామాయణ కాలాలకి మొదటి మెట్టు. ఇక్కడో మాట. ఇలాంటి పెద్ద విషయాలూ, పురాణగాథలూ, ఇవే కావు మా రావిచెట్టుకి కావలసినవీనీ, అది అలకించేవీనీ. మా గ్రామంలో గూడా దానికి తెలియని సంగతే లేదు; దాని చెవి బడని గుట్టే లేదు. ఇంట్లో రట్టు హమేషా తట్టుకో లేక, కాస్త ఇవతల పడా లని ఎవడి కైనా ఉంటే, రావిచెట్టు కిందికి చేరేవాడు. బయట పెట్టగూడని ఎవరి గుట్టయినా తమకు తెలిసి, దాన్ని తా మొక్కరూ మోయలేక, దానికి చిలవలూ పలవలూ తొడిగి, మరొకరి చెవిలో వేయడానికి గూడా అక్కడ తయారయేవారు కొందరు. చేలగట్ల తాలూకువీ, మందడి గోడల తాలూకువీ, గొడ్డూ గోదాకు సంబంధించినవీ, తగాదాలు గూడా, మునసబు కరణాల పరిష్కారానికి ముందూ, తరువాతా గూడా ఇక్కడ చర్చింపబడేవి. సందెవేళ 'కాపు కొమరులవీ', 'శాలిపాలి కలవీ' క ళ్లిక్కడ మళ్లీ ఎదురై, ఒళ్లు జల్లు మనేలాగా ఏవేవో చెప్పు కునేవి. ఊరిబయటి బావినుండి నీరు చేదుకుని వస్తూ, కాళ్ల అందెల బరువూ, తలపై కుండల బరువూ ఎక్కువై, రవ్వంత అలసట తీర్చుకుందుకు ఆ చెట్టు కింద ఆగి, అమ్మలక్కలు తమ తమ సంసారాలవీ, ఇతరుల సంసారాలవీ, ఊసు లక్కడే ఆడుకునే వారు. పిల్లలు దాని నీడలోనే గోళీలూ, గోటీబిళ్లలూ, చెడుగుడులూ ఆడుతూ, నడుమ నడుమ దానిమీద చిలక్కీ, కామయ్య మేష్టరు పిలక్కీ వియ్యంగట్టి పాటపాడేవారు. దాని మాను కింద అరుగు నానుకుని, తిండిలేని ముసలమ్మ అక్కడే చిరిగిన గుడ్డ నేలమీద ముందు పరుచుకుని కూర్చునేది. ఎక్కణ్ణుంచి వచ్చాడో, ఏ ఊరు పోతున్నాడో, దానికింద అరుగుమీద - చిన్న మూటా, వాడూ -

ఒక బైరాగి సాక్షాత్కరించి, చిలుముగొట్టం పీలుస్తూ, దానిద్వారా తాను పొందిన వెలుగును తన చుట్టూ చేరిన శిష్యులకు 'బాబా' అని ఆప్యాయంగా పిలుస్తూ అందించేవాడు. ఇవన్నీ, ఇలాటి వెన్నో రావిచెట్టు వినేదీ, కనిపెట్టేదీ. నిజానికి, అంత ఎత్తుగా ఉండడంవల్ల. అక్కడ ఉండి గూడా గ్రామంలో జరిగే వన్నీ పసిగట్టేది. దానికి ఎరుక ఎక్కువ; రావిచెట్టు బోధి వృక్షం. దానికి దయ గూడా ఎక్కువ; ఎన్ని తరాల నుంచో ఏమీ పైకి పొక్క నియ్యకుండా మా గ్రామాన్ని అలాగే కాపాడుకుంటూ వస్తున్నది.

అన్నట్టు, నా కొకటి వింతగా తోస్తుంది. ఏమి టంటే, ఎప్పుడూ రావిచెట్టు ఆకులు గలగల మంటూ రొద చేస్తూనే ఉంటాయిగదా - ఆ రొద ప్రశాంత మైన గ్రామ వాతావరణాన్ని కలచి వేయకుండా మరింత నిశ్శబ్దంతో ఎలా నింపుతుందీ అని! అదేమిటో గానీ, మా ఊళ్లో వినబడే ప్రతి ధ్వనీ - ఆవు అంభారవమూ, రాట్నపు రొదా, పొలికేకా - ఒక్కొక్క పాట. అన్నీ గూడా చల్లని నిశ్శబ్దాన్నే మరింత చల్లగా జేస్తాయి. రావి ఆకుల రొద గూడా అంతే. నగరంలో ప్రతి ధ్వనీ నరాలను కదిలిస్తుందీ, తెంపుతుందీ. పల్లెలో ప్రతిధ్వనీ మనస్సును నిమురుతుంది.

రావి పుల్లల్నే అగ్ని హెూత్రాల్లో సమిధలుగా ఉపయోగిస్తారట! రావి ఆకులను పశువులకు మేతగా వేస్తే, అవి ఎంతో పుష్టిగా ఉంటా యట. రావిచెట్టుకు 'కుంజ రాశనం' అని పేరు. దాని ఆకులు ఏనుగులకు ఎంతో ప్రియ మైన భోజన మట. రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణం చేస్తే సంతానం కలుగుతుం దట. రావిచెట్టు కింద కూర్చుని సిద్ధార్థుడు బుద్ధు డయ్యా డట. అందుకే దాని కంత ఎరుక!

దాని కన్నీ తెలుసు. చెట్లల్లో 'అశ్వత్థాన్ని నేను' అన్నాడు భగవంతుడు గీతలో. అంత గొప్పది రావిచెట్టు. మా ఊళ్లోదీ, ప్రతి ఊళ్లోదీ అంతే. అయినా దానికి బడాయి లేదు.

48

# మన ఆటలు

"ఇవేం రోజులు లెండి, చదువులూ సంధ్యలూ చట్టుబండ లయాయి గదా! ఆచారాలూ అలాగే అడు గంటేయి. పోనీ, బుద్ధిలేక మనిషి ఇలా మారిపోతున్నా డేమో అనుకుంటే - కాలాలూ, ఋతువులూ కూడా ఇలా కలగాపులగం అవాలా? ఈ రోజుల్లో చూస్తున్నారు - పువ్వులు బిక్క చచ్చి, విధి లేక పూస్తున్నాయి; పండ్లు మొండి కెత్తి ఏవో పండుతున్నాయి. అసలు బల మైన రుచులే పోయా యంటాను. ఎలా మారిపోతూందో జాతి! వెనుకటి పండుగలూ పబ్బాలూ, ఆటలూ పాటలూ ఏవీ కనబడవు. పల్లెల దగ్గరనుంచీ పరదేశీవిలా ఉన్నాయి" అంటూ అక్కడక్కడ కొందరు గొణగడం ఉంది.

ఇలా బాధపడే వారు సాధారణంగా ఏభై ఏళ్లు దాటిన వాళ్లు - 19 వ శతాబ్దిలో పుట్టిన వాళ్లు. అయితే, పాపం, వీళ్లమాటలలో కొంత సబబూ ఉంది. నిజమే. కాలమూ మారుతుంది; దేశమూ మారుతుంది; అన్నీ మారతాయి. ఈ రోజుల్లోలాగ ఎన్నో అన్య ప్రభావాలు వచ్చి పడ్డప్పుడు మరీ మారతాయి. అయితే, ఇలాగ తుండూ తుపాకీతో కూడా ఊడ్చిపెట్టుకు పోవడం బాగుందా అంటే, ఏమీ బాగా లే దని బుద్ధిమంతు లెవరు అనరు?

కొద్ది రోజులలో సంక్రాంతి వస్తుంది; భోగి మంటలతో, భోగి పళ్లతో, ముగ్గులతో, గొబ్బిళ్లతో, రక రకాల ఆట పాటలతో రావాలి నిజానికి. ఇప్పు డల్లా రావడం లేదు. పండుగలూ నీరసంగా కనపడుతున్నాయి. పెళ్లిళ్లూ తెల్లబోతున్నాయి.

ఆ వినోదాలు లేవు; ఆటలు లేవు. జీవితంలో రంగూ రుచీ పోయాయా, లేక, బరువులూ సమస్యలూ ఎక్కు వయాయా? అయితే మరేవో ఆటలూ, వినోదాలూ సాగుతూనే ఉన్నాయే అంటే, జాతీయ మైన వన్నీ పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఆట పాటలూ అల్లాగే!

"మన ఆటలు" అనగానే ఎన్ని రకాలుగానో మనస్సు పోయింది. ఒకటి: మన తెలుగునాటిలో ఏ యే కాలాలలో ఏ యే ఆట లాడే వారు అన్నది. రెండు: ఆడపిల్ల లాడేవి, మగపిల్ల లాడేవి. మూడు: ఇంట ఆడేవి, బయట ఆడేవి. నాలుగు: ఏ యే సమయాలలో ఏ యే ఆటలు ఆడుతారు చెప్మా అన్నది.

వీటిలో ఏ నాటినుంచో నేటివరకూ వస్తున్న ఆటలూ కొన్ని ఉన్నాయి. పిల్లల గుజ్జనగూళ్లూ, ఓమనగుంటలూ, బొంగరాలూ వంటివి; స్త్రీల గచ్చకాయలూ, సొగటాలూ వంటివీ; పురుషుల ఉప్పనపట్టె లాట – అంటే ఉప్పట్టి, గిల్లిదండ – అంటే గోటీ బిళ్ల, చెడుగుడు వంటివీ; సామంతుల చతురంగమూ, పాచికలాటా వంటివీ పాల్కురికి సోమన్న, నాచన సోమన్న మొద లైన కవుల నాటినుంచీ మన దేశంలో ఉన్నట్టు మనకి తెలుస్తుంది. పాల్కురికి సోమన్న రోజుల్లో, అంటే దాదాపు వెయ్యేళ్ల క్రితమే రంగుల రాట్నం ఉండి తీరాలి. ".... రాటనముల వాలి ఆడించు నా వడ్రంగి అతడు" అని బసవ పురాణంలో ఉంది.

కోలాటము, గొండ్లి, పేరణి అనే రక రకాల నృత్యాలకు సంబంధించిన ఆటలు స్త్రీలలో ఉండేవి.

మరి రెండాటలు సిసలైన తెలుగు ఆట లైపోయి, ఇప్పటికీ మిగిలిపోయినవి - ఉప్పట్టీ, గిల్లిదండా. "ఉప్పనపట్టె లాడు నెడ ఉప్పును తెత్తురుగాక యాదవుల్" అంటాడు నాచన సోముడు. గిల్లిదండ అంటే గోటీబిళ్ల. దీనిని పూర్వం 'ఘుటికా ఖేలనం' అనే వారు. ఒక చిన్నపుల్లతో, పెద్దకఱ్ఱతో ఆడతారు. మహాభారతంలో ఉంది కౌరవ బాలురు చిన్నకఱ్ఱతో బంతిని కొట్టి ఆడినట్లు. పల్నాటి బాలచంద్రుడూ ఇవే ఆడేడు: "చిరుతలు తీరైన గొడెలతో."

ఇక నాచన సోమన రోజులలో దాదాపు ఎనిమిది వందల ఏళ్ల క్రితం నెత్తము, అంటే పాచికలాట వంటిది ఉండి తీరాలి. కృష్ణుడు రుక్మిణితో ఈ ఆట ఆడే డట. సత్యభామ సాక్షి, అంటే రిఫరీ.

"అ త్రీవంచ, తిగ, దుగయు,
సత్తా, దచ్చొక, వంచి, చౌవం, చీరై
దిత్తిగ, యిద్దుగ, బద్రలు
చిత్తంబున దలచినట్లు చేతికి దెచ్చున్."

ఈ ఆటకు పలకా, బలపమూ కూడా ఉండా లని సోమనాథుడు వర్ణించాడు.

అప్పుడు చిన్న పిల్లలతో బాలచంద్రు డే యే ఆట లాడే వాడో తెలుసునా?

"గుమ్మడికాయలు కొంతసే పాడి
చెరకుల పందెమ్ము చెల్వొప్ప గెలిచి ....
పోక లాటల చేత పుచ్చు ముప్పొద్దు
ఆడుడి ముత్యాల నమరు బంతులును

గుంతమాపల వాడికొని గెల్చుకొనుము ....
రూకల కుప్పలు రూఢిగ వాడు...."

వీటిలో 'గుంతమాపల' ఆట అంటే ఇప్పటి ఓమనగుంట లాంటిది. బాలచంద్రుడు బొంగరాల ఆట కూడా ఆడేడు. ఆ రోజుల్లో పల్నాటి యువకులకు ముఖ్యంగా వినోదం కలిగించే ఆటలు పిగిలి పిట్టల ఆటలు ; కోడి పందేలు.

ఇంతవరకూ చెప్పిన ఆట లన్నీ పదకొండవ శతాబ్దినుండి పదు నాల్గవ శతాబ్దివరకూ తెలుగు వారికి ఎక్కువ వినోదం కలిగించినట్టు మన పూర్వ కావ్యాలు చదివితే బోధపడుతుంది.

మరి తరువాతి శతాబ్దులలో కొత్త ఆటల పేర్లు వింటున్నాము.

"సరి లేని అంజి సొగటా
లరు దగు జూదంబు నెత్త మచ్చనగండ్లున్
తిర మగు నోమనగుంటలు
సరసత మెయి వాడుచున్న సతులన్ గనియెన్"

వీటిలో అంజి కొత్త ఆట. యువకులు కందుక కేళి ఆడేవారు. ఆ కందుకాలు బహుశా గుడ్డలతో గుండ్రంగా గట్టిగా కట్టినవై ఉంటాయి.

"విమల చంద్రోదయారంభ వేళలందు" పిల్లదీవాటలు అని ఆడే వారని శ్రీనాథుడు అంటాడు. ఇక పల్లెజనులను ఒక రక మైన జూదం 'లక్కిముష్టి- నక్కముష్టి' అనేది ఎక్కువగా ఆకర్షించినట్లు కనబడుతుంది. మరి చతురంగం అప్పటికి అమలులోకి వచ్చింది.

"చతురంగంబున నే నతి
చతురుడ కరి తురగ మంత్రి శకట భట ప్ర

స్థితి పరహస్తము సేయుదు
క్షితి మెచ్చగ రాజు బంటుచే గట్టింతున్"—

అని "సింహాసన ద్వాత్రింశిక"లో ఉంది. ఇప్పటి కప్పుడే పులిజూదం మంచి వినోదం అయింది. ఒక జూదరి ఇలాగ బడాయి కొడతాడు ఒక కావ్యంలో—

"............ కడు మె
చ్చుగ వాడుదు పులుల మూట, జూదంబులలో
మిగులగ నేర్పరి బాగిడి
తిగుటన్ సొగటాల నే నతి ప్రౌఢుండన్"

మరి రాయలకాలంలో ముఖ్యమైన కొన్ని వినోదాలు ఇప్పు డంతరించి పోయినాయి. సిడి – సిడి మ్రాను అనే దొక టుండేది. "అంభోధరము క్రింద నసియాడు ఐరావతియు బోలె సిడి వ్రేలె తెరవ యొర్తు" అంటాడు రామకృష్ణ కవి.

ఇప్పటికి కుస్తీలూ, బాణసంచాలూ, వసంతోత్సవాలకు సంబంధించిన ఆటలూ వచ్చేశాయి. వెన్నెల రాత్రులలో కోలాటాలు స్త్రీజనానికి ఉత్సాహం కలిగించేవి. ఇక రాజ్యాలు జయించే తెలుగు యువకులలో కుస్తీలు, దున్నపోతుల యుద్ధాలు, కత్తిసాములూ, చేడీలూ జోరుగా సాగేవి. వీటి అన్నిటిలో మేటి అయిన రాయల వారు చదరంగంలో కూడా సమ్రాట్టే. ఈ ప్రభువు బొడ్డుచర్ల తిమ్మన్న అనే ఆయనతో చదరంగం ఆడి, కొప్పోలు అనే గ్రామం సర్వాగ్రహారంగా ధారపోసి ఇచ్చాడు.

ఇక అప్పటి బాలికలు బొమ్మల పెళ్లిళ్లూ, గుజ్జన గూళ్లూ, అచ్చన గళ్లూ, పింపిళ్లూ, కుచ్చిళ్లూ, గీరనగింజలూ, ఓమనగుంటలూ, కను మూసిగంత, నలుకంబాలాటలూ అనే ఆట లాడేవా రట. వీటిలో

చాలా ఆటలు ఇప్పటిదాకా ఉన్నాయి. ఇక ధూర్జటి శ్రీ కాళహస్తి మాహాత్మ్యంలో తిన్నడు దాదాపు పాతిక ముప్ఫై ఏండ్లక్రితం కూడా తెలుగు బాలు రాడిన ఆట లన్నీ ఆడినట్టు కనపడతాడు. గుడు గుడు గుంచాలూ, దాగుడుముచ్చ లాటలూ, గచ్చకాయలూ, వెన్నెల కుప్పలూ, తన్నుబిళ్లా, చెడుగుడులూ, ఉప్పన పట్టెలూ, ఇవన్నీ చెంచు కొమరులతో తిన్న డాడాడు.

నారాయణామాత్యుడు అనే కవి తన 'హంసవింశతి'లో నాటి తెలుగునాటి ఆటలు ఒక పెద్ద సీసమాలికలో వర్ణిస్తూ వస్తాడు. వాటిలో ఈ శతాబ్ది ప్రారంభానికే ఎన్ని పోయాయో, ఎన్ని ఉన్నాయో! పాతికేళ్ల క్రితానికి మరికొన్ని పోయి ఉంటాయి. ఇప్పుడు ఉప్పట్టైనా, చెడుగుడైనా తెలుగువా ళ్లాడుతున్నారా?

నా చిన్నతనంలోనే – దాదాపు నలభై ఏళ్ల వెనుక అనుకోండి - మా గ్రామంలో ఊరి బయట మందబయలులో యోధుల్లాంటి యువకులు రెండు కక్షలై తాచుపాములాగ పాకుకుపోయే బద్దీకి ఇటూ అటూ నిలబడి, ఒక పట్టాన తెగని కూత కూస్తూ, ఒకసారి తారాజువ్వలాగ ప్రతికక్షుల్లోకి దూసుకుపోతూ, ఇంతలో మెరపు లాగ బద్దీ దగ్గరకి వస్తూ, అంతలో చిచింద్రీలాగ ఎక్కడికో మళ్లి, ఎవని వీపు మీదో చరుస్తూ, శత్రువులు ఒకపాటివా రైతే కుమ్మి, ఇవతలికి వస్తూ, తన సాటివా రైతే కిందామీదా పడుతూ, మేటివారూ, పోటరులూ అయితే లొంగిపోతూ, ఆడిన చెడుగుడు కిన్నీ, పల్నాటి పోరాటానికిన్నీ పట్టుదలలో కాని, పరాక్రమంలో గాని భేదాలు మా కేమీ కనిపించేవి కావు. మరి పుచ్చపువ్వు ల్లాంటి వెన్నెల కాసే రాత్రిళ్లు కూడా ఈ ఆట ఆడేవాళ్లు.

ఇక ఉప్పట్టి అసలు తెలుగువారి ఆట. చెప్పేనుగా సోమన్న హరివంశంలో ఈ ఆట ఆడించే డని! ఈ ఆటలో మెదడూ,

ఒడలూ కూడా ఎక్కువ చురుకుగా పని చెయ్యాలి. మరి తోటలలో పడి కోతికొమ్మచ్చులూ, రచ్చసావడుల ముందు గోటీబిళ్లలూ, సందు గొందులలో గోళీకాయలూ, కుండబంతులూను! అయితే అస లైన మొగ ఆట చెడుగుడు.

ఇక బాలికల ఆట లున్నాయి - వీటిలో ఆడపిల్లల వంటి మగ పిల్లలుకూడా దూరుతుంటారు - గుజ్జనగూళ్లూ, గొల్లస్తంభాలూ, వెన్నెల పువ్వొత్తులూ, దూదుంపుల్లలూ, పచ్చాకులూ, పిచ్చికగూళ్లూ. వీటి అన్నిటిలోకీ సొగ సైన ఆట - అందమూ, ఆనందమూ చిందేది - "బుజ బుజ రేకుల పిల్లుందా?" అనేది. దాగుడు ముచ్చీలలో ఎంత అన్యాయ మైనా చేయవచ్చు. ఈ ఆట కెప్పుడూ ఒక అమాయికు డవసరం — అదే పనిగా దొంగ అవడానికి.

కాస్త కలవారి ఇళ్లల్లో ప్రత్యేకం స్త్రీ లాడేవి గచ్చకాయలూ, సొగటాలున్నూ. వీటిలో ఒక్కొక్కప్పుడు కొత్త అల్లుళ్ళున్నూ, చిన్న తమ్ముళ్లున్నూ చేరుతుంటారు; ఓడిపోతుంటారు కూడా.

పురుషులలో చదరంగం- ఇది మేధావుల ఆట. ఈ ఆట అంటే మతిపోయే వాళ్లకి తప్ప మిగిలినవాళ్లకి వినోదమేనా అనిపిస్తుంది. అయితే ఈ ఆటలో మహా పట్టుదల లొస్తాయి. మా గ్రామంలో ఇద్దరు పెద్దమనుష్యులను ఎరుగుదును. రోజూ జుట్టు ముళ్లూ, కట్టు పంచెలూ సడలేవరకూ పోట్లాడి, మర్నాడు మళ్లీ కలిసి చదరంగం బల్లముందు కూర్చునేవారు. ఈ నాడు ఇంట్లో ఆడే ఆటల్లో పేకాట ప్రభువు. పల్లెటూళ్లల్లో, పట్టణాల్లో ప్రళయంగా రేగిపోతూ ఉంది.

ఇప్పుడు ఎందరో ఎరగనిదీ, పాతిక సంవత్సరాల క్రితందాకా బ్రతికి ఉన్నదీ, సంస్థానపు టూళ్లల్లోనూ, సామంతులలోనూ సామాన్యమైనదీ, ఉల్లాసం కలిగిస్తూ హుందాగా ఉండేదీ, వినోద

మాత్రమే అయినా కించిత్తయినా పుణ్యం సంపాదించి పెట్టేదీ ''దశావ తారీ'' అనే ఆట ఆడేవారం. పది అవతారాలూ పది రంగులు. అందంగా, రక రకాల రంగులలో, గుండ్రంగా ముక్కలు నూట ఇరవై. ముగ్గురు ఆడవచ్చు; నలుగు రాడవచ్చు. మధ్య సొగ సైన ఏలూరి తివాసీ పరచి ఉండాలి. నాలుగు వైపులా నలుగురూ కూర్చుంటారు. కోరమీసాలూ, మెరిసే చూపులూ, తాంబూలపు పెదవులూ, పాందానులూ, వీ లుంటే వెనకాల దిండ్లూ! ఈ ఆటలో జ్ఞాపక శక్తి ఎక్కువగా ఉండాలి. నూట ఇరవై ముక్క లాయెను! ఏ మాత్రం మరచిపోయినా ఓటమి తప్పదు. కనుక ఒడుపుగా ఉండాలి. దశావతారీలో పేకాటలో ఉండే దురుసు లేదు. ఆ రోజుల్లాగే నిదానంగా నడిచే ఆట. ఈ ఆటలో రూపాయి చప్పు ళ్లకు వీలు లేదు. పరశురామం, బలరామం, బుద్ధం అంటూ భగ వంతుడి పేర్లే వినబడుతూంటాయి. సాధారణంగా విజయనగరం, పిఠాపురం వంటి సంస్థాన పట్టణాలలో ఎక్కువగా ఆడేవారు. ఉద్యోగులూ, కలవాళ్లూ, సామంతులూ, సంస్కారులూ ఆడేవారు. నా చిన్నతనంలో కూడా దశావతారీ దస్త్రం మా ఇంట ఉన్నది పాత దైతే, పర్లాకిమిడి నుంచి తెప్పించుకున్నాం. కొండపల్లి బొమ్మలు తయారు చేసేవాళ్లు ఎంత కళానిపుణులో, దశావతారీ తయారు చేసేవాళ్లూ అంతే. ఇప్పుడు వా ళ్లేమయ్యారో! దశావతారీ ఏ మయిందో! అయితే ఏవో కొత్త ఆట లొచ్చాయి. అవీ దేశీ సరుకు లవుతా యేమో!

పేకాటకు దశావతారీ అన్న. గోటీబిళ్ల ముదిరి క్రికె ట్టయిం దేమో! అలాగే కుండ బంతికి బేస్ బాల్. ఇలాగే మిగిలిన వన్నీను!

—రేడియో ప్రసంగం : 1952 డిసెంబరు

# ఆటల పాటలు

పాట మానవుడికి మహా సహజంగా వస్తుంది. పాట లేనిది బ్రతుకు లేదు. బ్రతుకుదారి పొడుగునా అక్కడ ఒక చెట్టులాగా, ఇక్కడ ఒక ఏరులాగా పాట తగుల్తూనే ఉంటుంది. పాట పైనుంచి తెచ్చిపెట్టుకున్నది కాదు, లోపల్నుంచి ఉబికి ఉబికి, ఉరలి ఉరలి వచ్చేది. బతుకులో పాటకోసం మనం ఎదురు చూడం. అనుకోకుండా వచ్చే అతిథి వంటిది పాట! ఊత, ఊపు, ఊరట, ఉల్లాసము, ఉత్సాహము - ఎన్నో అవుతుంది మానవుని బతుకులో ఈ పాట. మొట్టమొదటి మానవులెవ్వరో (ఆదామ్ - ఈవ్‌లో, అదితి - కశ్యపులో)! ఎవ్వరో పాటతోటే ఈ లోకయాత్ర ప్రారంభించి ఉంటారు.

దేశదేశాల్లో రకరకాల జాతుల మానవులున్నారు. వాళ్లల్లో స్త్రీ పురుషులున్నారు. వాళ్లల్లో పాపలూ పిన్నలూ, పెద్దలూ ముదుసళ్లూ ఉన్నారు. వాళ్లకు పండుగలొచ్చాయి, పబ్బాలొచ్చాయి. కష్టాలొచ్చాయి, సుఖాలొచ్చాయి. భయాలు, సంతోషాలు, రోగాలు, మృత్యువులు, కరువులు, కాటకాలు, పెళ్లిళ్లు, వియోగాలు - అన్ని అనుభవాలూ వచ్చి ఉంటాయి. ప్రత్యనుభవం పాట అయింది.

మరి మానవ హృదయం ఎక్కడి దైనా, ఎప్పటి దైనా వస్తుతః ఒక్కటే! తల్లీ పిల్లలూ, ప్రేయసీ ప్రియులూ, పేదవాళ్లూ, యుద్ధ వీరులూ - ఎప్పటి కప్పుడు పాడుకుంటూ తమ కార్య కలాపాల్లో పడిపోతూ వచ్చారు. ఈ పాటల్లో ఎంత జీవం ఉందంటే, అవి నోటానోటా పడి అంచీలమీద ప్రయాణంచేస్తూ వస్తూనే ఉన్నాయి గాని ఆరిపోవడం లేదు, ఇంకిపోవడం లేదు. మధ్య మధ్య ఎప్పటి కప్పుడు కొత్త కొత్తవి పుట్టుకుంటూ వస్తున్నాయి.

మన తెలుగు ప్రజలవీ అట్లాంటి పాట లున్నాయి. వాటిలో తల్లీ పిల్లల పాటలు ఒక రకం. మళ్లీ వాటిలో జోలపాటలు ఒక రకం. ఇప్పుడు పిల్లల ఆటల పాటలను గూర్చి నాలుగు మాటలు:

ఈ ఆటల పాటలు మళ్లీ రక రకాలు ఉన్నాయి. తల్లులు పిల్లల ఆటల్ని గూర్చి పాడేవి; మగపిల్లలు పాడేవి, ఆడపిల్లలు పాడేవి; చిన్నపిల్లలు పాడేవి, కొంచెం పెరిగిన పిల్లలు పాడేవి!

వీటిలో తల్లులు పాడేవి మహ చల్లగా, తీయగా ఉంటాయి. మొట్టమొదటి పాట —

విద్దెం విద్దెం వరహాల విద్దెం
విద్దెం చేస్తే గిద్దెడు నెయ్యి
తప్పక చేస్తే తవ్వెడు నెయ్యి
మళ్లీ చేస్తే మానెడు నెయ్యి

ఈ పాటలో బిడ్డ వట్టి చంటిపాప. పాకే పాపకు నిలబడ్డం నేర్పు తుంది తల్లి. మెరుస్తున్న కళ్లతో, చిరునవ్వుతో, చాపిన చేతులలో బిడ్డతో తల్లీ, బోసినోరు విప్పి కిలకిల నవ్వుతూ చిగురుమేనుతో బిడ్డా ఈ పాటలో సాక్షాత్కరిస్తారు.

తల్లి చల్ల చేసుకుంటూంది. పిల్ల కూడా చేస్తానంటుంది. ఒక చిన్నస్తంభాన్ని చుట్టి ఒక చిన్నతాడూ, కింద ఒక లక్కపిడతా — పాట బహుశా తల్లే పాడుతుంది:

చల్ల చెయ్యి గొల్లభామ
సందిటి దండలు కదిలేను
వెన్న చెయ్యి అమ్మాయి
వెండి మురుగులు కదిలేను
పాలు తాగు అబ్బాయి
పమిడి మురుగులు కదిలేను.

ఇంతలో చల్లచేసే బిడ్డ ఇసుకలోకి నడిచి వెళ్లి అక్కడ ఆడు కుంటుంది.

ఇసకలో ఆడేటి కుసుమ సిరిబాల
ఆ బాలపే రేమి ఆనవా లేమి
ఆనవాలు అంబరస పేరు బాలయ్య

అని పాపను గర్వంగా తల్లి హెచ్చరిస్తుంది. పాప మరి కాస్త పెరుగుతాడు. పక్క పక్కనే ఆడే పాప ముంగిటిదాకా నడుస్తాడు. అక్కడినుంచి పందిరిదాకానూ, వాకిటిదాకాను. తల్లి ఎలా సంతోషిస్తుందో చూడండి. ఆమెకు మందిరం, మనుగడా మధూదయంలో మామిడితోటలా కనిపిస్తాయి.

ముత్తెముల బాలయ్య ముంగి టాడంగ
ముంత మామి డనుచు ముసిరె చిలకాలు
పగడముల బాలయ్య పంది టాడంగ
పండు మామి డనుచు భ్రమసె చిలకాలు
వజ్రముల బాలయ్య వాకి టాడంగ
వట్టి మామి డనుచు వచ్చె చిలకాలు.

పాప పెరిగి అబ్బాయి అయేడు. ఇంటి పక్కన తోటలో తంగేటి చెట్టుకింద ఆడుకుందుకు వెడతాడు. చెట్టుకు కట్టిన ఉయ్యాలలో ఊగేందుకు వెడతాడు. తల్లి మనస్సు కొంచెం తల్లడిల్లుతుంది. కాని తన పనులకు అడ్డురాకుండా తానే అబ్బాయిని పంపిం దేమో. అయినా, భయపడుతుంది; అయినా, నెమ్మది తెచ్చుకుంటుంది.

తంగేటి చెట్టుకే తూగు టుయ్యాల
ఉయ్యాల పట్టుక ఊగె బాలయ్య
తంగేటి చెట్టుకింద వంగి ఆడవచ్చె
హంసల్లు కోయిల్లు అవి లక్షవేలు
చిలకల్లు పావురాల్ శివ! లక్షవేలు
శ్రీరాము డుండంగ మన కేటి భయమె
హనుమంతు డుండంగ మన కేటి భయమె?

పక్కవీథిలో ఉన్న పుట్టింటికి తల్లి అబ్బాయిని పంపిస్తుంది. తన తండ్రితో - అంటే - తాతతో తన కొడుకు ఆడుకుంటాట్ట. తాతకి మనమడిమీద వల్లమాలిన ఇష్టం. తాతా మనమలు కలిసి ఎలా ఆడుకుంటారో భావించుకుంటుంది. ఈ దృశ్యం అబ్బాయి సాటి పిల్లలతో ఆడుతున్నప్పటి దృశ్యంకన్నా తల్లికి ఎక్కువ ఆనందం ఇస్తుంది. వాళ్లతో ఆడనే వద్దు, తాతతోనే ఆడుకో అంటుంది. అప్పుడు సాటి పిల్లలు చిన్నబోతా రట. ఏమి వెర్రి గర్వం తల్లికి!

తాతగారి ఇంట్లో తా వాడబోయె
తాతతో తా వాడు తండ్రి అబ్బాయి
శ్రీమద్దికాయల్లు శ్రీలలాటాలు
చిలుకల్లు ఏ మనెను చిన్నబోయేను
హంసల్లు ఏ మనెను హడలిపోయేను
హంసలతొ వనమందు ఆడనే వద్దు!

శ్రీమద్దికాయలూ, శ్రీలలాటాలూ ఆటలు కాబోలు! ఇట్లాంటివి తల్లులు పాడే పాటలు ఎన్నో ఉన్నాయి.

ఇక్కడినుంచి పిల్లలు ఇంకా పెరుగుతారు. అదివరకు తల్లి నీడలోనే ఆడతారు. అదివరకు పడకుండా భయపడకుండా తల్లి కొంగు వాళ్లకు పెద్ద ప్రాపు. తల్లి చూపుమేర దాటరు. ఇప్పుడో అమ్మ అక్కర లేకుండా ఈడు జోడు సావాసాలు వచ్చి పడ్డాయి. తన అవసరం లేకుండా, అబ్బాయి స్వతంత్రుడై కొత్త ఆటగాళ్లతో పోయినప్పుడు తల్లి మొదట అసూయపడుతుందో, బాధపడుతుందో! పాపం, కవి ఏం వ్రాస్తాడో తెలుసునా?

కొండవాగులు చేతులవంటి తరంగా లెత్తుతూ, చిరునవ్వుల వంటి నురుగులు మెరిపిస్తూ, నవ్వులవంటి గలగలతో ముందుకు పోతూ ఉంటాయి. వెనక్కి ఒక్కసారైనా తిరిగి చూడవు. కొండ గంభీరంగా నిశ్చలంగా అక్కడే ఉండి, వాగులోకి అవసర మైనప్పుడు అమృతం పంపిస్తూ అలాగే చూస్తూ నిలబడిపోయి ఉంటుం దట. కొండ తల్లో, తండ్రో! వాగులు బిడ్డలు.

ఇంటి ముందు వాకిట్లో అమ్మాయీ, అబ్బాయీ ఇరుగు పొరుగు బిడలతో ఆడుకుంటున్నారు - తలా తలా తగులుతూ ఉంటే కొంచెం ముందుకి వంగి గుంపుగా నిలబడి ఒకరి గోళ్లు ఒకరికి చూపించుకుంటూ.

చిప్పిగోళ్లు చిప్పిగోళ్లు సీపాయి గోళ్లు
మా తాత గోళ్లు మందాప రాళ్లు

అని ఒకరి నొకరు ఎకసక్కా లాడుకుంటున్నారు. ఇంతలో అబ్బాయి పైకి చూస్తాడు. ఆకాశంమీద తెల్లకొంగల బారు తెంచి పారవేసిన మల్లె పువ్వుల దండలా కనిపిస్తుంది. చటాలున చేతులు పై కెత్తి,

అంతకన్న పైకి సన్నని లేతగొంతు ఎత్తి - "కొంగా కొంగా నా పాత గోళ్లు పుచ్చుకుని నీ కొత్త గోళ్లు ఇయ్యి" అంటాడు. అప్పుడు అందరూ కలిసి కొంగల్ని అడుగుతారు. అడిగి, మళ్లీ గుంపులో కూడి, తలలు వంచుకొని, వేలి గోళ్లు చూసుకుంటారు. ఎఱ్ఱని గోళ్ల మీద తెల్లని చిరు చంద్ర వంకల్ని చూసుకొని కొంగ ఇచ్చిన వరానికి పొంగిపోతారు.

తరువాత అబ్బాయిలూ, అమ్మాయిలూ విడిపోతారు. రంగు రంగుల చిన్నపరికిణీలూ, లేక పావడాలూ, పైన చిట్టి రవికెలూ, లేక జుబ్బాలూ, నగం చెక్కిళ్లమీద పాకుకు పోయిన కాటుక మచ్చలూ, ఊగే జూకాలూ, తూగే జడకుచ్చులూ, పాటలకు సరిపోయే గంతులూ, గంతులకు సరిపోయే గజ్జలవీ, గాజులవీ రవళులూ- ఆడపిల్లలు చెమ్మచెక్క లాడుకుంటారు - వెనక్కీ ముందుకీ ఎగురుతూ, ఒకరి చేతులమీద మరొకరి చేతులు తప్పెటలలాగ తాకిస్తూ:

చెమ్మచెక్క చారెడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ ఆరగించంగ
ముత్యాల చెమ్మచెక్క ముగ్గు లెట్టంగ
రత్నాల చెమ్మచెక్క రంగు లెయ్యంగ
పగడాల చెమ్మచెక్క పంది రెయ్యంగ

ఇక్కడ ఆడపిల్లలు ఇలాగ ఆడుతుంటే, అక్కడ అబ్బాయిల ఆటలు దాగుడుమూతలు, గోళీకాయలూ, గోటీబిళ్లలూను. వీటికి పాటలు లేవు. ఇవి పాట లక్కర లేనంత పెంకి ఆటలు కాబోలు!

మళ్లీ ఇక్కడ అమ్మాయిలు జంటలు జంటలుగా విడిపోతారు. ఒకరి కొకరు ఎదురుగా నిలబడతారు. కుడి చేత్తో కుడి చేతినీ, ఎడమచేత్తో ఎడమ చేతినీ పట్టుకుంటారు. ఒప్పులకుప్ప తిరుగుతారు. మొదట మెల్లగా, తరువాత దురుసుగా, మరి కొంత దురుసుగా,

మరీ వడిగా, వడివడిగా చేతులు బిగియబట్టుకొన్న బలంవల్ల వెనుకకు వెన్నులు విల్లుల్లాగ విరివి వలయంగా గిరగిరా రెండు ఇంద్ర ధనుస్సులు పెనవేసుకున్నట్లు అయిపోయి, తిరుగుతూ—

ఒప్పుల కుప్ప ఒయ్యారి భామ
సన్నబియ్యం ఛాయ పప్పు !

అంటూ పాడతారు. అప్పుడు వాకిలి వాకి లంతా హోరుగాలిలో ఊగిపోయే పూల లతలతోడి వనంలాగ ఉంటుంది.

ఎండవేళల పిల్లలు ఎగరకూడదు, గెంత కూడదు. అమ్మ ఒప్పుకోదు. వాకిలి దాటి వీథుల్లోకీ, వాడల్లోకీ పోకూడదు. అప్పుడు అమ్మాయీ, అబ్బాయీ కలిసి బొమ్మరిల్లు కట్టుకుంటారు. అమ్మాయి బొమ్మరిల్లు పీటలతోనూ, చెక్కలతోనూ కడతా నంటుంది. అబ్బాయి మన్నుతోనూ, పుల్లలతోనూ కడతా నంటాడు. ఏదో ఒక ఇల్లు కడతారు. ఒక్కొక్కప్పుడు ఆ యింటిమీద ఒక చిన్న కొమ్మను ఓరగా నిలబెట్టి ఆ యింటిని చెట్టుకింద యింటిని చేస్తారు. ఆ యింట్లో కొన్ని బొమ్మలు పెడతారు: చందనపు బొమ్మలూ, తాటాకు బొమ్మలూ! ఆడబొమ్మకు చీరా, రవికా, బొట్టూ, కాటికా, నగలూ నాణాలూ పెడతారు. మగబొమ్మకు పంచే, కండువా, మీస మూను. పెద్దబొమ్మలు అమ్మా - నాన్నా, చిన్నబొమ్మలు అన్నా - చెల్లీ. ఒక్కొక్కప్పుడు ఈ అమాయికపు సంసారంలోకి బావా, మామా, అత్తా, తాతా కూడా వస్తారు. ఈ బొమ్మరింటి చుట్టూ కూర్చుని తాము దిన దినమూ వింటూ ఉన్న కష్టసుఖాలు ఆ బొమ్మల సంసారానికి అంటగట్టి, హాయిగా తెలుగు బిడ్డలు ఎలా పాడుకుంటారో చూడండి:

చిట్టీ చిట్టీ ముత్యాలు
చెట్టూ కిందా పోసి
పుట్టా మన్నూ తెచ్చి

బొమ్మరిల్లూ కట్టి
బొమ్మరింట్లో బిడ్డను కంటే
బిడ్డ తలకీ నూనె లేదూ
మామ తలకీ మడ్డె లేదూ
నీ తలకీ నూనె లేదూ
నా తలకీ నెయ్యి లేదూ
అల్ల వారింటికీ చల్ల కెడితే
అల్ల వారి కుక్క భొయ్యి మంటే
కాళ్ళ గజ్జెలు నావి ఘల్లు మంటే

అని పాడుతూ తుది చరణం వచ్చేటప్పటికి ఘల్లు మని గంతు లెయ్యాలి. ఇంతలో చిన్న అబ్బాయి వంకర టింకరగా చేసిన తాటాకు బొమ్మను చేతిలో ఆడిస్తూ, చెల్లెల్నో, అక్కనో ఎకసక్కాలాడుతూ పాడుతూ వస్తాడు. ఏ మని ?

ఆడతారీ బొమ్మ పాడతారీ బొమ్మ !
వక్కేరు చెట్టు కింద బొక్కేరు బొమ్మ !
తోలు ముక్క ఉన్న తైతక్క బొమ్మ
బొమ్మా బొమ్మా బొమ్మా బొమ్మా !

అప్పుడు అమ్మాయికి కోపం వచ్చి దూరంగా కూర్చుంటుంది. అబ్బాయి ఊరుకుంటాడా ?

ఒంటిపిల్లి రాకా సొక చోట
ఇద్దరు ముగ్గురు ఒకచోట

అని చెప్పుతాడు. అందరూ కిలకిల నవ్వి మళ్లీ కలుసుకుంటారు.

కాని, కొంటె అబ్బాయికి కూడా బుద్ధి వచ్చే ఆటలూ, పాటలూ ఉన్నాయి. మగరాజును గదా అని ఆటలో గోడా, కొమ్మా ఎక్కి

పడితే ఏ మవుతుంది? కాలు విరుగుతుంది. అప్పుడు అమ్మాయి కనుక జాలివేస్తుంది. పాపం, మందు వేస్తుంది.

కొండ మీద వెండి గిన్నె
కొక్కిరాజు కాలు విరిగె
దాని కేం మందు?

వేపాకు చేదు
వెల్లుల్లి గడ్డ
నూనెమ్మ బొట్టు
నూ టొక్క ధార

అని పాడుతూ అన్నకేసి ఓరగా చూస్తూ ఇకిలిస్తుంది.

ఎండవేళ అమ్మా బిడ్డలూ కలిసి ఆడే ఆట కాళ్లగజ్జె లాట. వరసగా పిల్ల లందరూ రెండు కాళ్లూ చాపి కూర్చోడం, పాటలో ఒక్కొక్క చరణం ఒక్కొక్క కాలికి చొప్పున పాడుతూ తుదిచరణం ఏ కాలిమీదికి వస్తే ఆకాలు ముడుచుకోవడం, రెండుకాళ్లూ ముడుచుకున్న వాళ్లు పండిపోవడం, కాలు మిగిలిపోయేవాళ్లు దొంగ కావడం- ఇదీ ఆట. తల్లికి చాలామంది పిల్లలు ఉంటే ఈ ఆట సరదాగా ఉంటుంది. ఒక రిద్దరు బిడ్డ లున్న తల్లే ఆడుతుంటే, అమ్మే అస్తమానం దొంగ అవుతుంది, తప్పదు -

కాళ్లా గజ్జా
కంకాణమ్మా

వేగూ చుక్కా
వెలగా మొగ్గా

మొగ్గా కాదు
మోటుకు నీరు

వీరూ కాదూ
విమ్మల వాయ
వాయా కాదూ
వాయింటి కూర
కూరా కాదూ
గుమ్మడి సెట్టి
సెట్టీ కాదూ
చేమల మట్ట
మట్టా కాదూ
మామిడి పింది
పిందే కాదూ
పేరణ మీాసం
అరటిపం డరటిపం డమ్మన ముద్ద
ఈడూ జోడూ వియ్యపురాలీ
కాలూ దీసీ గట్టున పెట్టూ!

కూర్చుని ఆడే ఆటలలో గుడుగుడుగుంచం ఒకటి. దీనిలో అబ్బాయిదే పైచెయ్యి. కొంచెం మోట ఆట!

గుడుగుడుగుంచం
గుండా రాగం
పాముల పట్నం
పడగా రాగం
గూట్లో రూపాయి
నీ మొగుడు సీపాయి
కత్తెయ్యవా బద్దెయ్యవా?
వేణ్ణీళ్లా చన్నీళ్లా?

కత్తి అంటే నరికి నట్లు కొడతాడు. దెబ్బ అంటే గుద్దుతాడు. వేణ్ణీళ్లంటే తొడపాసెం పెడతాడు, చన్నీ ళ్లంటే చల్లగా గిల్లుతాడు. మోటు వేషం అబ్బాయిది! అన్నింటికన్న అసహ్యం వేసే దేమిటో తెలుసునా? "గూట్లో రూపాయి నీ మొగుడు సీపాయి" అన్న మాటలు ఎంచక్కా చంకలు తాటిస్తూ చెల్లికేసి చూస్తూ అంటాడు. అప్పుడు అమ్మాయికి సిగ్గరి కోపాలు వస్తాయి.

కాని, గచ్చకాయల ఆటల్లో అన్నమీద పగ తీర్చు కుంటుంది. తా నేమో అయిదు గచ్చకాయలూ ఒక్క ఊపులో ఎగరేసి దూసేసి పట్టుకుంటుంది. వాడి చేతిలో రెండు మిగిలి పోతాయి; రెం డెగిరి పోతాయి. ఈ గచ్చకాయల పాట మహ చురుగ్గా పాడుతుంది, అమ్మాయి. పాటలో మాటా, ఆటా, గచ్చకాయల మోతలూ కలిసి పోయిన సందడిలో ఆ మాటలు చాలా వింత రూపాలు పొందుతాయి.

ఒక్కా ఓ చెలియా
రెండూ రోకళ్లూ
మూడూ ముచ్చిలకా
వాలుగు సందవ్వా
అయిదుం జిటిగొలుసూ
ఆరుం దారాలూ
ఏడుం బేడీలూ
ఎనిమిది మనమందా
తొమ్మిది తోకుచ్చూ
పది పట్టెడా!

వడమట గుడి చిలకా
కన్నీ రెండాయా

కాకీ కరకంచూ
పిచ్చిక బీరంచూ
అమ్మకు బొమ్మంచూ
నీకూ కుళ్లగుడ్డా
నాకూ పట్టంచు!

"నీకూ కుళ్లగుడ్డా" అంటే అన్నయ్య కన్నమాట. ఈ ఆటలో అన్నయ్య నున్న, వట్టి గాడిద!

ఇలాగ ఎన్నో ఆటల పాట లున్నాయి - పొద్దుట, మధ్యాహ్నం, సాయంకాలం పాడేవి, పండుగలలో పాడేవి, ఇంట్లో పాడేవి, బైట పాడేవి, పెళ్ళిళ్లలో పాడేవి. పెళ్ళిళ్లలో పిల్లలు చాలామంది చేర తారు. కనుక, పెళ్లి పందిరికింద ఎన్ని రకాల ఆట లయినా ఆడ తారు. పందిరి రాటలలో ఒక్కొక్కటి ఒక్కొక్కరు పట్టుకుని "చల్లో యమ్మ చల్లో!" అని ఆడే గొల్ల స్తంభాల ఆట ముఖ్యమైనది దీనికి పాట లేదు. రాత్రిళ్లు వెన్నెల వత్తి ఆట. దీనికీ పాట లేదు.

ఇక - అట్ల తద్దినాడు ఉదయం అలవి కానన్ని ఆటలు. తెల్లవార గట్ల లేవడం, లేవనివాళ్లు - వీథిలో "అట్ల తద్దోయ్" అనే కేక విని అదిరిపడి కూర్చోవడం, ఉల్లిపాయ పులుసూ అన్నమూ తినడం, వీథిలోకి ఒక గెంతు గెంతడం, గెంతుతూ "అట్ల తద్దోయ్, ఆ రట్లోయ్, ముద్ద పప్పోయ్, మూడట్లోయ్" అని కేక వేయడం, ఆడబిడ్డ అమ్మా యిల గుంపులో చేరడం, మగబిడ్డ అబ్బాయిల కూటంలో దూకడం - ఇంతకన్నా తెనుగునాటి బిడ్డకు ఆనంద మిచ్చే ఆటల వేళ లేదు.

అబ్బాయిల ఆటలూ, పాటలూ వేరు. కొన్ని పాటలలో కొంత ముదురుపాకం, మగతనం, కరుకూ కనబడతాయి. ఈ చరణాలు మారుతూ వస్తాయి - పాడేటప్పుడు గుంపు చేరుకున్న స్థలాన్నిబట్టి. ఒక పాట వినండి:

*(బూడిద గుమ్మడికాయ
బుచ్చెమ్మ తలకాయ
వారదబ్బ కాయ
వారమ్మ తలకాయ)

మరొకటి :

(చింతాకు చీర గట్టి
మావిడాకు డోలు కట్టి
విన్నే పెళ్లాడతాను చిన్నిగుంట - చిన్నిగుంట....)

ఇంతలో ఆడ పిల్లల జట్టు ఒక పెద్ద ఇంటి ముందట చేరుతుంది. ఈ జట్టులో ఒక్కొక్క చిన్న అబ్బాయి కూడా నడుమ నడుమ ఉంటాడు. జట్టంతా రెండు గుంపులు అవుతుంది. ఒక్కొక్క గుంపే పంక్తిలాగ పరుచు కుంటుంది. ఒక పంక్తి ఆడపెళ్లి వారిది, ఒకటి మగపెళ్లివారిది.

మగపెళ్లివారు ఒక అడుగు ముందుకు వేస్తారు. "బుజబుజ రేకుల పిల్లుందా? బుజ్జారేకుల పి ల్లుందా? సామీ దండల పి ల్లుందా? స్వరాజ్య మిచ్చే పిల్లుందా?" అని పాడుతూ అడుగుతారు; అడిగి, వెనక్కి వెడతారు. ఆడపెళ్లివారు అ పదాలతోనే "పిల్లుందీ" అని కలిపి ముందుకు వచ్చి చెప్తారు; చెప్పి, వెనక్కి వెడతారు. అలాగే పిల్లకి ఎన్ని ఏళ్లు అనీ - ఏం కట్నం ఇస్తా రనీ, ఏం లాంఛనాలు తీరుస్తారు అనీ, ఏం నగలూ నాణ్యాలూ పెడతా రనీ పాటలతోనే అడగడం, జవాబు చెప్పడమూను. చివర్ని మగపెళ్లివారు సంతృప్తి పడతారు; పిల్లని తె మ్మంటారు. అప్పు డాడపెళ్లివా రే మంటారు?

---

*వ్రాతప్రతిలో లోపించిందు వల్ల సంపాదకులు చేర్చిన ఈ ఉదాహరణలు కుండలీ కరణాల్లో చేర్చడమైంది.

చింత చెట్టూ కింద చెప్పుల్ని విడిచి
తాటి చెట్టూ కింద దండుగా విడిసి
తాటమ్మ పిల్ల నిస్తా నంటే
దోచుకు పొం డక్కల్లారా !

అంటారు.

మగపెళ్లివారికి కష్టంగా ఉంటాయి ఈ మాటలు –

దోచుకు పోయే టందుకు దొంగ వారమా ?
పారిపోయే టందుకు పగల వారమా ?
పంపరే మా ఇంటికి పెద్ద మరదల్ని !

అంటారు. అప్పుడు అందరూ ప్రసన్ను లవుతారు. పెళ్లి అవుతుంది.

పెళ్లి అయాక ఏముంది ? మళ్లీ అమ్మాయి తెలుగుతల్లి అయి జోలలు పాడుతుంది. అబ్బాయి పెద్దపెద్ద రంగాల్లో పడి పెద్ద కోతికొమ్మచ్చులూ, పెద్ద చెడుగుళ్లూ, పెద్ద ఉప్పట్లూ ఆడతాడు.

—రేడియో ప్రసంగం

# జోల పాటలు

ఈ లోకంలో మొట్టమొదటి తల్లివి ఎవ రమ్మా నువ్వు? అమ్మా! నీ మొట్టమొదటి పాట ఎప్పుడు పాడేవు? ఎక్కడ పాడేవు? పారుటాకుల పాన్పుపై పవ్వళించిన నీ పసికందును చూసి ను వ్వే మనుకున్నా వమ్మా మొదట? ఎక్కడ నుంచి వచ్చిందీ ఈ బిడ్డ అనుకున్నావా? ఎవరి కోసం వచ్చిందీ అనుకున్నావా? "నా కోసమే? నా కోసమేనా?" అని ఆశ్చర్యపడుతున్నావా? క ళ్లెందుకు తెరవదు పాప? ఆ పెదవుల మీద ఆ నవ్వు ఎక్కణ్ణుంచి వచ్చింది పాపకు? నీ వెవరవో తెలుసునేమో నమ్మా పాపకు! అందుకే నవ్వుతుంది - అంతా తెలిసున్నట్లు. అయ్యో! క్యారు క్యారు మంటుం దేం? పాపం, నీ గుండె ఎల్లా కరిగిపోయి ఉంటుందో మొదట? నీలో ఎందు కమ్మా పాల సముద్రం అలా పొంగిపోతుంది? అయ్యో, మళ్లీ క్యారు క్యారు క్యారు మంటుందే! తల్లీ, పాడు! కన్నతల్లీ, పాడ వమ్మా!

ఆయి ఆయి ఆయి ఆపదలు కాయీ!

అని పాడేవా? ఆ పాట ఎలా గొచ్చింది నీకు? మొట్టమొదట ఈ పాట పాడిన తల్లీ! నీవు ఏ సీమలో పాడేవు? ఎప్పుడు పాడేవు? అపరసంజ వేళ, ఏ అడవిలోనో పాడి ఉంటావు.

తోడేళ్లూ, పులులూ, పాములూ, కమ్ముకొస్తున్న చీకటీ - పాపం! "ఆయి ఆయి ఆయి ఆపదలు కాయి" అంటున్నావు. అంతేనా? వెర్రితల్లివి ఎలాగ కాపాడుకొని వచ్చావో ఆ బిడ్డను?

ఎన్ని ఆలోచనలు పరుగు లెత్తుతూ వచ్చేవో నీ మనస్సులో కప్పుడు? ఈ బిడ్డ రెప్పలమీద ఊగే నిద్ర ఎక్కణ్ణుంచి వచ్చిందో! ఆ అడవి గుబురులో, మిణుగురు పురుగు లాడే ఆ కొమ్మల్లో రెండు సిగ్గరి పువ్వుమొగ్గ లున్నా యట. వాటిలో దా గున్న నిద్ర పాపకళ్లలోకి వచ్చింది. పాప పెదవులమీద పరుగు లె త్తే నవ్వో? అదుగో ఆ కొమ్మల్లోంచి ఆ తెల్లమబ్బు కనపడుతోంది- ఆ నెలవంక కనపడడం లేదూ? ఆ మబ్బు అంచులమీద ఆ నెలవంక కిరణం వాలింది. అక్కణ్ణించి పాప పెదవులమీదికి జారిందిలే! అదీ పాప నవ్వు! పాప అస్తమానమూ ఏడుస్తుంది. ఆ మొగ్గల్లో ఉన్న నిద్ర అంతా తెచ్చి, ఆ మబ్బు పెదవులమీద నవ్వంతా తెచ్చి, నీవు దాచి ఉంచుకో వమ్మా నీలో. అంత నవ్వూ, అంత మగతా నీలో ఉండి ఉన్నప్పుడు ఎలాగ నీ గుండె మోయడం! పాడగూడదూ తల్లీ? మళ్లీ మళ్లీ పాడకూడదూ?

"ఆయి ఆయి ఆయీ, ఆపదలు కాయి" అని.

అమ్మా! ఇక తీగతో ఉయ్యాల కట్టు. ఆకుతో పానుపు అమర్చు. గాలితో కలిసి ఊపు. పులుగుతో కలిసి పాడు. అమ్మా, నీవు నాకూ తల్లివే. పాడు, తల్లీ, ఒక్కసారి, "ఆయి ఆయి ఆయి ఆపదలు కాయి" - అని.

అప్పటినుంచీ ఎందరు తల్లులు ఇంతవరకూ పాడేరో! ఎక్క డున్నా, ఎప్పు డున్నా, ప్రతీ తల్లీ నా తల్లే. మాతృమూర్తి ఒక్కతే, బిడ్డా ఒక్కటే! అప్పటినుంచీ కలిమి గల ఇళ్లల్లో తల్లు లున్నారు, నిరుపేద తల్లు లున్నారు. ఒక్కటే ఒక్క బిడ్డను గన్న తల్లు లున్నారు. గంపెడు బిడ్డల గారాల తల్లు లున్నారు. సరికొత్త

తల్లు లున్నారు. కానుపుల్లో గడితేరిన అదితి దేవి వంటి తల్లు లున్నారు. అందరూ కలిసి ఒకే ఒక తల్లి. అందరమూ కలిసి ఒకే ఒక బిడ్డ. అందువల్ల తెలుగునాటి తల్లి కూడా ఎన్ని యుగాలనుంచో రక రకాలుగా రస రసాలతో నిండిన జోలపాటలు పాడింది. వన వాసం చేస్తూన్న సీతాదేవియై ఒకసారీ, కంసుని చెరసాలలో ఉన్న దేవకీ దేవియై ఒకసారీ, యశోదయై ఒకసారీ జోలపాటలు పాడు కుంది. అప్పుడు బిడ్డ రాముడో, కృష్ణుడో, పార్వతో, లక్ష్మో అయి పోతుంది. తాను తన పేదతనమో, తన కలిమో, తన ఒంటరి తనమో, తన బలగమో ఏదో మనస్సులో ఉంచుకుని తన స్థితి గతుల్ని బట్టి పాటలు కట్టుకుని పాడుతూ వస్తుంది.

తల్లులకు తల్లి సీతాదేవి; జనకరాజు కూతురు, భూదేవి ముద్దు బిడ్డ, రామచంద్ర ప్రభువుల ప్రాణేశ్వరి. ఆ తల్లి ప్రవాసంలో వాల్మీకి ఆశ్రమంలో కుశలవుల్ని కన్నది. నా అన్న వా రందరికీ దూరు రాలైన సీతమ్మ కుశలవుల్ని ఉయ్యాలలో పరుండబెట్టి జోలపాట పాడుతుంది:

> నారచీరలతోను ఉయ్యాల వేసి
> జానకీ తనయులకు జోలల్లు పాడి-

పాపం, నారచీరలతోనే ఉయ్యాల వేసింది సీతా మహాదేవి. ఏమని పాడుతుంది?

> ఏడవకు కుశలవుడ రామకుమార!
> ఏడిస్తె ని న్నెవ్వ రెత్తుకుంటారు?
> ఉంగరమ్ములు కొనుచు ఉయ్యాల గొనుచు
> ఊర్మిళా పినతల్లి వచ్చె ఏడవకు!
> పట్టు అంగీ గొనుచు పులిగోరు గొనుచు
> భూదేవి అమ్మమ్మ వచ్చె ఏడవకు!

రావిరేకలు గొనుచు రత్నాలు గొనుచు
లక్ష్మన్న పినతండ్రి వచ్చె నేడవకు!

జోలపాటలలో "ఏడవకు కుశలవుడ రామకుమార! ఏడిస్తె ని న్నెవ్వ రెత్తుకుంటారు?" అనే ఈ పా టంత తీయని పాట లేదు. ఇంతగా గుండెలను పొడిచే పాటా లేదు. ఇంత రసవంత మైనదీ లేదు. సీతమ్మను రామయ్య తండ్రి వాల్మీకి ఆశ్రమానకు పంపించి వేశాడు. ఎంత కఠినుడో! ముందు చెప్ప నైనా చెప్పకుండా నిండు చూలాల్ని పంపించేశాడు నా తండ్రి. వాల్మీకి ఆశ్రమంలో పురుడు వచ్చింది. కుశలవులు పుట్టారు. పాపం, ఏం జేస్తుంది అమ్మ? నార చీరల ఉయ్యాల కట్టింది. ఉయ్యాలలో బిడ్డలు ఏడుస్తారు. అమ్మకూ దుఃఖం వచ్చి ఉంటుంది. "రామ కుమారా! నిన్నెవ్వ రెత్తు కుంటారు, ఏడిస్తే?" అంటుంది. ఎత్తుకోవలసిన రాముడు అక్కడ లేడు కదూ? ఆ ప్రవాస జీవనానకూ, ఆ అడవిలో కాన్పునకూ, ఆ నారచీరల ఉయ్యాలకూ, ఆ బిడ్డలకూ కారణ మైన ఆ రాముని కుమారుడు! ఆ పిలుపులో అంత అర్థ ముంది. "నీ పిన్నతల్లి ఊర్మిళ, నీ అమ్మమ్మ భూదేవి, నీ పినతండ్రి లక్ష్మణుడు కానుకలు తెచ్చారు, ఊరుకో!" అంటుంది. ఎందుకు ఊరుకో అంటుంది? ఎందుకు ఊరుకుంటాడు? అమ్మవారే లోపల కుమిలి కుమిలి దుఃఖిస్తుంది. ఆమెను ఎవరు ఓదారుస్తారు? "అయ్య వచ్చాడు" అనలేదు. అనదు సీతమ్మ. కాని లోపల ఆ తండ్రే రావా లని ఉంటుంది. అద్భుత మైన ఈ పాట ఏ తల్లి మొదట కట్టి పాడిందో? తరువాత తెలుగునాటి దిక్కు మాలిన బిచ్చకత్తె లెందరో, బిచ్చ మెత్తుకుంటూ చేతుల్లో బిడ్డను ఊపుకుంటూ ఈ పాట పాడుతున్నారు. మనకు ఎంత జా లయినా పుడుతుంది.

శ్రీకృష్ణుడికి గోపికలు పాడే జోలపాటలో అలవి కా నంత ఆనం దోత్సవం ఉంది. ఉండ కేం చేస్తుంది? వాళ్ల కేం? కృష్ణుడి కేం?

లా లనుచు పాడ రమ్మా, ఈ బిడ్డ లక్ష్మీవిలాసు డమ్మా
పాదమున చక్ర మమ్మా, ఈ బిడ్డ వేదాంత వేద్యు డమ్మా
వేణు నాదంబుతోను ఈ బిడ్డ వేదములు పాడు నమ్మా

అంటూ, చల్ల తరచిన చప్పుళ్లూ, గాజుల ఉలివూ, ఆవుల అంభా రవమూ - అన్నింటితో శ్రుతి కలిపి తీయని గొంతులు సన్నగా ఎత్తి వ్రేపల్లెలో పాడారు.

ఇలాగే తమ బిడ్డను "శ్రీరామచంద్రమూర్తి" అనుకున్నారు కొందరు తల్లులు.

రామా లాలీ, మేఘశ్యామా లాలీ
తామరస నయన దశరథ తనయా లాలీ!
అద్దాలా తొట్టెలో నీవు ఆడుకొందువూ
ముద్దూ పాప డంచూ నిన్ను మురిసి చూసేరు.

పరమశివుడూ, దిగంబరుడూ అయిన ఆదిభిక్షువే తన ఇంట్లో వెలసి ఉయ్యాలలో ఒదిగి తన ప్రేమ భిక్షకోసం ఏడుస్తున్నా డను కొంటుంది మరొక పిచ్చితల్లి—

లాలి శంకర, సదా లాలిత కుమారా
లాలి పటు తాండవోల్లాస ఘన ధీరా!
లాలి పంచాస్య, కైలాస సంచారా
లాలి మధురాలాప లాలి గంభీరా!

మరొక ఉయ్యాలలో సీతాదేవి వెలసి ఊగుతుంది. అప్పుడు తెలుగు తల్లి సీతమ్మకే తల్లి అవుతుంది.

లాలి బంగరుబొమ్మ లాలి మాయమ్మ
లాలి ముద్దులగుమ్మ లాలి సీతమ్మ!

అని పాడుతుంది

తెలుగుపల్లె, పల్లెలో ఇల్లు, ఇంటిలో చావడి. అక్కడ దూలాన వేలాడే గుడ్డ ఉయ్యాలో, గొలుసులకు కట్టిన తొట్టో! దానిలో బిడ్డ. పక్కన తల్లి. పచ్చి ఒడ లంతా బంగారు పసుపు పూత. కనుబొమ్మల కిందనుంచి కపోలందాకా చిక్కని కాటుక. నుదుటిపై నిండుగా కుంకుమబొట్టు. పలాచని తెలివలువ. నిర్భర ప్రేమతో నిండిన బరువుపాలిండ్లను మోసే రైక. తాంబూలరాగం చాలనట్లు చిరునవ్వుకూడా పొదిగిన ఎర్ర నెర్ర నైన పెదవులూ, మెరిసే చూపులూ. వీటితో తెలుగు బాలెంత తామరతూండ్ల వంటి చేతులను చాపి, కోయిల కూతవంటి గొంతు నెత్తి, బిడ్డమీద అనురాగం దాచుకో లేక, ఆ అనురాగాన్ని ఏమి చేయాలో తెలియక అనుకోకుండా ఎన్ని రకాలుగానో పాడుకుంటూ వస్తుంది.

నిజానకు బిడ్డను జోకొట్టడానికి కాదు ఆ పాట. తన ఆనందమూ, ప్రేమా ఏమి చెయ్యాలో తెలియక తల్లి పాడుతుంది. భర్త దూర దేశాన ఉన్నప్పుడు "నాన్న వస్తున్నాడు ఊరుకో!" అని పాడుతుంది. గర్వంగా పుట్టింటి వారిని తలుచుకొని ఆ బిడ్డను తన తండ్రీ, తన సోదరులూ చూస్తే ఏ మనుకుంటారో అనుకుంటూ, అద్భుతంగా ఎక్కడినుంచో వచ్చిన ఈ వరాన్ని వారు ఎప్పుడు చూస్తారో అని ఉవ్విళ లూరుతూ అత్తింట ఉన్న తన కళ్లు పుట్టింటి దాకా చూస్తూన్న ట్లున్న దూరపు చూపులతో, శాంత మందర స్వరంతో "మీ మామయ్య కాసులు తెచ్చాడు, మీ తాత మురుగులు తెచ్చాడు- ఊరుకో!" అంటూ కూనరాగం తీస్తూ, కూనరాగము ఊపునకు సరిపోయేలాగ ఉయ్యాల ఊపుతుంది.

మునిమాపు సమయంలో పరు గెత్తుకుని వచ్చే చీకట్లలో భవిష్యత్తు అగమ్యంగా ఉండి, చెప్ప రాని దిగులు ఏదో మనస్సులో ప్రవేశిస్తే ఆ దిగులుతోనే లేని ఆపదలను వేటినో శంకిస్తూ, తన చేతుల్నే బిడ్డకు ఉయ్యాల చేసి, లేక తన గుండెనే

తొట్టె చేసి, "నిన్ను రామచంద్రమూర్తి రక్షిస్తాడు. దేవత లందరూ రక్షిస్తారు. ఏడవకు, పడుకో!" — అంటూ గవాక్షంలో నుంచి ఊరి పొలిమేర జీబు చింతతోపు వైపు చూస్తుంది.

కోడికూతతో లేచి, పాపకు నీళ్లు పోసి, కాటుక పెట్టి, బొట్టు పెట్టి ఉయ్యాలలో పరుండ బెట్టే సమయానకు గవాక్షంలోనుంచి పైడి కిరణాలూ, పక్షి కూతా, పారిజాత వాసనా కలిసిపోయి వచ్చేసరికి అణుమకో లేని ఆనందమూ, అలవి కాని ఆశలూ లోపల నిండుకోగా "నాన్నా! నువ్వు రాముడిలాగా గొప్పవాడ వవుతావు. కృష్ణుడిలాగ సుఖపడతావు. అమ్మా! నువ్వు మహలక్ష్మిలాగ కలిగి ఉంటావు - గౌరిలాగ సౌభాగ్యవతి వవుతావు" — అంటూ తన కోరికలనే ఆశీస్సులుగా చేసి హృదయాన్ని ఒక ఉయ్యాల చేసి దానినీ, పాప పన్నున్న ఉయ్యాలనీ సమానంగా ఊపేస్తూ పాడుతుంది.

"ఎక్కడికో వెళ్లిన బాబుతండ్రి ఎంతకూ రారు. చిల్లర వేషాలు ఎక్కువ ఆయనకు. కోడె పనులూ, కొంటె చూపులూ తెలుస్తూనే ఉంటాయి" అనుకుంటూ పడుచుతల్లి బిడ్డవైపు చూస్తుంది. ఆ బిడ్డ కళ్లు మిలమిల లాడుతూ చూస్తుంటాయి దూలం వైపు. ఆ తండ్రి కొడుకు కాడూ?

తుమ్మెద నీ కళ్లు దూలాల మీద
బాలయ్య నీ కళ్లు మగవాళ్లమీద
నిద్ర నీ కన్నులు మబ్బు మొగములు
నిద్రకూ నూరేళ్లు నీకు వెయ్యేళ్లు!
నిన్ను గన్నయ్యకూ నిండ నూరేళ్లు!

అంటుంది. ఇట్లాగ తన కష్ట సుఖాలలో ఎన్నో, ఇతరులతో చెప్పడానికి శంకించేవి, బిడ్డతో నిర్భీతిగా పాటల వంక బెట్టి తల్లి చెప్పేస్తుంటుంది.

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

కొన్ని జోలపాటలు వినిపిస్తా:

*(ఏడవకు ఏడవకు వెర్రి అబ్బాయి
ఏడిస్తె నీకళ్ల నీలాలు కారు
నీలాలు కారితే నే చూడలేను
పాలైన కారవే బంగారు కళ్లు!

జో అచ్యుతానంద జో జో ముకుంద
రార పరమానంద రార గోవింద జో జో
తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించి
నాలుగూ వేదముల గొలుసు లమరించి
బలువైన ఫణిరాజు పాను పమరించి
చిత్తాము అనియేటి దూలములు వేసి జో జో
.... .... ....

అన్నల్ల చెల్లెల్లు అలిగితే ముద్దు
పొన్నల్లు, గురివింద పూచితే ముద్దు
అన్నల్ల చెల్లెలే తాను అమ్మాయి
పొన్నల్లు, గురివింద తాను అబ్బాయి.)

ఈ జోలపాటలు నెమరు వేస్తుంటే నేను ఉయ్యాలలో బిడ్డంత లేత లేత నిసుగు నయి పోతున్నాను. కాని మా అమ్మ ఎక్కడికి వెళ్లిందో? మా అమ్మ లేదు. ఉందీ కూడా నీ యింటా నీ యింటా!

—రేడియో ప్రసంగం

---

*వ్రాతప్రతిలో ఉదాహరణలు లోపించి నందువల్ల కుండలీ కరణాలలోని ఉదాహరణలు చేర్చడ మైంది - సం.

# పండుగ పాటలు

పెద్ద పండు గంటే సంకురాత్రి పండుగే !

సంకురాత్రి పండు గొచ్చిం దమ్మలారా !
సంక లెత్తు కాడం డమ్మలారా!

ఈ పండుగ పుష్యమాసంలో వస్తుంది. అంటే అత్తవారింటి కెళ్లిన ఆడపడుచులు ఈ పండుక్కి జనవరి నెలలో పుట్టింటి కొస్తారు. కొత్త అల్లుళ్లు అత్తారింటికి వెడతారు. ఆడపడుచులూ, అల్లుళ్లూ పిల్లా మేకతో వస్తూంటే ఇల్లూ వాకిలీ ఎంత ఉల్లాసముగా నైనా కళ్లు తెరుచుకుని ఎదురు చూస్తాయి. ముంగిట్లో ముందుగా నెల్లాళ్లనుంచి ముగ్గులు పెడతారు. గోడలకు సున్నపు పూతలూ, గుమ్మాలకు కుంకుమ బొట్లతో పసుపులూ, పచ్చనాకుల తోరణాలూనూ ! మరి పండుగకు వచ్చేవా రెంత గొప్పవారు !

ఏ రంత వెళ్లిన్న ఇసుక సన్నంపు
ఏరు దాటి వచ్చింది ఎవ రాడపడుచు ?
పచ్చని కుచ్చుల పల్లకీ ఎక్కి
బలగంతొ వచ్చింది ఎవ రాడపడుచు ?
తెల్లని కుచ్చుల పల్లకీ ఎక్కి
తేజముతొ వచ్చింది ఎవ రాడపడుచు ?

నల్లని కుచ్చుల పల్లకీ ఎక్కి
నవ్వుతూ వచ్చింది ఎవ రాడపడుచు ?
ఎఱ్ఱని కుచ్చుల పల్లకీ ఎక్కి
ఎగ సెగసి వచ్చింది ఎవ రాడపడుచు ?

వహవ్వా, భళీ! ఎన్నిరకాల ఆడపడుచులు! పిల్లా జెల్లా బలగంతో వచ్చేదీ, పెట్టే బేడా తేజంతో వచ్చేదీ, కులుకుతూ తళుకుతూ నవ్వుతూ వచ్చేదీ, చీరె రంగులూ, పైట అంచులూ ఎగిరి ఎగిరి పడుతూ వచ్చేదీని. ఒక్కొక్కప్పుడు వదినెలు కూడా వస్తారు. వీళ్లు మాత్రం తక్కువ వాళ్లా! బలగంతో పెద్దన్న వదిన, తేజంతో చిట్టెన్న వదిన, నవ్వుతూ చిన్నన్న వదిన, మురుస్తూ బుచ్చన్న వదిన తరలి వస్తారు. అందరూ వచ్చేటప్పటికి ఆమని తోట అయిపోతుంది ఇల్లు.

ఈ లోగానే ఇంట్లో పెళ్లికాని చిన్నపిల్లలు రాబోయే అక్కల్నీ, వదినల్నీ తలుచుకుని ఉవ్విళ్లూరుతూ ఉంటారు. ముంగిట ముగ్గులలో గొబ్బిళ్లు పెడతారు. చాలా పొద్దున్నే. చెదరిపోయీ, సగం నుదిటి మీదికి జారీ నిద్దర మత్తులో లాగా బద్ధకంగా ఉండే ముంగురులూ, సగం బుగ్గలమీదికి పాకుకుపోయిన కాటుకలూ, పొట్టి పరికిణీలూ, చిట్టిరైకలూ వీళ్లూ - ఈ చిన్న తల్లులు గొబ్బి పూజలు చేస్తూ ఏ పాటలు పాడతారో తెలుసునా? వీళ్లు దొంగలు. నిజానికి వీళ్ల కళ్లకేసి చూస్తే వీళ్ల కోరికలూ, వీళ్ల సంగతులూ అన్నీ తెలిసిపోతాయి. వినండి వీళ్ల ధోరణి -

సుబ్బీ గొబ్బెమ్మా సుబ్బ ణ్ణివ్వారే
తామర పువ్వంటీ తమ్ము ణ్ణివ్వారే
చామంతి పువ్వంటీ చెల్లె ల్నివ్వారే !

అని మొదలెడతారు. ఇంతలో అమ్మ లోపలికి వెళ్లడం చూసి గొబ్బెమ్మతో అసలు కోరికలు చెప్పుకోడం ప్రారంభిస్తారు -

మొగలీ పువ్వంటీ మొగు ణ్ణివ్వారే
గుమ్మడి పువ్వంటీ కొడుకూ నివ్వారే!

అంటూ. పక్కనే నిలబడ్డ చిన్న తమ్ముడు "విన్నాలే!" అన్నట్టు కిలకిల నవ్వి, "బంతి పువ్వంటీ బావ నివ్వారే" అని గంతు లేస్తాడు. అమ్మాయి సిగ్గు పడుతుంది. ఈ గొబ్బి పాటలు ఎన్నైనా ఉన్నాయి:

గొబ్బి తట్టుదాము రారె
గోప గోపికలము గూడి
గోపాల కృష్ణు జేరి
గోవుమీద గోకులమూ

వంటి దిన్నీ-

కొలని దోపరికి గొబ్బిళ్లో యదు
కులస్వామికివి గొబ్బిళ్లో

వంటి దిన్నీ -

గొబ్బీయళ్లో!
చిక్కూడు పూసింది ఛిన్నీ కాసిందీ

వంటి దిన్నీ -

గొబ్బియళ్లో సఖియా వినరే
కృష్ణుని చరితము విన్నారే -

వంటి దిన్నీ!

సంక్రాంతి పండుగల్లో పల్లెటూళ్లని చూడాలి. వీథంతా ముగ్గులూ, వీథిలో కొత్తబట్టలూ, పీటిలో పిండివంటలూ, అల్లుళ్ల రుసరుసలూ, ఆడపడుచుల గుసగుసలూ, వాడలో గంగిరెద్దుల మేళాలూ, సాతానుల

కీర్తనలూ, మేళతాళాలూ, కోడిపుంజులవీ గొర్రెపొట్టేళ్లవీ పోట్లాటలూ. చెప్పాను కాదూ - మరే పండుగకీ ఇంత వైభవం లేదు.

అన్నట్టు సంక్రాంతి కాగానే బొమ్మలనోము లొస్తాయి. ఒక్కొక్క ఇంట్లో పది కుటుంబాలవారు కలిసి ఈ నోములు పడతారు. ఈ పది కుటుంబాల ఆడవాళ్లూ కలసి కుమ్మరి ఇంటికి బొమ్మలకోసం వెళ్లడం, బొమ్మలు తెచ్చి ఎవరి బొమ్మలను వారు పూజించడం, తరువాత దీపాన్ని నీళ్లల్లో చూస్తూ ఆ నీళ్ల పైన జల్లుకుంటూ—

చూస్తి, చూస్తి. చూస్తి
దేవీ దేవరా చూస్తి -
దేవీ దేవరా ఏం చేస్తున్నారు?
రత్నాలు ముత్యాలు జూదం ఆడుతున్నారు.
ఎవరు గెలిచారు? ఎవరు ఓడారు?
ఇద్దరూ ఏక సమమే
అందుకు నంది సాక్షి
నాగుమయ్యా సాక్షి!

అంటూ పాడతారు. తరువాత నది దగ్గిరో, చెరువుదగ్గిరో బొమ్మల్ని వాలాడిస్తారు.

సంవత్సరాది పండుగకు ఎందుచేతో ఇంత సందడి లేదు. కొత్త చిగుళ్లూ, కొత్త పువ్వులూ, కోయిల కూతలూ, ఎన్ని ఉన్నా సంవత్సరాదినాడు ఎందుచేతో పాట లేవీ వినం. తరువాత శ్రావణమాసం అంతా ఆడపిల్లలకి పండుగే! శ్రావణమాసంలో ఇంద్రధనుస్సులు నేలమీదికి దిగుతాయి, వీథుల్లో తిరుగుతాయి. అంటే ఏమిటో తెలుసునా? రంగు రంగుల చీరలు కట్టుకుని ఆడపిల్లలు పేరంటానికి వెడతారు. పొద్దున ఎవరిళ్లల్లో వాళ్ల

మంగళవారంనాడూ, శుక్రవారంనాడూ పూజలు చేసుకుంటారు. సాయంకాలం పొరుగిళ్లకు వెడతారు.

అక్కరో! రారమ్మ చెలువలు మీరూ
శుక్రవారపు సేవకూ

వంటి పాటలు ఎక్కువగా లక్ష్మీదేవినీ, గౌరీ దేవినీ కీర్తిస్తాయి; ఐదోతనమూ, ఐశ్వర్యమూ అర్థిస్తాయి.

ఇంతలో భాద్రపద శుద్ధచవితి వస్తుంది. వినాయకుని పండుగ! వినాయకుని పూజచేస్తారు, సాయంకాలం చవితి చంద్రుణ్ణి చూడకుండా గణపతికథ వింటారు. లంబోదరుని భోజనం, ఉండ్రాళ్లు మెక్కడం, ఎలుకవాహనం ఎక్కడం, బొజ్జ పగలడం, ఆదిశేషుని తెచ్చి అమ్మవారు కడుపుకట్టడం, చంద్రుడు ఫక్కు మనడం, కథ వింటూన్న పిల్ల లందరూ ఘొల్లుమని నవ్వడం. ఈ కథ సరదాగా ఉంటుంది. కథ వినట మేమిటి-

ఓరోరి గణపతీ రా, నీ
కుండ్రాళ్లు పెట్టేదరా

అంటూ రాలుగాయి మగపిల్లలు వీథుల్లో పడి, ఉండ్రాళ్లు ఇళ్లమీద విసురుతూ పల్లేరుకాయలు వీథుల్లో పోస్తూ, ఊరూ వాడాచేత చెప్పరాని తిట్లు తింటారు. ఆ రోజున అల్లాగ తిట్లు తినడం మంచి దట! తిన్నవాడికి మరి నీలాపనింద రాదు.

తరువాత భాద్రపద బహుళ తదియ, ఉండ్రాళ్ల తద్ది! తెల్లవారగట్ల పిల్లలు లేచి -

ఉండ్రాళ్ల తద్దోయ్
ఊ రంత పండుగోయ్!

అని కేకలు వేస్తూ ఊరంతా తిరుగుతూ ఆడుకుంటారు.

సంక్రాంతి తరువాత పెద్ద పండుగ దసరా. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని నవమిదాకా. దశమి విజయదశమే! సప్తమినాడు సరస్వతీ పూజ మొదలు. ఈ దసరా రోజుల్లో కూడా పల్లెటూళ్లలోనే చూడాలి! ఈ పండుగ పల్లెటూళ్ల పిల్లలదీ, బడి పంతుళ్లదిన్నీ. పిల్లవాళ్లకి మురిపాలున్నూ, పంతుళ్లకి ముడుపులూనూ. ఒక ఊళ్లో రెండు మూడు బడు లుంటాయి కదా! ఒక్కొక్క బడిలో పిల్ల లందరూ పొద్దున్నే బళ్లో చేరుతారు. మంచి మంచి బట్టలు వేసుకుంటారు. మీరు నవ్వకపోతే మా చిన్నతనంలో ఎలాగ బట్టలు వేసుకునే వాళ్లమో చెపుతాను. పొడుగాటి ఇజారు, పైన నల్ల కోటు, గొప్పవాళ్ల పిల్లలు నిగనిగలాడే ఆల్పాకాకోటు, కంఠంచుట్టూ దగ్గరగా చుట్టిన చిక్కని ఊలు కుచ్చూ, తలమీద జలతారు టోపీ, ఆ టోపీలోంచి తొంగిచూస్తూ గిరజాలో, జునపాలో! కొందరు మగ పిల్లలకి వెనకాలే వేళ్లాడే గరిటెలవంటి జడలు కూడా. కొందరు గొప్ప ఇంటి మగపిల్లల మెడలో కంటె, కాసులపేరూ, చంద్రహారమూను! చేతిలో పచ్చని ఎర్రని రంగులు వేసిన కఱ్ఱ గిలక, అంటే ధనుస్సు; దానిలోనుంచి రెండో మూడో చివర్ని బుట్టలు ఉన్న సన్నటి పుల్లలు- బాణా లన్నమాట. ఈ బుట్టలలో రక రకాల పువ్వులూ. ఈ వేషాలతో, ఈ గిలకలతో పిల్లవాళ్లు బడి ముందు బారులుగా నిలబడతారు. ఆ బారుల ముందు ఒక అయ్యవారూ, వెనకాల ఒక అయ్యవారూ. ఈ ఊరేగింపు కదులుతుంది. ఒక్కొక్క ఇంటికే వెడుతుంది. వీళ్లు వస్తున్నా రని వినగానే ఇంటి యజమాని వీథి అరుగు మీద చాపమీద సిద్ధంగా కూర్చుంటాడు.

విఘ్న సముదాయ విర్విఘ్న సముదాయ
విఘ్నేశ దేవేశ విమల సర్వేశ

విఘ్నమ్ము కాకుండ వేడెదము మేము
విమల మతి మా కిమ్ము విఘ్నరాజేంద్ర
మూషిక వాహనమ్ము ముదముతో నెక్కి
శేషుడు బొజ్జపై చెలగ బుట్టితిమి
ఆరూఢి మ మ్మేలు అయ్య విఘ్నేశ
నారికేళా ఫలము నాన బియ్యములు
గారెల్లు బూరెల్లు కమ్మ టుండ్రాళ్లు
వేడ్కతో నర్పింతు విఘ్న రాజేంద్ర
జయాభిజయీ భవ దిగ్విజయీ భవ!

అని ఒకే ఒక గొంతుక లాగ వినపడే టట్లు పాడుతూ పిల్లలు వస్తారు. ముందు నిలబడ్డ ఇద్దరు పిల్లలు ఒక్కొక్క చరణమే చెబుతూ ఉంటారు. వెనకాల నిలబడ్డవా రంతా చెప్పుకుంటారు. ఆ ఇంటికి రాగానే యజమాని కెదురుగా నిలబడతారు. పాట చరణాలు మారతాయి. అసలు పాట ప్రారంభ మౌతుంది:

ఏ దయా మీ దయా మా మీద లేదూ
ఇంత సే పుంచుటా ఇది మీకు తగదూ
దసరాకు వస్తి మని విసి రిసిరి పడకా
చేతిలో లే దనక అప్పివ్వ రనకా
మావు రా రేపు రా మళ్లి రమ్మనకా
ఇరుగు పొరుగుల కెడితె ఇస్తారు సుమ్మీ
అర్ధ రూపా యయితె అంటేది లేదూ
ముప్పావలా అయితె ముట్టేది లేదూ
అయ్యవారికి చాలు అయిదు వరహాలూ
పిల్లవాళ్లకి చాలు పప్పు బెల్లాలూ

అంటూ పాట పూర్తి చేస్తారు. మన్మథుడి లాగ టక్కుమని విల్లు వెనక్కు వంచి ఆ బాణాల్లోంచి పువ్వులు యజమానిమీద

కొడతారు. ఆయనగారు ఏదో బహుమానం అయ్యవారి కిస్తారు. మళ్లీ ఊరేగింపు కదులుతుంది.

ఇక్కడ రెండు విశేషాలు చెప్పకుండా ఉండలేను. ఒకటి - ఆ పిల్లలకీ, అయ్యవారికీ ఒకరిమీద ఒకరి కుండే ఇష్టం. పంతుల మీద ఎంతైనా భక్తీ, ఇష్టమూనూ పిల్లలకి. పిల్లలమీద ఎంతైనా వాత్సల్యం అయ్యవారికి. పాపం, గురువుగారి ఋణం ఆ పండుగలలో ఆటపాటల సహాయంతో అమాయికంగా తీర్చుకుంటారు పిల్లలు. రెండు - ఆ పిల్లలైనా సాయపడకపోతే ఆ పేద పంతుల గతి ఏమవుతుంది, చెప్పండి? పాపం, జీతపు డబ్బులు ఏ పది రాళ్లో! దోనపాదువంటి సంసారం, గంపెడుపిల్లలతో! కుటుంబాన్ని ఎలా నిలబెట్టడం? తలలు బద్దలు కొడతాడా, లంచాలు పుచ్చుకుంటాడా? చదువులు చెప్పి, ఆ చిన్న మనస్సులు వికసించేటట్లు చేశా డాయెను. గురువు తలిదండ్రులతో సమాన మాయెను.

కనుక పిల్లవాళ్లు గురువుగారి ఋణం తీర్చుకునేందుకూ, పేదవాడైన అయ్యవారికి నాలుగు రూకలు దొరికేటందుకూ ఈ దసరా పండుగలో ఈ ఉత్సవం ఏర్పాటయిం దనిపిస్తుంది. దసరా పదిరోజులూ గురు శిష్యులు పాడుతూ ఊరేగడమూ, గిలకలతో పూలు విసరడమూ, పప్పు బెల్లాలూ - మాడలూ సంపాదించడమూ జరుగుతాయి.

దీని తరవాత వచ్చే పిల్లల పండుగ అట్ల తద్ది. ఆశ్వయుజ బహుళ తదియనాడు. ఇది ఆటల తద్ది కూడా. "త్వరగా నిద్ర పొండర్రా. నాలుగు గంటలకే లేవా లాయెను" అని తల్లి దండ్రులు హెచ్చరిస్తున్నా రాబోయే ఆటపాటల భావనలు తలలో రేగిపోతూ ఉంటే అసలే నిద్రపోరు పిల్లలు విదియనాటి రాత్రి. మూడు

గంటలకే తూలిపడుతూ వెళ్తారు. పళ్లు తోము కోవడం, ఉల్లిపాయ పులుసూ అన్నం తినడం, వీథిలోనికి దూకడమున్నూ!

అట్ల తద్దోయ్ ఆ రట్లోయ్
ముద్ద పప్పోయ్ మూ డట్లోయ్
పీటకింద పిడికిటి బియ్యం
పిల్లల్లారా రా రండోయ్!

అనే పాట - ఆ లేత గొంతులు పాడేది - తెల్లవారగట్ల చిరు గాలుల మీద కంయి మని లేచి గ్రామాన్నంతనీ మేలుకొలుపుతుంది. ఆ సమయంలో కొంతమంది రాలుగాయ కుర్రవాళ్లు పాడే పాట ఒకటి ఉంది. దీనిలో చరణాలు మారుతూ ఉంటాయి - వీథంట పోతూ అక్కడా అక్కడా పిల్లవాళ్లు సమీపించిన ఇంట్లో మనుష్యుల్ని బట్టీ, వాళ్లమీద పిల్లల కున్న ఇష్టా యిష్టాలను బట్టీ:

వేడి అన్నం అప్పడం ముక్క తినో తినో
ఉసిరి కాయ కుండ మొ ..........

అట్ల తద్దినాడు పాడే పాట లెన్నో ఆటల పాటలలో వస్తాయి. ఇక దీపావళి! పిల్లల కింత సరదా అయిన పండుగ లేదు కదా. ఈ ఉత్సవానికి పాటలే లేవు, ఎందు వల్లనో!

దిబ్బూ దిబ్బూ దీపావళీ
మళ్లీ వచ్చే నాగుల చవితీ

అని వత్తులు వెలిగించిన గోగుపుల్లలు వాకిలి మెట్లమీద కొట్టే టప్పుడు అనే రెండు మాటలూ తప్పిస్తే మరి దీపావళి పాటే కనపడదు. 'చీకటి తీగలా కాకర పూలూ' అంటూ పాటే లేదే! కాకరపువ్వు వత్తులూ, ఎర్రని పచ్చని మతాబాలూ - కాలిన వాటి

బొగ్గులు కింద నీళ్లలో పడే వింత చప్పుళ్లూ, చిచ్చుబుడ్లూ, తారా జువ్వలూ - ఆహా! ఈ తారా జువ్వలు వెలుగు పాముల్లాగా ఆకాశపు చీకటి బయళ్లలోకి ఎలాగ జర్రు మని పాకుతాయి! దీపావళి నాటి రాత్రి బాణ సంచాలో పటాష్‌కాయలవంటి పేలుడువి ఇష్టమా? రంగు రంగుల వెలుగులవి ఇష్టమా? రెండూ కూడాను. అవును. బహుశా, ఈ పండుగనాడు బాణసంచాల ఆవేశం, తొందరా పాటలోకి రా నంత ఎక్కు వై పోయా యేమో! దీపావళి తరవాత సంక్రాంతి దాకా మరి చెప్పుకో దగ్గ పండుగ లేదు; మరి పండుగ పాటలూ లేవు.

—రేడియో ప్రసంగం

88

# దీపావళి

నా చిన్నతనంలో దీపావళి!

"మీ చిన్నతనంలో దీపావళి ఎలాగుండేదో జ్ఞాపకం చేసుకొని వ్రాస్తారా?" అని ఒక పత్రికా సంపాదకుడు నన్నడగడం చూడండి - ఒక్కసారి మనస్సులో ఒక్క నీడ ముసురుకొని జరిగినట్టయింది. చిన్నతనం నెమరువేసుకో వలసినంత వార్ధక్యం నాకు వచ్చిందా అని! ఇదివరకు నా కీ సంగతే తోచ లేదు. పని కట్టుకొని ఎప్పుడూ బాల్యంలోకి ప్రయాణం చెయ్యలే దిదివరకు. "మా కృష్ణశాస్త్రి ఎప్పుడూ ఇరవై ఒక్క ఏడు దాటడు" అని మా గురుదేవుడు నాయుడుగారు న న్ననేవారు. ఆయన అనడమే ఆశీర్వచనం అయిపోయేది. కనుక నే నలాగే కొట్టుకుని వచ్చా నింతవరకూను!

2

నా చిన్నతనంలో దీపావళి! జ్ఞాపకం చేసుకుంటాను - ఒక్కొక్క దీపావళే మెట్టుగా వెనక్కి జరగా లన్నమాట! ఇంకా వెనక్కి! నే నెరిగున్న మొదటి దీపావళి ఏది చెప్మా? కొంత దూరం వెనక్కి జరిగాక, దీపావళు లన్నీ ఏకమై పోవడమే గాక, దీపావళీ, సంక్రాంతీ, విజయదశమీ పండుగ లన్నీ కలిసిపోతున్నాయి. వాసనలూ, వన్నెలూ కలిసిపోవడం మరీ వింత! నా కెప్పుడూ వివరాలు

జ్ఞాపకం ఉండవు. వెరసి ముద్రలవంటి కొన్ని స్మృతులు ఉంటాయి — దీపాలూ, దివిటీలూ, పచ్చతోరణాలూ, పట్టు తోరాలూ, మారేడుపత్రాలూ, మందారపు పువ్వులూ, మంత్రాలూ, పట్టుపంచెలూ, ప్రదక్షిణాలూ, హారతులూ, మా నాన్నగారూ — అన్నీ కలిసిపోతే వీటిలోనుంచి దీపావళిని విడదీసుకోవాలి!

## 3

మా నాన్నగారు ప్రతి పండుగనీ ఒక ధోరణిలో దగ్గ రుండి నడిపించే వారు. నా దీపావళి స్మృతు లన్నీ సుఖప్రద మైనవి కావు. నరక చతుర్దశి నాటి తెల్లవారగట్ల తలగడుగు అనలే కాదు. ఎంత మాత్రమూ కాదు. తెల్లవారక ముందు లేవడం నా కెప్పుడూ ఇష్టం లేదు. ఎవ రేమి చెప్పినా అది మంచిది కూడా కా దని నా సిద్ధాంతం.

"తల్లి రేయి; ఆమె చల్లని యొడిపైని
నిదురపొమ్ము; నిదుర నిదుర కొక్క
కల వెలుంగు, పపిడి జలతారు అంచురా!
మేలుకొనకు కలలవేళ తండ్రి!"

అని నా ప్రబోధం. నరకు డా సమయాన చచ్చిపోయాడు కనుక, నరకచతుర్దశి అన్నా రట. తల గడుగువల్ల నాకు నరక బాధ కనుక నరక చతుర్దశి అని నా మతం!

దీపావళి నాడు మాత్రం బాగుండేది!

## 4

ఓ! దీపావళినాడు చాలా బాగుండేది— దీపావళినాడు పగ లెక్కువ పొడుగు— నరకుడి ఉసురులాగే ఊరికే తెగసాగుతుంది

ఆ రోజు. అయినా రక రకాల బాణసంచాలు ఏరడం, ఏరి ఎండ బెట్టడం, ఎండబెట్టుతూ ఒక్కొక్కదానికేసే ఇష్టంగా చూసి పలక రించడం, ఎండబెట్టినవి బుట్టలో పెట్టి లోపలపెట్టడం, బయటికి వెళ్లడం, మళ్లీ వచ్చి బుట్టలో ఉన్న బాణ సంచాల్ని పలకరించడం, మళ్లీ వెళ్లడం, మళ్లీరావడం, పరధ్యానంగా నిలబడి మునిమాపు నాహ్వానించడం— పగలల్లా ఇదీ ధోరణి!

## 5

సాయంకాలం సమీపిస్తూ ఉంటేనే లోకం అంతా మారిపో తుంది — ప్రతీ రాత్రీ వాకిటిలో చీకటి కావలి కాస్తుంది. దీపావళి నాటి రాత్రి హజారంలో వెలుగు పహరా ఇస్తుంది. దీపావళి రాత్రి మహారాజు; కాగడాలతో కాహళులతో కంచు ఢక్కాలతో వస్తుంది. ఆ సాయంకాలం వేలకొద్దీ ప్రమిదలలో నూనె నింపి దీపాలు వెలిగిస్తారు — డాబాగోడ అంచులనుంచి దీపాలు తలలు ఎగరేస్తూ ఉంటాయి. అరుగుమీద దీపాలు అటూ ఇటూ ఆడిపోతాయి. కిటికీలోనుంచి కొన్ని దీపాలు కన్ను గీటుతాయి. కొన్ని రాణివాసపు ఓరచూపులు చూస్తాయి. అంత పండుగ రోజునా కూడా కొన్ని దీపాలు కునుకుతాయి; మాగన్ను పెడతాయి, జోగుతాయి. మరికొంత స్నేహం చూపిస్తూ మగువలు వాటిని మళ్లీ మళ్లీ బుజ్జగిస్తూ మేల్కొలుపుతారు. దీపాలకి కూడా సిగ్గూ, విలాసమూ, బడాయీ, బద్ధకమూ అన్నీ ఉన్నాయి.

## 6

ఇంతలో గోగుకొమ్మలు వస్తాయి; వాటి రెమ్మలకు వత్తులు కట్టి వెలిగిస్తాం కదూ! తాటాకు గుమ్మడి పళ్లూ, ఆ గుమ్మడిపళ్లల్లో ఉమ్మెత్తకాయల డిప్పల ప్రమిదలూ, ఆ ఉమ్మెత్తప్రమిదలలో నేతి దీపాలున్నూ! ఎడమచేతిలో తాటాకు గుమ్మడిపండు పట్టుకుని

కుడిచేతిలో గోగుకొమ్మలు పట్టుకుని - ఆ దీపాల గోగుకొమ్మను ఒక్కసారి నక్షత్రాలకు చూపించినట్లు ఎత్తి దించి –

"దిబ్బూ దిబ్బూ దీపాలమావాస్య
మళ్లీ వచ్చే నాగులచవితి!
ఎప్పుడు తిందుము చిమ్మిలిముద్ద
ఎప్పుడు తిందుము చలిమిడి ముద్ద!"

అంటూ మెట్లముందు కొట్టి పారేసేవాళ్లం. బాలాకాలం దాకా "మళ్లీ వచ్చే నాగులచవితి" అనే రెండో పాదం బాగుండేది కాదు నాకు. యతిలేక పోవడం వల్లనేమో! "దిబ్బూ దిబ్బూ దీపాలమావాస్య మళ్లీ వచ్చేను" అని ఆగి పోయేవాణ్ణి - అయినా ఈ పాదంలో ప్రబోధం, సందేశం, ఆశావాదం ఉన్నాయి - 'నాగుల చవితి వస్తుం దర్రోయ్'! అని. ఇది కేవలమూ కళకోసం వ్రాసిన సాహిత్యం కా దాయెను!

## 7

ఆ రోజుల్లో దీపావళిమీద పద్యం వ్రాయమంటే ఎలాగ వ్రాసే వాడినో! అవి రాజాశ్రయపు రోజులు గదా! "ఓమహారాజా!

తమ యశ మ్మారిపోని మతాబు పోలు;
ఆశయములు జువ్వలుగ మిన్నంటి దిగవు;
బాణసంచుల ఫెళ ఫెళార్భటు లటు తమ
ప్రజల కరతాళములు రేబవళ్ళు మ్రోగు"

అంటూ దంచేసే వాణ్ణే కాదూ!

## 8

బాణసంచాలు వెలిగించే ముందు తీపి వస్తువులు తిని తీరాలి. మా 'రా - అన్నయ్య' తీపివస్తువులు తినడంవద్ద దిగబడిపోయి బాణ

సంబాలదాకా రాలేకపోయేవాడు. అతనికి ఏకాగ్రత కూడా ఎక్కువ. "యాఁవ్రా! కాకరపువ్వొత్తులు వెలగించరేం? వెలిగించారర్రా!" అని లోపలినుంచి అప్పుడూ ఇప్పుడూ హెచ్చరిస్తూ ఉండేవాడు. మరునాటికి కొన్ని మతాబాలూ, జువ్వలూ మిగిలిపోయేవేగాని ఒక్క పాకపు గారె అయినా మిగిలేది కాదు. పండుగ జేగీయమానంగా జరిపించడానికి కూడా పరాక్రమమూ, పట్టుదలా కావాలి. మా 'రా - అన్నయ్య' "ఒకనాడు" ఉన్న ఆంధ్ర వీరులలో వాడు!

9

బాణసంచాలలో నాకు నేస్తాలూ, శత్రువులూ ఉన్నారు - అంటే ఉన్నాయి. చప్పుళ్ళు చేసేవి నాకు ఇష్టం లేదు - పటాష్‌కాయలూ, ఔట్లూ వంటివి. సిసింద్రీ నాకు పరమ శత్రువు. బందరుతూటా కూడా. సిసింద్రీ ధర్మ యుద్ధం చేసే రకం కాదు - నా లెఖ్ఖ ప్రకారం. దీని శీలం సంగ్రహంగా వర్ణిస్తే నైచ్యమూ, అమర్యాదా, మోసమూ ప్రధాన గుణాలుగా చెప్పాలి. నడకా, పరుగూ, ఎగురూ, ముందుకుపోతూ ఇట్టే వెనక్కి తిరగడం, అనుకోకుండా నీ వైపు తిరిగి నీ మీద దూకేటట్టు నిన్నే తీవ్రంగా చూడడం! సిసింద్రీ చెడుగుడు ఆడుతుంది. సిసింద్రీ అంటే నా కిష్టం లే దెప్పుడూ!

మతాబాలూ, కాకరపువ్వు వత్తులూ నాకు ఇష్టం. కాకర పువ్వు వత్తులు కాలుతున్నప్పుడు ఎగిరే పువ్వులు కొంచెం కొంచెం చేతి మీద పడి చిరు చురుక్కు మనడం, మతాబాలు వెలుగుతున్నప్పుడు జారే నిప్పుగోళీలు నీటిలో పడుతూ మనోహరంగా గళుక్కు మనడం, ఎర్రవెలుగూ, పచ్చవెలుగూ, నీలివెలుగూ ఇంటిముందు ఇంద్రధనుస్సులు పొడవడమూ, పోవడమూ, చిచ్చుబుడ్లు వెలుగు పొదలు కట్టడమూ - ఇదీ అసలైన దీపావళి!

ఈ సందడిలో నా మనస్సును రెండు చెదరగొట్టేవి. పక్కనే పేలే బాణసంచాల దౌర్జన్యం. దూరాన చీకట్లోకి ఆకాశంలోకి పాకుకుపోయే అగ్నిసర్పాలు తారాజువ్వలూను. ఓ! తారాజువ్వలు విసిరేవాళ్లు భారతవీరులు! వాళ్లు మా పిఠాపురంలో ఊరిబయట జువ్వలతో, వెలక్కాయలతో ఎలాగ యుద్ధంచేసేవాళ్లో దగ్గరగా ఉండకుండా చూడా లనిపించేది. నా బాల్యం అప్పుడప్పుడు విజయ నగరంలో సాగింది. "అయోధ్య" మైదానంమీద వెలగకాయలతో రామ రావణ యుద్ధాన్ని గూర్చి వినేటప్పుడు ఊపిరి వదిలేవాళ్లం కాము.

నా కిష్టం అయింది ఇం కొకటి ఉంది - పాములమందు. ఎవరే మన్నా సరే, నవ్వినా సరే పాములమందు అద్భుతమైంది – అంత బిరుముక్కలో నుంచి అంత పెనుపాము రావడం! పాములమందు ఆలోచన వంటిది – భావన వంటిది. అందులోనూ అంత నిర్విషమైంది!

ఇంతలో దీపావళి అయిపోవస్తుంది! "నాగులచవితికి నాలుగు మిగల్చండర్రా" అంటారు. ఆ మిగల్చడం నాకు ఇష్టమూ ఉండేది కాదు; తెలియనూ తెలియదు. దిగులుగా లోపలికి పోయేవాళ్లం.

అన్ని పండుగుల్లో దీపావళి నాకు ఇప్పటికీ ఎంతో ఇష్టం-నా పిల్ల లకి ఎందుకో అంత ఉత్సాహం కలిగించ దేం దీపావళి? నా కంటే ముదిరి పుట్టారా? తెలియకుండానే లోకబాధలూ, బరువూ మోస్తూ పుట్టారా? ఇప్పటికీ నే నే మతాబులూ అవీ కొనడమూ, నేనే సగం కాల్చడమూను!

## 10

దీపావళి రోజున నా కున్నంత ఉత్సాహము ఆ రాత్రికి లే దని పిస్తుంది. పాపం! దీపావళి రాత్రివేళ చిమ్మటలతో ఏకాంతవాసం

చేసే మహాకవిని నే నెరుగుదును. నా ఇంటి ముంగిటా, నీ ఇంటి ముంగిటా వన్నె వన్నెల వెలుగుల్లోకి నీడలు పాకుకుంటూ వస్తూంటే మీరు చూశారో లేదో! నిట్టూర్పుల వంటి నీడలు, మూలుగుల వంటి నీడలు - చేతులు ఝాళించి చాపుతూ. ఈ నీడలు ఆ రోజుల్లోనే నా గుండెల్ని మధ్య మధ్య పొడుస్తుండేవి. కాలని వైనా, పొరపాటున జారిన వైనా దొరుకుతాయేమో అని ఏరు కుందుకు చాచే లేత చేతులు ఇప్పుడు తారాజువ్వలలాగ లేస్తున్నాయి; అప్పుడు మూలుగులు లాగ నా లోపలికీ, పైకీ, చీకటిలో ప్రాకేవి. మేము అప్పుడు చిరాకు పడే వాళ్లం; వాళ్ల అక్కర మమ్మల్ని ఎత్తి పొడిచినట్టు ఉండేదో, వాళ్లకు నాలుగు పడెయ్యలేకో చిరాకు పడేవాళ్లం! అసలు నాలుగు పడెయ్యడ మనేదే ఒక ఆపత్కరమైన ధోరణి.

## 11

మరునాడు వీధి వాకిలి చూస్తే దిగులు దిగులుగా ఉండేది. వంట ఇల్లు చూస్తే మా 'రా - అన్నయ్య'కు ఉన్నట్టు. ఆ పేద పిల్లలికి ఏవైనా దొరికాయో లేదో! చీకట్లో దూరా న్నుంచి ఎంత ఆకలితో చూశారు! అలాంటి చూపేనా చెప్మా నా పిల్లల కళ్ళల్లోది ఇప్పుడు? చిత్రం! అన్నం కోసం ఎంత ఆత్రతతో అన్వేషిస్తారో వెలుగు కోసమూ అలాగే వెదకుతారు కాబోలు! ఇప్పుడు దీపావళి పద్యం వ్రాయగలిగితే ఎలాగ వ్రాస్తానో!

రేడియో ప్రసంగం : 1948

## అనుబంధం :

# ఆడపిల్లల పాటలు*

[ఈ పాటలు పూర్వకాలపు ఆడవాళ్ళు తమ చిన్నతనంలో పాడుకునే వాళ్ళ మని చెపుతుంటే వ్రాసుకున్నవి. ఇవి రకరకాలు : ఆటలలోవి ; బావమీదివి ; వదినమీదివి ; దంపుడు పాటలు ; నలుగుడు పాటలు ; పెళ్ళిళ్ళప్పుడు పాడేవి ; ఇలాగ -]

౧

చిట్టి చిట్టి ముత్యాలు
చెట్టు కింద పోశారు,
పుట్టమట్టి తెచ్చారు,
బొమ్మరిల్లు కట్టారు ;

బొమ్మరింట్లో బిడ్డని కంటే -
బిడ్డ తలకి నూనే లేదు,

---

* సంప్రదాయ సాహిత్యం పట్ల ఈ సంపుటంలోని వ్యాసాల్లో కనిపించే శ్రీ శాస్త్రిగారి ఆదరం అలాంటి పాటల సేకరణకు కూడా ఆయనను ప్రేరేపించినట్టు కనిపిస్తూంది. ఆయన స్వదస్తూరిలో వ్రాసిపెట్టుకున్న పాటలు ఇవి.

అత్త తలకి అమదం లేదు,
మామ తలకి మడ్డీ లేదు,
మొగుడి తలకి మొదలే లేదు
తన తలకి తాడే లేదు.

౨

వదినా, వదినా, వేపిళ్ళా?
నీతో ఎవ్వరు చెప్పారు?
నాతో అన్నయ్య చెప్పాడు -
అంతటి భాగ్యం కలిగెనా?
అంచుల చీరల కట్టేనా?

అద్దాల రవికె అన్నయ్య తెచ్చాడు,
వది నెయ్యి కిచ్చాడు;
తలుపు చాటు కెళ్ళింది,
మూ తట్టే తిప్పింది -
తే లట్టే కుట్టింది,
నే నట్టే నవ్వాను!

౩

పెద చెరువు గట్టునా
భేరి వాగింది,
పెళ్లివా రొచ్చారు,
పెద వీథిలోకి -
పసుపుకుంకుమ లన్ని
పళ్లాల బట్టి,
రండి పేరంటాళ్ళు
ఎదురుకుందాము!

పానకపు కావిళ్ళ
బుజాన్ని పెట్టి

రావయ్య బ్రాహ్మడా !
రావయ్య త్వరగ !

పెళ్లమ్మ మా యింట్లో !
పెళ్లి మా యింట్లో !

పేరైన సీతమ్మ
పెళ్లి మా యింట్లో !

పెళ్లి పెళ్లన గానె పెరిగె బుగ్గల్లు !
పెళ్లైన మర్నాడు తీసె బుగ్గల్లు !

౪

చిలకా పిట్టా, చిలకా పిట్టా
చెర్లో ఉన్నాది !

అత్తా తెచ్చిన కొత్తా కోక
కట్టా నన్నాది !

మామా తెచ్చిన మానెడు నూకలు
వండా నన్నాది !

మొగుడూ తెచ్చిన మల్లే మొగ్గలు
ముడవా నన్నాది !

మొగుడి చేత మొట్టికాయలు
తింటా నన్నాది !

౨౭

గచ్చ కాయ
గంట నేల
కుక్క తోక
గూన కడుపు
    పేడిమూతి బావగారికి పెళ్ళిశోభనం!

అక్క! చూడు
బావ నెత్తి
నొక్క వెంట్రు
కైన లేదు!
    ఊరుకోవే చెల్లెలా! బువ్వరోగమూ!

౨౮

పండు గొబ్బిం దమ్మ పర్వతంలాగ,
    యెశోద మా తల్లి యెరగదు కాబోసు!
యెశోద మా తల్లి యెరగదు కాబోసు!
    వీథిలో అన్నల్లు చెప్పరు కాబోసు!
వీథిలో అన్నల్లు చెప్పరు కాబోసు,
    చుప్పనాతి వదినెలకు కిట్టదు కాబోసు!

౨౯

పసుపు పూసి బాలింత
            పంచ గూర్చుంటే,
పం డనీ చిలకల్లు
            పై వాలినాయి!

పండు గా దర్ర యిది
　　　పచ్చి బాలింత !
పొండర్ర చిలకలూ
　　　పారి పొం డర్ర !

౮

గుమ్మిడి పాదు మీద
　　　గువ్వ వాలింది !
గువ్వకీ ఏ రాజో
　　　గూ డల్లినాడు

౯

చేబియ్య పన్నాలు,
　　　చేవ రోకళ్ళు !
చెలువుడా ! చూస్తివో
　　　చేతి పొక్కుల్లు !

గోలకొండ ప్రయాణం,
　　　కొత్త చెప్పుల్లు !
కాంతరో ! చూస్తివే
　　　కాలి పొక్కుల్లు !

౧౦

ఊరు ముంద రున్నాది
　　　ఊదర పువు చింత ;
ఊరమ్మ కోడళ్ళ
　　　ఊరించు చింత !

మా పెరట నున్నాది
మదన పువు చింత!

మా అమ్మ కోడళ్ళ
మరిగించు చింత !

౧౧

పాటలు రా వని ఎరిగిన మొగుడు
పాట పాడ మని బాదేనే - అక్కా, ఓ అక్కా !
కూటికి లే దని ఎరిగిన మొగుడు
కుడుము లొండ మని గుద్దేనే- అక్కా, ఓ అక్కా !
తలుపు లేని నిట్రాట గుడిసెకు
తలుపు వెయ్య మని తన్నేనే - అక్కా, ఓ అక్కా !
అంబ లంటే వొల్ల నంటాడే,
అయి దడ్డల బియ్యపు
కుంభ మంటే తెమ్మ నంటాడే !

౧౨

అల్లు డొచ్చా డొల్లకాడు !
అరిసె లొండా నొల్లకాడు !
ఒడ్డూ పొడుగూ ఒల్లకాడు !
ఒక్క ముక్క ముట్ట డొల్ల కాడు !
ఆ డేం తిన్నా డా డొల్ల కాడు,
నే నేం పెట్టా నా వొల్ల కాడు !

౧౩

చింతకాయ బొంతకాయ
చిగురు మామిడికాయ
కొల్లేటి వంకాయ
కొమ్మ నిమ్మ పండు
ఈరుగురు గుంటలో
బాలుగులు మెయ్యగా
ఒకటే కాయగా
ఒంటి పువు రాలగా
తాటాకు ధప్పళం
కోట వెలుగో –

కోటలో ఉన్న దో
కొమ్ము టేనుగు పిల్ల;
తరిమి తరి మొచ్చింది
తాంబేలు పిల్ల!

103

# ఉదాహృత పద్యాదులకు ఆకరాలు

| పుట | ఉదాహృత పద్యాదులు | కృతి | వివరం |
|---|---|---|---|
| 2 | కవిత జెప్పి ఉభయ .. | ఆంధ్ర భాషా భూషణం | పద్యం 5 |
| ,, | ఈక్షోణిన్ నిను బోలు .. | కాశీఖండం | 1-14 |
| ,, | హితుడవు .. కవితా పితామహుడవు | మనుచరిత్ర | పీఠిక 1-5 |
| 3 | శారద నీ రూపము.. | పాండురంగ మాహాత్మ్యం | 1-27 |
| ,, | ఒకటగా దన్నిటను ప్రయోజకుడవు.. | విజయవిలాసం | పీఠిక-51 |
| ,, | భారతముపై.. | పాణిగృహీత | 1-7 |
| ,, | చేతకాని శతవధాని.. | ,, | 1-8 |
| ,, | స్తుతమతి యైన యాంధ్రకవి.. | చాటుపద్య మణిమంజరి* | పుట 154 |
| 12 | 'ప్రాతపడ్డ మాటలు' | నిర్వచనోత్తర. | 1-6 |
| ,, | 'దుర్విటులు' | ,, | ,, |
| ,, | 'పరిణతి గలుగు కవులు' | ,, | 1-9 |
| ,, | 'అజాగళస్తన సగోత్రులు' | కళాపూర్ణోదయం | అవతా. 7 |
| ,, | సత్కవుల్ కృతుల .. | శ్రీరంగమహత్త్వం | 1-16 |
| ,, | అర్థపుం దెరువాటుల్ దెగి కొట్టి.. | మనుచరిత్ర | పీఠిక-9 |
| ,, | పరార్థ వంచనలచే .. | వసుచరిత్ర | 1-11 |
| ,, | పరపాకంబుల గోరి .. | శశాంక విజయం | అవతా. 20 |
| 13 | అరిజూచున్ .. కేళీ గతిన్ | ఉత్తర హరివంశం | 1-164 |
| ,, | పరుజూచున్ .. హేలాగతిన్ | భాగవతం | ద. ఉ. 178 |
| 14 | నలినసంభవు వాహనము .. | శృంగార నైషధం | 2-49 |
| ,, | చిన్ని వెన్నెల కందు .. | మనుచరిత్ర | 2-43 |
| 15 | హృదయగతిన్ పురాతన.. | కవికర్ణ రసాయనం | పీఠిక-18 |

* వావిళ్ల ప్రతి (1942)

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. NARLA
D. P. R. L.
Acc. [illegible]

| పుట | ఉదాహృత పద్యాదులు | కృతి | వివరం |
|---|---|---|---|
| 27 | మావిగున్న కొమ్మను పాడు టేల? | కృష్ణపక్షం..* | పుట 30 |
| 32 | కోటి చేతులు చాపి .. | కృష్ణ శాస్త్రి గేయం | 'ఆకలి' |
| 36 | దీనా దీన ముఖైః.. | సుభాషిత త్రిశతి | వైరాగ్య-21 |
| 37 | గంగా తరంగ .. | ,, | వైరాగ్య-24 |
| 38 | వింధ్య మాకిడినట్లుండె .. | కాశీఖండం | 7 - 55 |
| 39 | సక్తు ప్రస్థుని గాథ | భారతం – అశ్వమేధ | 4- 218 |
| 41 | అవని అంతా పెద్ద అక్షయపాత్ర.. | మహతి | గీతం 53 |
| 49 | రాటనముల వాలి .. | బసవపురాణం | పంక్తి. 237 |
| 50 | ఉప్పన పట్టె లాడు నెడ .. | ఉత్తర హరివంశం | 4 - 155 |
| ,, | విరుతలు తీరైన గొడెలు | పల్నాటి వీర చరిత్ర | 45 - 28 |
| ,, | అత్తీవంచ, తిగ, దుగయు .. | ఉత్తర హరివంశం | 3 – 121 |
| ,, | గుమ్మడికాయలు కొంతసేపాడి .. | పల్నాటి వీర చరిత్ర | 37 – 98 |
| ,, | పోకలాటలచేత బుచ్చు ముప్పొద్దు .. | ,, | 38 - 119 |
| 51 | రూకల కుప్పలు రూఢిగ నాడు .. | ,, | 38 - 125 |
| ,, | సరిలేని అంజి.. | భోజరాజీయం | 5 -76 |
| ,, | విమల చంద్రోదయ.. | శివరాత్రి మాహాత్మ్యం | 2 – 87 |
| ,, | చతురంగంబున.. | సింహాసన ద్వాత్రింశిక | 10– 89 |
| 52 | కడు మెచ్చుగ నాడుదు.. | ,, | 10 –91 |
| ,, | అంభోధరము క్రింద .. | పాండురంగ మాహాత్మ్యం | 3 - 77 |
| 53 | తిన్న డాడిన ఆటలు | కాళహస్తి మాహాత్మ్యం | 3 – 33 |
| ,, | 'హంస వింశతి' నాటి ఆటలు | హంసవింశతి | 3 –146 |

*కృష్ణపక్షము - ప్రవాసము - ఊర్వశి (1975 ముద్రణ)

B CZ

A0UA102B137
BC

# కృష్ణశాస్త్రి సాహితి

ఇంతవరకూ పుస్తకరూపంలో రాని
వచన, పద్య, గేయ రచనలు

**శ్రీ శ్రీ 'ఆస్వాదానికి ఆహ్వానం' తో**

**ఇంపైన కూర్పుతీర్పులతో వెలువడుతున్నవి!**

– ఇప్పుడు అందిస్తున్నవి –

వ్యాసావళి - 4 సంపుటాలు :
**కవి పరంపర, కవితా ప్రశస్తి, మహావ్యక్తులు,**
**అమూల్యాభిప్రాయాలు**

గేయసంహిత – 2 భాగాలు :
**అమృత వీణ, మంగళ కాహళి**

– త్వరలో రానున్నవి –

మూగ నయాక (రకరకాల రచనలు): 1, 2, 3 & 4
**సొంత గొడవలు, పాత కథలు, హితులు సన్నిహితులూ,**
**ఇష్టాగోష్ఠి**

కవితాసంకలనం :
**బదరిక**

శ్రవ్యనాటికలు - 4 సంపుటాలు :
**క్షీరసాగరమథనం, అరుణరథం, విద్యాపతి,**
**కొత్త కోవెల**

బాలల పాటలు :
**పిల్లల రాజ్యం**

వెండి తెర పాటలు – 2
**గోరింట**

రాజహంస ప్రచురణలు

9, జగదాంబాళ్ వీధి, మద్రాసు - 600 017

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B137 |
| పుస్తకం పేరు | కృష్ణశాస్త్రి వ్యాసావళి04 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | [illegible] |
| వెనుక అట్ట | [illegible] |
| మొత్తం పేజీలు | 123 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CZ13CC |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Bhargavi |
| పేజీలు విడదీసినది | Bhargavi |
| స్కాన్ చేసినది | Lavanya |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good ✓ |